RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 06.03.2026 | సంపుటి :12 సంచిక : 226 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## అయతుల్లా అలీ ఖమేనీకి భారత్ అధికార నివాళి



### సుప్రీం లీడర్ మృతికి సంతాపం

- రాయబార కార్యాలయంలో విక్రమ్ మిస్రీ సంతకం
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకి జైశంకర్ ఫోన్
- ఒమన్ విదేశాంగ మంత్రితోనూ మాట్లాడిన భారత విదేశాంగ మంత్రి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారత్ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లిన భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ భారత్ తరపున సంతాప సందేశాన్ని రాశారు. అనంతరం ఇరాన్ రాయబారితో మిస్రీ మాట్లాడారు. ప్రస్తుతం ఇరాన్‌లో నెలకొన్న పరిస్థితులపై వారు చర్చించారు. ఇటీవల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు దాడిచేసి ఆ దేశపు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హతమార్చాయి. దాంతో పొరుగు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. దాడులు, ప్రతిదాడులతో మధ్యప్రాచ్యం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రపంచదేశాలకు చమురు సరఫరాలో జీవనాడి లాంటి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతిపై భారత్ సంతాపం తెలిపింది. ఈ మేరకు దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లిన భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. మన దేశం తరపున సంతాప సందేశాన్ని రాశారు. అనంతరం ఇరాన్ రాయబారితో మిస్రీ మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై

మిగతా 2లో..

## యుద్ధంతో సమస్యలు పరిష్కరించలేం

- పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో యుద్ధాలకు త్వరగా ముగింపు పలకాలి: మోదీ
- మధ్యవర్తిత్వం చేద్దాం రండి
- ఫ్రాన్స్ అధ్యక్షుడు మైక్రాన్‌కు ప్రధాని ఫోన్
- యుద్ధంపై దౌత్యానికి పిలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సైనిక ఘర్షణల ద్వారా ఏ సమస్య నూ పరిష్కరించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో యుద్ధాలకు త్వరగా ముగింపు పలకాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో..



## ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక నేటి నుంచి

### 15 వరకు పది రోజులపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్(జనంసాక్షి):** 'ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 6 నుంచి 15 వరకు పది రోజులపాటు అన్ని గ్రామ పంచా యతీల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వ హించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. నేటి నుంచి ఈ డ్రైవ్ కొనసాగ నుంది. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకా లపై అవగాహన కల్పించడంతోపాటు, పరిశుభ్రత, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పది రోజుల కార్యక్రమాల పర్య వేక్షణకు ప్రత్యేక నోడల్ సెల్‌ను ఏర్పాటు చేయాల ని, ప్రతిరోజూ పురోగతి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. '6న ఉమ్మడి జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహిం చనున్నట్లు తెలిపారు. మంచి పనితీరు కనబర్చిన కార్యాలయాలు, సంస్థలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పత్రాలు అందించాలని' ఉత్తర్వుల్లో ఆయన వెల్లడించారు.



హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారిని రాజ్యసభ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

## రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేంనరేందర్ రెడ్డి


- నామినేషన్లను దాఖలు చేసిన ఇరువురు
- సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేల రాక
- ముగిసిన రాజ్యసభ నామినేషన్లు
- ఒక ఇండిపెండెంట్ పోటీ
- పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయించని ఇండిపెండెంట్.. తిరస్కరణకు గురయ్యే అవకాశం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌తో పాలు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ తరపున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం

మిగతా 2లో..

## తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

- మహారాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ నూతన గవర్నర్‌గా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరిస్తోన్న శివప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. నాగాలాండ్ గవర్నర్‌గా నందకిశోర్ యాదవ్, బిహార్ గవర్నర్‌గా విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.



## 'పది' పరీక్షలకు అంతా సిద్ధం

- తెలంగాణలో 14 నుంచి పరీక్షలు
- వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం

**హైదరాబాద్(జనంసాక్షి):**పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల ఎస్ఎస్‌సీ బోర్డులు పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికారులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మనమిత్ర (వాట్సాప్ నంబర్ 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్

మిగతా 2లో..

## యుద్ధం వేళ కీలక పరిణామం

### శక్తిమంతమైన అణు క్షిపణిని పరీక్షించిన అమెరికా

**వాషింగ్టన్(జనంసాక్షి):**పశ్చిమాసియాలో యుద్ధం వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణిని అమెరికా పరీక్షించింది. మంగళవారం (మార్చి 3) ఈ పరీక్ష జరగ్గా.. అందుకు సంబంధించిన వివరాలు తాజాగా బయటికొచ్చాయి. కాలిఫోర్నియా తీరంలోని వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ బేస్ నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు మినిట్‌మ్యాన్-3ను అమెరికా ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ పరీక్షించింది. ఆయుధాల్లేని ఈ ఖండాంతర క్షిపణి మార్షల్ ఐల్యాండ్స్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించినట్లు యూఎస్ స్పేస్‌ఫోర్స్ వెల్లడించింది. ఈ పరీక్ష విజయవంతమైందని,

మిగతా 2లో..



# తగ్గేదేలే అంటున్న ఇరాన్

### అమెరికా ఎయిర్ బేస్‌లపై ముమ్మరదాడులు • ఇజ్రాయిల్‌కూ ధీటుగా జవాబు

### మిస్సైళ్లు, డ్రోన్‌లతో విరుచుకుపడుతున్న ఐఆర్‌జీసీ • కొత్త సుప్రీం ఎవరొచ్చినా హతమారుస్తామంటున్న ఇజ్రాయెల్



ఇరాన్ క్షిపణిదాడిలో ధ్వంసమైన సౌదిఅరేబియాలోని అమెరికా ఎయిర్‌బేస్‌లు

- ఇరాన్ యుద్ధనౌకపై దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరిక
- అమెరికా ట్యాంకర్‌పై ఐఆర్‌జీసీ దాడి
- పాలన మార్పునకు ప్రయత్నిస్తే మీ దేశంలో డిమోనా అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం.. ఇజ్రాయెల్‌కు ఇరాన్ వార్నింగ్
- అమెరికా దాడుల వేళ.. శ్రీలంక వైపు మరో ఇరాన్ యుద్ధనౌక!

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఇటీవల దీటుగా బదులిస్తోంది. దాడుల్లో ఎక్కడా తగ్గడం లేదు. తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేపట్టింది. భారీ ఆయుధాలతో విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓవైపు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులే కాకుండా యూఏఈ, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి 10 దేశాలపై ఇరాన్ ఏకధాటిగా దాడి చేస్తున్న విధానాన్ని చూస్తే ఆ దేశం వద్ద భారీ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయనే సందేహం తలెత్తకమానదు. అయితే.. దశాబ్దాలుగా ఆ దేశం ఎంతో కృషిచేసి ఇంత భారీఎత్తున ఆయుధ సామగ్రిని

మిగతా 2లో..

## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశం లేదు



- హైకోర్టుకు వివరించిన తెలంగాణ ప్రభుత్వం
- అవతకవకలు, డబ్బు దుర్వినియోగంపైనే దృష్టి
- తదుపరి విచారణ 12కు వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందని తెలిపారు. ఎవరినో టార్గెట్ చేసేందుకు జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఏర్పాటు.. అందించిన నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏజీ, పిటిషనర్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మాణంలో అధికార దుర్వినియోగం జరిగిందని హైకోర్టుకు ఏజీ వెల్లడించారు. ఇక పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. పలువురిపై కమిషన్ తప్పుడు అభియోగాలు నమోదు చేసిందన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో బిజినెస్ రూల్స్ ఎక్కడా ఉల్లంఘించ లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా ఆరోపణలు చేయడం సరికాదంటూ న్యాయవాది తన వాదనలు వినిపించారు. తప్పుడు విధానంలో కమిషన్ నోటీసులు ఇచ్చిందని తెలిపారు.

మిగతా 2లో..



ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

## కడియం విచారణ పూర్తి

దానం విచారణ 7కు వాయిదా

2లో..

## రాజ్యసభకు వెళ్తున్నా..

- నితీశ్ కుమార్ ప్రకటన
- బీహార్‌తో అనుబంధం కొనసాగుతుందని వెల్లడి
- రాజ్యసభకు నామినేషన్ వేసిన బీహార్ ముఖ్యమంత్రి
- హాజరైన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా
- బీజేపీకి దక్కనున్న కొత్త ముఖ్యమంత్రి పదవి

9లో..



## మూసీ పేరుతో ముంచేస్తున్నారు



- ప్రాజెక్టు పేరుతో భారీ దోపిడీకి కాంగ్రెస్ కుట్ర
- మురుగు నీటి శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ
- నాగోల్ సమీపంలో నిర్వాసితులను కలిసిన కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను

మిగతా 2లో..

## ఖమేనీకి భారత్ అధికార నివాళి

చర్చించినట్టు తెలుస్తోంది.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో గురువారం మధ్యాహ్నం ఫోన్‌లో సంభాషించినట్లు భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఒమన్ విదేశాంగ మంత్రితోనూ ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాలో జైశంకర్ పోస్టులు చేశారు.

## యుద్ధంతో సమస్యలు పరిష్కరించలేం

భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో చర్చలు నిర్వహించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఇటీవల ఈయూతో కుదుర్చుకున్న 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం'.. భారత్, ఫిన్లాండ్‌ల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. "భారత్, ఫిన్లాండ్‌లకు చట్టబద్ధ పాలన, చర్చలు, దౌత్యమార్గాలపై విశ్వాసం ఉంది. కేవలం సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం. అది ఉక్రెయిన్, లేదా పశ్చిమాసియా.. ఏదైనా కావచ్చు. వివాదాలను వీలైనంత త్వరగా ముగించేందుకు, శాంతిని నెలకొల్పేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తూనే ఉంటాం" అని మోదీ తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఫిన్లాండ్ అధ్యక్షుడితో చర్చల్లో భాగంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. "ఏఐ నుంచి 6జీ వరకు, క్లీన్ ఎనర్జీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు అనేక హైటెక్ రంగాల్లో పరస్పర సహకారానికి కట్టుబడి ఉన్నాం" అని చెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం భారత్‌కు వచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపట్టారు.

**ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు మోడీ ఫోన్**

మధ్యప్రాచ్యం సంక్షోభం వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేశారు. యుద్ధం విషయంలో దౌత్యానికి మోడీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో మోడీ పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్, అమెరికా మద్దతు గల గల్ఫ్ దేశాలపై విరుచుకుపడింది. గల్ఫ్ దేశాల్లో భారీగా ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో గల్ఫ్ దేశాధినేతలకు మోడీ ఫోన్ చేసి ఖండించారు. తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఫోన్ చేసి యుద్ధం ముగింపునకు దౌత్యం నిర్వహించాలని కోరారు. 'ఈ రోజు నా స్నేహితుడు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో మాట్లాడాను. పశ్చిమాసియా పరిస్థితి, చర్చలు, దౌత్యానికి సంబంధించి మా ఉమ్మడి ఆందోళనలను చర్చించాం. శాంతి, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించడానికి మేము దగ్గరగా పాల్గొనడం, ప్రయత్నాలను సమన్వయం చేయడం కొనసాగిస్తాం.' అని రాసుకొచ్చారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఈ సంభాషణ జరిగిందని.. ప్రపంచ నాయకులు సంయమనం, దౌత్యపరమైన చర్చలకు మోడీ పిలుపునిచ్చారు. గత నెల 28న ఇరాన్ అధ్యక్ష భవనంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేశాయి. దీంతో ఖమేనీ సహా కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు చనిపోయారు. అనంతరం ఇరాన్ కూడా ప్రతీకారంగా దాడులకు దిగింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

## కడియం విచారణ పూర్తి..

హైదరాబాద్(జనంసాక్షి):పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. గురువారం కడియం శ్రీహరిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ ముగిసింది. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. ఆయన విచారణను శనివారానికి అంటే.. మార్చి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు సూచించారు. దీంతో ఈ పిటిషన్లను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.

## 'పది' పరీక్షలకు అంతా సిద్ధం

(8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలంగాణ అభ్యర్థులు 80969580 96 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి.విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి.అక్కడ ఎస్ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్ఎస్‌సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

## మార్చి ఆఖరున అకాల వర్షాలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో మార్చి నెల చివరలో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెదర్ మ్యాన్ వెల్లడించారు. ఈ నెల మధ్యలో అంటే 18, 19 తర్వాత ఉరుములు మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. అయితే అప్పటివరకు ఎండలు ఇదేస్థాయిలో కొనసాగుతాయని వెదర్ మ్యాన్ చెప్పారు. ఈస్ట్ తెలంగాణ జిల్లాల్లో ఏకంగా 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపారు. హైదరాబాద్‌లో 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించారు.

## ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఉద్యోగి

హైదరాబాద్(జనంసాక్షి): జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అకౌంట్ సెక్షన్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్య వంశీ సంతోష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ రేంజ్ 2 ఏసీబీ అధికారులు కార్యాలయంపై మెరుపు దాడి చేసి రూ.35 వేలు లంచం తీసుకున్న ఎగ్జామినర్‌ను పట్టుకున్నారు.రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతులను ఉన్నతాధికారులకు పంపాలని కోరగా అందుకు రూ.40 వేలు డిమాండ్ చేసి రూ.35వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎగ్జామినర్‌ను పట్టుకుని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.





## రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

అదృష్టంగా భావిస్తున్నట్లు అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సిటింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ ఎంపిక చేయగా ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ వచ్చారు. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చ లు, సంప్రదింపుల తర్వాత వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. ఈయనకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టిగా కోరడం, అందరితో సన్నిహిత సంబంధాలుండే నరేందర్‌రెడ్డి పేరుపై ఎవరి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో అధిష్ఠానం కూడా చివరకు సీఎం మాటకే ప్రాధాన్యం ఇచ్చింది. ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని రంగంలోకి దింపితే రెండో స్థానానికి పోటీ అనివార్యమవుతుంది. ఆ పార్టీ పోటీలో లేకుంటే రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకుంటుంది. మొదటి స్థానానికి అభిషేక్ సింఘ్వీ ఎన్నికకు ఎలాంటి సమస్య లేదు. రెండో స్థానానికి అవసరమైన మెజార్టీ కాంగ్రెస్‌కు లేదు. ఎంఐఎంపై ఆధారపడాల్సి ఉంటుంది. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. అయితే ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది.

**ముగిసిన రాజ్యసభ నామినేషన్లు**

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. నామినేషన్లు ముగ్గురు వేసినా, ఇండిపెండెంట్‌గా వేసిన సాయి అనే వ్యక్తి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయాల్సి ఉన్నా, అతను కేవలం నామినేషన్ వేశారు. దీంతో స్క్రూటినీలో చెల్లుబాటు కాదు. ఈ కారణంగా ఇద్దరి ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ తరపున తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్ పత్రాలు సమర్పించారు. సింఘ్వీ.. మూడు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేయగా.. వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్‌లు, ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి పరిశీలించనున్నారు.

### పుదుచ్చేరి అసంబ్లీ ఎన్నికల

## ప్రత్యేక అబ్జర్వర్‌గా పొన్నం



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ హైకమాండ్ కీలక బాధ్యతలు అప్పగించిం. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమించిం. పొన్నం ప్రభాకర్‌తో పాటు కర్ణాటక హెల్త్ మినిస్టర్ నేష్ గుండు రావును కూడా ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమించిం. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం. ఇది నాలుగు జిల్లాలను కలిగి ఉం. పుదుచ్చేరి, కారైకల్, మాహె, యానాం. 30 శాసనసభ నియోజకవర్గ స్థానాలు ఉన్నాయి. మరోవైపు.. పుదుచ్చేరి రాజకీయాల్లో ఇప్పుడు ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిం. 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రధాన పార్టీల మధ్య ముక్కోణపు పోరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, డీఎంకే కలిసి పోటీ చేయబోతున్నాయి. తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని కాంగ్రెస్, డీఎంకే చూస్తున్నాయి

## జాతీయ పార్టీల ఆదాయం రూ.7,960 కోట్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలోని ఆరు జాతీయ పార్టీలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.7,960.09 కోట్ల ఆదాయం సమకూరింది. అందులో అత్యధికంగా 85.03 శాతం వాటా భాజపా ఖాతాలోకే వెళ్లినట్లు 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' తెలిపింది. ఎన్నికల సంఘానికి ఆయా పార్టీలు సమర్పించిన ఆడిట్ నివేదికల ఆధారంగా ఏడీఆర్ ఈ లెక్కలు వెల్లడించింది.ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కాషాయ పార్టీ రూ.6,769.14 కోట్ల ఆదాయం ప్రకటించింది. రూ.918.28 కోట్లతో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. రూ.172.60 కోట్లతో సీపీఎం, రూ.58.58 కోట్లతో బీఎస్పీ, రూ.39.28 కోట్లతో ఆప్, రూ.2.18 కోట్లతో ఎన్‌పీఈపీ (నేషనల్ పీపుల్స్ పార్టీ)లు వరుస స్థానాల్లో నిలిచాయి. భాజపా తన ఆదాయంలో 55.76 శాతం (రూ.3,774.58 కోట్లు) మేర ఖర్చు చేసింది. కాంగ్రెస్ రూ.1,111.94 కోట్లు ఖర్చు చేసింది.ఇది పార్టీ మొత్తం ఆదాయం కంటే 21.09 శాతం (రూ.193.66 కోట్లు) ఎక్కువ. బీఎస్పీ సైతం తనకు సమకూరిన ఆదాయం కంటే 81 శాతం (రూ.47.71 కోట్లు) అధికంగా ఖర్చు చేసింది.

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

- దిగుమతుల సుంకాలను తిరిగి చెల్లించాల్సిందే
- అమెరికన్ ట్రేడ్ కోర్టు తీర్పు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దిగుమతులపై విధించిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిందేనని ట్రేడ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లను సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఇకపై ఈ టారిఫ్‌ల వసూళ్లు నిలిపివేయాలని కోర్టు అధికారులకు ఆదేశించింది. అయితే, ఇప్పటికే వసూలు చేసిన సుంకాలను తిరిగి ఇవ్వాలా లేదా అన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. తాజాగా ట్రేడ్ కోర్టు తీర్పుతో ఆ విషయంపై స్పష్టత వచ్చింది. అట్మస్ ఫిల్ట్రేషన్ అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్, ఈ సుంకాలు చెల్లించిన దిగుమతిదారులు రీఫండ్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. అలాగే టారిఫ్‌ల రీఫండ్‌కు సంబంధించిన కేసులను తానే పర్యవేక్షిస్తానని తెలిపారు. అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై విధించిన సుంకాలు సాధారణంగా 'లిక్విడేషన్' అనే ప్రక్రియ ద్వారా ఖరారు అవుతాయి. ఈ ప్రక్రియలో కస్టమ్స్ అధికారులు నిర్ణయించిన సుంకాలపై దిగుమతిదారులు అభ్యంతరం వ్యక్తం చేయడానికి 180 రోజుల గడువు ఉంటుంది. ఆ గడువు దాటితే నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిందే. ఇప్పటికే లిక్విడేషన్ ప్రక్రియ పూర్తయిన దిగుమతుల విషయంలో కూడా టారిఫ్‌లు లేకుండా కొత్తగా లెక్కలు చేయాలని సూచించింది. ఇదిలా ఉండగా, ప్రపంచ దేశాలపై సుమారు 15 శాతం వరకు కొత్త సుంకాలను విధించే ప్రతిపాదన ఈ వారం అమల్లోకి రావొచ్చని అమెరికా ఆర్థిక శాఖ కార్యదర్శి స్కాట్ బెసెంట్ తెలిపారు.



## యుద్ధం వేళ కీలక పరిణామం

అత్యంత కచ్చితత్వంతో క్షిపణి లక్ష్యాన్ని చేరుకుందని తెలిపింది. క్షిపణిలోని ఒక్కో విభాగం పనితీరును స్పష్టంగా తెలుసుకునేందుకు ఈ పరీక్ష చేపట్టినట్లు యూఎస్ స్పేస్‌ఫోర్స్ పేర్కొంది. అయితే, ఇరాన్‌పై దాడుల వేళ.. ఈ పరీక్ష నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.మినిట్‌మ్యాన్-3లో అత్యంత శక్తిమంతమైన మార్క్-21 రీఎంట్రీ వెహికల్ ఉంటుంది. దీనిలో న్యూక్లియర్ పేలోడ్‌ను అమర్చవచ్చు. జపాన్‌లోని హిరోషిమాపై జారవిడిచిన అణుబాంబు కంటే 20 రెట్లు శక్తిమంతమైన అణు వార్‌హెడ్‌లను ఇది మోసుకెళ్లగలదు. గతంలో పలుమార్లు దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. ఈ క్షిపణి గంటకు 15వేల మైళ్ల వేగంతో 6వేల మైళ్ల దూరం వరకు ప్రయాణించగలదు. దీన్ని ప్రయోగించిన కొన్ని నిమిషాల్లోనే లక్ష్యాన్ని ఛేదించగలదు. చివరగా గతేడాది నవంబరులో మినిట్‌మ్యాన్-3ని అమెరికా పరీక్షించింది.


## మూసీ పేరుతో ముంచేస్తున్నారు

బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశ్యం లేదు

కాళేశ్వరం ప్రాజెక్ట్ స్థల మార్పిడి, ప్రాజెక్ట్ ఖర్చు అంచనాతోపాటు నిర్మాణ సంస్థలకు ఇవ్వడంలో ఎవరు లబ్ది పొందలేదన్నారు. ఈ కాళేశ్వరం కమిషన్ నివేదిక చెల్లదని.. దీనిపై స్టే ఇవ్వాలని హైకోర్టును పిటిషనర్ న్యాయవాది కోరారు. ఈ వాదనలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణ మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# తగ్గేదేలే అంటున్న ఇరాన్





నిర్మించుకుంది. మరి ఆ దేశం ఆయుధగారాన్ని పెంచుకోవడంలో చైనా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా స్పష్టమవుతోంది. ఆ మీడియా నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ముందే ఇరాన్‌కు చైనా ఆయుధాలను సరఫరా చేసినట్టు తెలుస్తోంది. వీటిలో ఆయుధాల్లో షాహిద్ క్లాస్ కామికేజ్ డ్రోన్ల నుంచి ఫత్తాహ్ క్లాస్ హైపర్‌సోనిక్ మిసైల్స్ వరకు ఇరాన్ భద్రతా వ్యూహంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి శత్రు దేశాలపై దాడిచేయగల సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉంటాయి. అయితే.. ఇరాన్ ఈ ఆయుధాలను అభివృద్ధి చేసుకోవడంలో చైనా పాత్ర ఎంతమేర ఉందనేదానిపై స్పష్టత లేదు. ఇక.. గత శుక్రవారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు దాడిచేసి.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ ఘటన తర్వాత ఇరాన్‌కు ప్రమాదకర ఆయుధాలను, అదనపు రక్షణ ఎలా పొందాలో చైనా వివరించిందని మధ్యప్రాచ్యంలోని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఇదిలా ఉండగా.. చైనా తయారుచేసిన సీఎం 302 యాంటీ షిప్ క్షిపణుల కొనుగోలుపై ఇరాన్-చైనా ఒప్పందం చేసుకోవాలనుకున్నట్టు రాయిటర్స్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఇరాన్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆయుధాలలో ఎక్కువ భాగం ఆ దేశంలోనే ఉత్పత్తి అయినవే అయినప్పటికీ.. వాటిలో చాలావరకు చైనా పాత డిజైన్ల ఉత్పత్తులు లేదా చైనా తయారీ భాగాలపై ఆధారపడి ఇరాన్ రూపొందించుకుని ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. కొన్నేళ్లుగా ఇరాన్ ఆయుధగార నిర్మాణంలో చైనా కీలకంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశం సాయంలేకుండా.. ఇరాన్ ఇంత పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్ల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అసాధ్యమని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు. కాగా.. ఇరాన్‌కు1979-1989 కాలంలో తొలిసారి ఆయుధాలు సరఫరా చేసింది చైనా. పశ్చిమ దేశాలు విధించిన ఆయుధ నిషేధాల నడుమ 1986లో హై 2, సీ 801 యాంటీ షిప్ వ్యవస్థలను నాడు చైనా సరఫరా చేసింది. ఇరాన్‌కు చైనా అతిపెద్ద ఆయుధ సరఫరాదారుల్లో ఒకటని స్టాక్‌హోమ్ పీస్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. విమానాలు, క్షిపణులు, తుపాకీ వ్యవస్థలు సహా రక్షణ పరికరాలను అందించిందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. 2005లో ఇంటర్నేషనల్ ఆటోమిక్ ఎనర్జీ ఏజెన్సీ ఇరాన్ అణు వ్యాప్తి నిరోధక ఒప్పందం పాటించలేదనే కారణంగా ఇరాన్‌కు చైనా ఆయుధ సామగ్రి సరఫరాను నిలిపివేసింది. అమెరికా ఆంక్షలు చైనా ఆయుధ విక్రయాలను మరింత నియంత్రించాయి.

ఇరాన్ యుద్ధనౌకపై దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం

ఇరాన్‌పై చేస్తున్న పోరులో భాగంగా.. ఆ దేశ యుద్ధనౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా ఖండించారు. దీనికి తగిన బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. ఇరాన్‌కు 2000 మైళ్ల దూరంలో సముద్రంలో అమెరికా దారుణానికి పాల్పడిందని అరాగ్చీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ నౌక భారతదేశానికి వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. అక్కడినుంచి తిరిగివెళుతుండగా అంతర్జాతీయ జలాల్లో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా దేనాపై దాడి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి అగ్రరాజ్యం తీవ్రంగా పశ్చాత్తాపపడాల్సిన సమయం త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. శ్రీలంక భద్రతా దళాలు కొందరిని రక్షించగా, 87 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ నేవీ స్థావరంపై దాడి జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇది అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఉంటుంది. పేలుళ్ల కారణంగా జరిగిన నష్టం గురించి ఇంకా తెలియరాలేదు.పశ్చిమాసియాలో తీవ్రస్థాయిలో యుద్ధం కొనసాగుతోంది. హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడి చేసి, ముంచేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇరాన్ దీనికి ప్రతీకారం తీర్చుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అమెరికా ట్యాంకర్‌పై దాడి చేసినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.ఇరాన్ మీడియా ప్రకారం.. పర్షియన్ గల్ఫ్‌లోని యూఎస్ ట్యాంకర్‌పై క్షిపణితో దాడి చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. నౌక నుంచి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నట్లు వెల్లడించింది. ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. తమ యుద్ధనౌకపై దాడికి ప్రతిస్పందనగానే దాడి జరిగిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. అటు అమెరికా కూడా దీనిపై ఇంకా స్పందించలేదు.భారత్‌లోని విశాఖపట్నం నుంచి ఇరాన్‌కు తిరిగి వెళ్తున్న ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడి సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో 87 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొంతమందిని శ్రీలంక దళాలు రక్షించాయి. మరికొంతమంది గల్లంతయ్యారు. అమెరికా దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించారు. ఈ క్రమంలో యూఎస్ ట్యాంకర్‌పై దాడి జరగడం గమనార్హం.

పాలన మార్పునకు ప్రయత్నిస్తే మీ దేశంలో డిమోనా అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం: ఇరాన్

పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నాలు చేస్తే.. ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది. తమ లక్ష్యాలను చేరుకున్నామని ప్రకటిస్తూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎప్పుడైనా యుద్ధాన్ని ఆపేయవచ్చంటూ వార్తలు రావడంపై ఇజ్రాయెల్ అధికారి స్పందించారు. ఇరాన్‌లో పాలకులు మారేవరకు అమెరికా యుద్ధం కొనసాగిస్తుందని జెరూసలెం పోస్టుతో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఇరాన్ ఇజ్రాయెల్‌లోని అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామంటూ తాజాగా హెచ్చరికలు చేసినట్లు టెహ్రాన్ సైనికాధికారిని ఉటంకిస్తూ ఆ దేశ మీడియా పేర్కొంది. పశ్చిమాసియాలో చమురు మౌలిక సదుపాయాలను తమ క్షిపణులు లక్ష్యంగా చేసుకుంటాయని ఆయన బెదిరించారు.

అమెరికా దాడుల వేళ.. శ్రీలంక వైపు మరో ఇరాన్ యుద్ధనౌక!

ఇరాన్‌కు చెందిన యుద్ధ నౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి ముంచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి కొన్ని గంటలు కావస్తుండగా.. మరో ఇరాన్ నౌక శ్రీలంక దిశగా వెళ్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని శ్రీలంక మంత్రి నలిందా జయతిస్సా వెల్లడించారు. తమ దేశ ప్రాదేశిక జలాల దగ్గరలో ఆ నౌక ఉందని, అందులో ఉన్న వారి ప్రాణాలను రక్షించేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

## పశ్చిమ బెంగాల్ గవర్నర్ రాజీనామా

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ రాజీనామా చేశారు. ఢిల్లీలో రాజీనామా చేసినట్లు ఆ రాష్ట్ర లోక్‌భవన్ వెల్లడించింది. ఈ విషయాన్ని ధ్రువీకరించిన ఆనంద బోస్.. రాజీనామాకు కారణాలు మాత్రం వెల్లడించలేదు. గురువారం ఉదయమే ఆనంద బోస్ తన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి పంపించినట్లు తెలిసింది.పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నవంబర్ 17, 2022న బాధ్యతలు చేపట్టిన ఆనంద బోస్.. దాదాపు మూడున్నరేళ్లు సేవలందించారు. మరోవైపు తాజా పరిణామంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు.నూతన గవర్నర్‌గా ఆర్ఎన్ రవి రానున్నట్లు కేంద్ర హోంశాఖ నుంచి తెలిసిందన్నారు.

## 8న బమ్మకున్ - ఉద్ - దౌలా చెరువు ప్రారంభం

- సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహం
- ఏర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్, మార్చి 05 (జనంసాక్షి) :** చారిత్రక బమ్మకున్ - ఉద్ - దౌలా లేక్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8న ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెరువును ప్రారంభించనున్నారు. కూకట్‌పల్లిలోని నల్లచెరువు ప్రారంభోత్సవానికి కూడా ముహూర్తం ఖరారైంది. ఈ నెల 9న నల్లచెరువును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బమ్మకున్ - ఉద్ - దౌలా చెరువును గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు సుందరీకరణ పనులను తిలకించారు. చెరువు కట్టతో పాటు.. ఖాళీ ప్రదేశాల్లో నాటిన ఔషధ మొక్కలను పరిశీలించారు. పిల్లలు ఆడుకునే ప్లే ఏరియాలతో పాటు.. అన్ని వయసులవారు సేద దీరేందుకు వీలుగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గజబోలు(గుమ్మటాలు)ను చూశారు. పాతబస్తీ సంప్రదాయాలు ఉట్టి పడేలా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, చెరువు చరిత్రను వివరించిన బోర్డులను పరిశీలించారు. చెరువును ప్రారంభించిన తర్వాత జరగనున్న సభ ఏర్పాట్లను కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు. హైడ్రా అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు పోలీసు శాఖ అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఉన్నారు. సభా ఏర్పాట్లపై సమీక్షించారు.

## నిందితులను తక్షణం శిక్షించాలి



- ప్రజాసంఘాల నిరసనలకు సిపిఐ(ఎం) మద్దతు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక, దళిత కుటుంబాలపై జరిగిన దాడిని, రెండు నెలల పసిపాప హత్యను ఖండిస్తూ రజక, ప్రజా సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలలో అరెస్టయిన వారిని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, సీనియర్ నాయకులు డీజీ నరసింహారావు కలిసి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కుమ్మెర గ్రామ సర్పంచ్ రాంరెడ్డి, ఇతర నిందితులపై ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద గానీ, హత్య కేసు గానీ నమోదు చేయలేదని, రాష్ట్రమంతా ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు ఘటనను ఖండిస్తున్నామని, హోం మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమని, బాధితులకు అండగా నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని జాన్‌వెస్లీ అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ కేసు విచారణ కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్ష పడేలా చూడాలి. బాధితులకు న్యాయం చేయకపోతే, రాబోయే శాసనసభ సమావేశాల సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని, నేడు, రేపు ప్రజాసంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని, సంపూర్ణమద్ధతు తెలియజేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు

- 34 మ్యూల్ అక్కౌంట్ల గుర్తింపు
- అనుమానిత లావాదేవీలు జరిగితే ఫిర్యాదు చేయండి
- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం




**కరీంనగర్ బ్యూరో, 05 మార్చి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించిన మ్యూల్ అకౌంట్ దారులను కమిషనరేట్ వ్యాప్తంగా గుర్తించారు. కరీంనగర్ లోని నాలుగు ప్రధాన బ్యాంకుల్లో మొత్తం 34 మ్యూల్ ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 162 వరకు నిసిపి పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందినట్లు, ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు దాదాపు 1000కి పైగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటివరకు ఈ వ్యవహారంలో 20 కేసులు నమోదు చేయగా, నిందితులపై కొత్త చట్టం సెక్షన్ 112 బియన్ఎస్ ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ కొందరు వ్యక్తులు ఏజెంట్లు ఆశజూపే స్వల్ప కమీషన్లకు లొంగి, తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి లింక్ అయిన ఫోన్ నంబర్లను అపరిచితులకు అందజేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుండి దోచుకున్న సొమ్మును ఇతరుల ఖాతాల్లోకి (మ్యూల్ అకౌంట్లు) మళ్లించి, ఆపై తమ అవసరాలకు వాడుకుంటున్నారని వివరించారు. 'తెలియని వ్యక్తులకు మీ బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా వివరాలు చెప్పడం నేరం. అలా చేసిన వారిని సైబర్ నేరగాళ్లకు సహకరించిన నేరస్థులుగానే పరిగణిస్తామని సీపీ తెలిపారు. అపరిచితులకు మీ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, లేదా ఓటిపి వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకండి. నెలవారీ కమీషన్లు ఇస్తామంటూ మీ ఖాతాను వినియోగించుకుంటామని వచ్చే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. మీ ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. బ్యాంకు అధికారుల సమ న్వయంతో మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ వేగవంతం చేసి మిగిలిన నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామని గురువారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలునందు జరిపిన సమీక్షా సమావేశంలో సీపీ స్పష్టం చేశారు.

## దేశవ్యాప్తంగా 50 బాంబు బెదిరింపు మెయిల్స్..

### యువకుడు అరెస్ట్

**అహ్మదాబాద్ (జనంసాక్షి) :** వరుసగా నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడిని గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు 50కిగా బాంబు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. గత ఐదు రోజుల్లోనే వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్‌పై విచారణ జరపగా నిందితుడి వ్యవహారం తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు రోజుల్లో ముంబై, ఢిల్లీ నగరాలతోపాటు గుజరాత్, ఇతర రాష్ట్రాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. స్కూల్స్, మెట్రో స్టేషన్లు, ముంబై స్టాక్ ఎక్స్‌ఛేంజ్ సహా వివిధ సంస్థలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీనిపై ముంబై, గుజరాత్ సహా పలు చోట్ల ఫిర్యాదులు అందాయి. అందులో గుజరాత్ పోలీసులు ఈ అంశాన్ని మరింత సీరియస్‌గా తీసుకుని, తక్షణ విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సౌరవ్ విశ్వాస్ అనే 28 ఏళ్ల యువకుడు ఈ మెయిల్స్ పంపుతున్నట్లు గుర్తించారు. వెంటనే గుజరాత్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా నిందితుడి కోసం గాలించారు. పశ్చిమ బెంగాల్ చేరుకుని స్థానిక పోలీసుల సాయంతో సౌరవ్ విశ్వాస్‌ను అరెస్టు చేశారు.

# ఉద్యోగి పెన్షన్ క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్

- ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ అకౌంట్స్ సెక్షన్ ఆఫీసర్
- సొంత ఆఫీసులో పనిచేసిన ఉద్యోగి పెన్షన్ క్లియరెన్స్ కు రూ.40వేలు డిమాండ్
- డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



**సికింద్రాబాద్ (జనంసాక్షి) :** సికింద్రాబాద్ జీహెచ్ఎంసి కార్యాలయంలో పనిచేసి పదవీ విరమణ చేసిన నాలుగో తరగతి ఉద్యోగి పెన్షన్ ఫైల్ క్లియరెన్స్ కోసం రూ.40 వేలు లంచడం డిమాండ్ చేసిన జీహెచ్ఎంసీ అకౌంట్స్‌ఆఫీసర్ (ఏఓ) ను బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడి నుండి రూ.40 వేల లంచం డిమాండ్ చేసిన అధికారి గురువారం తన కార్యాలయంలోనే రూ.35 వేలు స్వీకస్తుండగా ఏసీబీ సిటీ రేంజ్-2 యూనిట్ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడు ఆంజనేయులు జీహెచ్ఎంసీలో మజ్దూర్‌గా(ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ ) గా పనిచేసి అక్టోబర్‌లో రిటైర్ అయ్యారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు పెన్షన్ మంజూరుకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన నివేదికను జీహెచ్ఎంసీ అకౌంట్స్ సెక్షన్లో అందజేశాడు.అయితే సెక్షన్ ఆఫీసర్ సూర్య వంశీ సంతోష్ గత ఆరు నెలలుగా ఈ ఫైల్ ను జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసుకు పంపకుండా తన వద్దే పెట్టుకున్నాడు.గత ఆరునెలలుగా కదలకపోవడంతో ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న ఆంజనేయులు ఫైల్ పంపించాలని సెక్షన్ ఆఫీసర్ సూర్యవంశీ సంతోష్‌ను వేడుకోగా, రూ.40వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తాను అంత ఇచ్చుకోలేనని, ఇదే కార్యాలయంలో పనిచేశానని వేడుకున్నా ససేమిరా అన్న అధికారి ఈ ఫైల్లో తప్పులున్నాయి... ఇలాగే పంపిస్తే నీ బెనిఫిట్స్ రావడానికి మరో ఆరునెలల సమయం పడుతుందని చెప్పాడు. చివరకు రూ.35వేలు ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుందని సూర్యవంశీ సంతోష్ తెగేసి చెప్పడంతో అందుకు ఒప్పుకున్న ఆంజనేయులు నేరుగా మూడు రోజుల క్రితం ఏసీబీ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఏబీసీ అధికారులు గురువారం ఆంజనేయులు ఫైల్ క్లియరెన్స్ కోసం డిమాండ్ చేసిన రూ35వేలను సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి లంచంగా తీసుకున్న రూ.30వేలు స్వాధీనం చేసుకుని, సూర్యవంశీ సంతోష్ ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. సూర్యవంశీ సంతోష్ ఇంటి దగ్గర కూడా అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన అనిల్ కుమార్ యాదవ్





**హైదరాబాద్ (జనంసాక్షి) :** వేం నరేందర్ రెడ్డి ని శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా వేం నరేందర్ రెడ్డి నివాసంలో కలిసి హార్దిక శు భాకాంక్షలు తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయని అన్నారు. భారతదేశ రాజ్య పాలన బాధ్యతలు కాంగ్రెస్ పార్టీకి అప్పగించడానికి ప్రజలు సమయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అగ్రరాజ్య అమెరికా అధ్యక్షుడికి నరేంద్ర సరెండర్ అయ్యాడని అది దేశ సమగ్రతకు విఘాతం అని అన్నారు. తెలంగాణ గడ్డ నుంచి ఢిల్లీ పార్లమెంట్ లోకి వేం నరేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహించడంతో దేశంలో "=ూ=జు" మార్క్ రాజకీయానికి తొలి అడుగు పడింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి మరో సారి అధికారంలోకి వస్తారని, దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిష్టిస్తారని తన ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కాంప్రమైజ్డ్ పీఎం ని దేశం చూసింది ఇకపై పోరాడే సత్తా ఉన్న వీరుడిని దేశం ప్రధానిగా చూడబోతుందని జోస్యం చెప్పారు.


## అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

- డబుల్ ఇంజన్ సర్కార్‌తో తగ్గిన తీవ్రవాద ప్రాబల్యం
- అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లోనూ పురోగతి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



**దిస్పూర్ (జనంసాక్షి) :** అస్సాం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రాయోజిత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు వేగవంతంగా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో గత ఐదేళ్లలో అస్సోంలో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని, దాదాపు 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి అందిస్తున్న సహాయ పునరావాస కారక్రమాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల వివరాలపైనా కేంద్ర మంత్రి ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఒక్క చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ఏకంగా 1 లక్షా 51 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందన్నారు. ఒక్క సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుతోనే 27 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏటా వృద్ధి రేటు పెరుగుతోందని, అదే సమయంలో క్రైం రేటు తగ్గుతోందని, కేంద్రం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాల అమలులతోనూ ముందంజలో ఉన్నట్లు వివరించారు. మైనింగ్ రంగంలో చేపట్టిన సంస్కరణలతో దేశంలో అసోం నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ సిబ్బంది పనితీరులోనూ ఎంతో మార్పు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలవల్లే అస్సోం రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మంత్రి బండి సంజయ్ కుమార్ అస్సాం రాష్ట్ర రాజధానిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర అతిథి గృహంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని దిమా హసావో జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం గౌహతిలోని ప్రసిద్ధ శక్తి పీఠమైన కామాఖ్య దేవి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకుని ఆలయ పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. కాగా బండి సంజయ్ రేపు(శుక్రవారం) ఉదయం గౌహతి నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి దిమా హసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు తీరు తెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు.

## నేడు ది కెమిస్ట్రీ ఆఫ్ లైఫ్ పుస్తకావిష్కరణ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ ఫౌండేషన్, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో వెనపల్లి భాస్కరరావు రచించిన ది కెమిస్ట్రీ ఆఫ్ లైఫ్ పుస్తకావిష్కరణ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో నిర్వహించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ కుమార్ మలుగరం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. "ది కెమిస్ట్రీ ఆఫ్ లైఫ్" అనే ఈ పుస్తకం ఆత్మకథ. హైదరాబాద్‌లోని బయో-కెమికల్, ఫార్మాస్యూటికల్ (ఔషధ) రంగం సాధించిన వృద్ధిని వివరిస్తుంది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, తన కెరీర్‌లో ఎలా ఎదిగారు.. ఒక గొప్ప పరిశ్రమను ఎలా స్థాపించారు.. అనే విషయాలను ఈ పుస్తకం చాలా ఆసక్తికరంగా తెలియజేస్తుంది.

## రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు సైబర్ నేరగాళ్ల భారీ టోకరా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో భారీ మొత్తంలో సైబర్ నేరాలకు పాల్పడుతూ జేబులను గుల్ల చేస్తూ.. బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై ఎంత అవగాహన కల్పిస్తున్నా చాలా మంది ఈ ట్రాప్‌లో పడుతూ తమ డబ్బునంతా పోగొట్టుకుంటున్నారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో సదరు వ్యక్తి నుంచి రూ.98,888 కాజేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పోలీసులతో గస్తీ ముమ్మరం

- రాత్రి వేళల్లో కాలనీల్లో పర్యటన




**హైదరాబాద్, మార్చి5 (జనంసాక్షి) :** విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసులు వినూత్న కార్యాచరణ చేపట్టారు. కేవలం పెట్రోలింగ్ వాహనాల గస్తీకే పరిమితం కాకుండా, ప్రజల మధ్యకు నేరుగా నడుచుకుంటూ వెళ్తూ 'మేమున్నం' అనే భరోసా కల్పించే విధంగా ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ప్యాట్రోల్ కార్లు, బ్లూ కోల్ట్ సిబ్బంది తమ వాహనాలను నిలిపివేసి, నిత్యం ప్రజలతో మమేకమవుతూ జనసంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్‌లు, నివాస కాలనీలు, చిన్న చిన్న వీధుల్లో పోలీసులు కాలినడకన పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, అనుమానితులను తనిఖీ చేయడమే లక్ష్యంగా ఈ ఫుట్ పెట్రోలింగ్‌ను పోలీసులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. దీనివల్ల రాత్రి వేళల్లో సామాన్య ప్రజల్లో ధైర్యం పెరగడమే కాకుండా, నేరస్థుల్లో భయం కలుగుతోంది. క్షేత్రస్థాయిలో స్థానికులతో నేరుగా సంభాషించడం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ, నేర నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా ఈ ఫుట్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది వాహనాలను పక్కన పెట్టి, మార్కెట్లు, బస్టాండ్‌లు మరియు నివాస ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తున్నారు. వాహనాలు వెళ్లలేని ఇరుకైన సందుల్లో కూడా పోలీసులు తిరగడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడుతోంది. రాత్రి వేళల్లో పనిచేసే కార్మికులు, వ్యాపారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.అనుమానాస్పద కదలికలు ఉంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో కారణం లేకుండా తిరిగే వారు, పాత నేరస్థుల వివరాల సేకరిస్తారు. నిర్మానుష్య ప్రాంతాలలో మద్యం సేవించే వారి కట్టడి, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పూనుకొంటారు.

నంబర్ ప్లేట్ సరిగ్గా లేని, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు తనిఖీ చేస్తారు. ప్రజల మధ్య ఉండటం వల్ల పోలీసులపై ప్రజల్లో భరోసా భావం పెరుగుతుంది. స్థానికులతో స్నేహపూర్వకంగా ఉండడం వల్ల ఒక్కోసారి నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం తెలుసుకునే వీలుంది. కొత్తంగా కాలినడక గస్తీ వల్ల ప్రజలతో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం ద్వారా పోలీసులకు స్థానిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతోందని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడటం వల్ల ముఖ్య సమాచారం త్వరగా అందుకునే వీలుందన్నారు. ప్రజల భద్రత కేవలం పోలీసుల బాధ్యతే కాదు, పౌరుల సహకారం కూడా అంతే ముఖ్యం. మీ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెనుకాడకుండా పోలీసులకు సమాచారం అందించండి. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయాల్లో పోలీసులు నిర్వహిస్తున్న ఈ ఫుట్ ప్యాట్రోలింగ్ సరికొత్త ఒరవడిని సృష్టించింది.

# తెలంగాణ సాయుధ పోరాటం: కవిత్వంలో విప్లవ ధ్వని

తెలంగాణ సాయుధ పోరాటం (1946-1951) భారత చరిత్రలో ఒక అసాధారణ అధ్యాయం. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అరాచకాలు, వెట్టి చాకిరి వ్యవస్థలో మునిగిపోయిన రైతాంగం భూమి, భుక్తి కోసం ఆయుధాలు పట్టుకుని లేచి నిలబడిన సమయం ఇది. ఈ పోరాటం కేవలం రక్తపు సంఘర్షణకు మాత్రమే పరిమితం కాదు; అది సాహిత్యం, కళల్లో కూడా ప్రతిధ్వనించింది. ముఖ్యంగా తెలుగు కవిత్వం ఈ విప్లవాన్ని గ్రామీణ భాషలో, ప్రజా రూపాల్లో ఆకృతి చేసింది. కవులు ఒక చేత్తో తుపాకీ, మరొక చేత్తో పెన్న పట్టుకుని పోరాడారు. ప్రజా కవిత్వం, గేయకవిత్వం రూపాల్లో వచ్చిన ఈ రచనలు పోరాటాన్ని ఉత్తేజపరిచాయి, తర్వాత జాతీయ చైతన్యాన్ని రేకెత్తించాయి. ఈ సమీక్షా వ్యాసంలో ప్రసిద్ధ కవితలను ఉదహరిస్తూ, వాటి పంక్తులను కోట్ చేస్తూ, ఆ విప్లవ కవిత్వం యొక్క స్ఫూర్తిని చర్చిస్తాం.

తెలంగాణ సాయుధ పోరాటం కవిత్వానికి మూలం ప్రజా ఉద్యమాల్లోనే. నైజాం రాజ్‌లో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు ప్రజలను జాగృతం చేసినప్పుడు, కవిత్వం మొదటి ఆయుధంగా మారింది. గ్రామీణ జానపద రూపాలు, పల్లెటూరి భాషా సౌరభం ఈ కవిత్వాన్ని ప్రజలకు అనుసంధానం చేశాయి. పోరాటం సమయంలో వేలాది పాటలు, గేయాలు పుట్టాయి. ఇవి కేవలం ఉత్తేజకరమైనవి కాదు; దోపిడీ యొక్క కారుణ్యం, విప్లవ యొక్క ఆశాభావన, త్యాగం యొక్క మహత్త్వాన్ని వర్ణించాయి. ప్రముఖ కవి దాశరథి రంగాచార్య లాంటి వారు ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని, జైలు జీవితాలు గడిపారు. వారి కవిత్వం పోరాటాన్ని ఆకృతి చేసింది.



దాశరథి రంగాచార్య (1928-2015) తెలంగాణ కవిత్వానికి ప్రతీక. సాయుధ పోరాట యోధుడై, అభ్యుదయవాది, ప్రజాకవిగా ప్రసిద్ధి. ఆయన "బూటు" కవిత పోరాటానికి ప్రతీకాత్మకం. రాజకారుల బూట్లు ప్రజల రక్తంతో తడిసి, దోపిడీని సూచిస్తూ, విప్లవాన్ని ధిక్కరిస్తుంది. కవితలో: "బూటు బూటు రెండు బూట్లు / రక్తంతో తడిసిన రెండు బూట్లు / ప్రజల రక్తంతో తడిసిన బూట్లు" అని పంక్తులు పోరాట యొక్క క్రూరత్వాన్ని గుర్తుచేస్తాయి. ఇది ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించి, గెరిల్లా పోరాటానికి ప్రేరణ. మరొక ప్రసిద్ధ కవిత "నా తెలంగాణా"లో ఆయన త్యాగాన్ని ఆకాశతారలతో పోల్చి: "తీగలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణా కోటి రత్నాల వీణ" అని రాశారు. ఈ పంక్తులు తెలంగాణను వీణగా, పోరాటాన్ని సంగీతంగా చిత్రీకరిస్తాయి. దాశరథి కవిత్వం భావోద్వేగ స్ఫూర్తితో కూడినది, పోరాటాన్ని వ్యక్తిగత అనుభవంగా మలిచింది.

కాళోజీ నారాయణరావు (1914-2002) ప్రజాకవిగా, తెలంగాణ ఉద్యమాల ప్రతిధ్వనిగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటం నుండి తెలంగాణ సాయుధ పోరాటం వరకు అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన "నిజామ్" కవితలో రజాకార్ల క్రూరత్వాన్ని ధిక్కరిస్తూ: "నిజామనగ ఎంతరా / వాడి తహతెంతరా / అంతగలసి తంతె మల్ల వాడి అంతులేదురా" అని రాశారు. ఈ పంక్తులు నిజాం పాలన యొక్క అంధకారాన్ని, పోరాట యొక్క అవసరాన్ని స్పష్టం చేస్తాయి. భైరంపల్లి హత్యకాండం గురించిన కవితలో కాళోజీ మహిళల త్యాగాన్ని వర్ణిస్తూ, పోరాటాన్ని జాతీయ స్థాయికి ఎత్తారు. ఆయన కవిత్వం సామాజిక న్యాయం, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలతో ముడిపడి ఉంది. పోరాటం తర్వాత కూడా "పోరు తెలంగాణ" గీతం లాంటి రచనలు ప్రజల్లో ఐక్యతను నింపాయి. కాళోజీ కవిత్వం ధిక్కార భావంతో కూడినది, ఉద్యమ స్ఫూర్తిని శాశ్వతం చేసింది.

సుద్దాల హన్మంతు (1910-1982) తెలంగాణ ప్రజా కవిత్వానికి మూలస్తంభం. కమ్యూనిస్టు యోధుడుగా, కళాకారుడుగా పోరాటంలో ముందువరసలో నిలిచారు. ఆయన "పల్లెటూరి పిల్లగాడా" పాట కరుణరసంగా ప్రజల బాధలను చిత్రీకరిస్తుంది: "పల్లెటూరి పిల్లగాడా / పసులగాసె మొనగాడా / పాలు మరిచి ఎన్నాళ్ళయింది / ఓ... పాల బుగ్గల జీతగాడా / కొలువు కుదిరి ఎన్నాళ్లయింది." ఈ పంక్తులు రైతు పిల్లల దుస్థితిని, వెట్టి చాకిరి యొక్క దారుణత్వాన్ని గుర్తుచేస్తూ, పోరాటానికి చోదకంగా మారాయి. మరొక ప్రసిద్ధ గేయం "వేయ్ దెబ్బ... దెబ్బకు దెబ్బ" రాజకారుల దాడులకు ప్రతిఘటనగా రాసినది. ఇది గెరిల్లా యుద్ధ వ్యూహాన్ని ప్రతిబింబిస్తూ, "రణభేరి మ్రోగింది తెలుగోడ" లాంటి పంక్తులతో యోధులను ఉత్తేజపరిచింది. హన్మంతు కవిత్వం జానపద రసాలతో కూడినది, ప్రజల నోటిలో నాని, పోరాటాన్ని సామూహిక గాథగా మలిచింది.

సోమసుందర్ (1924-2016) అభ్యుదయవాద కవిగా, "వజ్రాయుధం" (1949) ద్వారా తెలంగాణ పోరాటాన్ని మహాకావ్యాంగంగా ఆకృతి చేశారు. ఈ గేయకవిత భూస్వామ్య వ్యవస్థను త్రోసిరాజని, బానిసల దండయాత్రను వర్ణిస్తుంది. కవితలో: "బానిసల దండయాత్ర / ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవిస్తారు / ఒక నెత్తుటి బొట్టులో ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లుతాయి" అని పంక్తులు త్యాగాన్ని ఆశాగీతంగా మలిచాయి. జనగామ, బాలేముల, నల్లగొండల్లో జరిగిన వీరోచిత పోరాటాలను ఉద్వేగంగా చిత్రీకరించారు. సోమసుందర్ కవిత్వం బూర్జువా వ్యవస్థను విమర్శిస్తూ, ప్రజావాద భవిష్యత్తును ఊహిస్తుంది. ఇది పోరాటాన్ని రాజకీయ దృక్పథంతో చూసే ఒక మైలురాయి.

ఆరుద్ర (శ్రీశ్రీ అనంతర కవులలో) "త్వమేవాహం" మహాకావ్యంలో తెలంగాణ పోరాట తీవ్రతను వర్ణించారు. ఇక్కడ పోరాటం ఆత్మవిశ్వాసంగా, ప్రజల ఐక్యతగా చిత్రీకరించబడింది. మఖ్దూం మొహియుద్దీన్ ఉర్దూ కవిత్వంలో నిజాం వ్యతిరేక భావాలు ప్రచారం చేశారు, తెలుగు కవిత్వానికి ప్రభావం చూపారు. ఈ కవిత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని సాహిత్యంగా ఆకర్షించడమే కాక, భారతీయ విప్లవ చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచింది. దోపిడీకు వ్యతిరేకం, త్యాగానికి నివాళి, భవిష్యత్తుకు ఆశలు - ఇవి ఈ రచనల మొదటి ధ్వనులు. పోరాటం ముగిసినా, ఈ కవితలు తెలంగాణ గుర్తింపును బలపరిచాయి. ఈ విప్లవ ధ్వని ఈరోజు కూడా ప్రజల్లో ప్రతిధ్వనిస్తోంది, సామాజిక న్యాయ పోరాటాలకు ప్రేరణగా మారుతోంది. తెలంగాణ కవిత్వం ఆయుధాల కంటే బలమైనది, ఎందుకంటే అది మనసుల్ని మార్చింది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## మనిషి లేడు!

మనిషికి కష్టంవస్తే
మనిషి
బాధపడతాడు!
'మనిషే ' లేనప్పుడు
ఇంక బాధేమిటి !
ఖొమేనీ పోతే
ముస్లిం బాధపడ్డాడు!
మనిషికాదు!
క్రిష్టియన్ పోతే
క్రిష్టియన్
బాధపడతాడు
మనిషికాదు!
హిందువుపోతే
హిందువులు కొందరే
బాధపడతారు!
స్వయంకృతాపరాధం!
హిందువుల్లో
కొందరు
అస్పృస్యులు!
ఏమతంలోనూలేదు!
ఏదేశంవాడుపోతే
ఆదేశంవాడికి బాధ
దేశాభిమానమే!
మనిషి లేడు!
మనిషిని మనిషిగా
చూడలేదు
అన్నీ హద్దులే!
ఉన్నవి రెండే
మంచి చెడు
ఇలా చూడరు!
కులంగా! మతంగా!
ప్రాంతం గా!
భాష గా!
మనిషిలేడు!
మనిషి కాదు!
వివక్షా పూరితం!
కక్షా జీవనం!
మనమంతా
మనుషులం
మనతల్లి భూమాత
మనంసహోదరులం!
అందరం
అడవినుండి
జంతుస్థాయినుండి
వచ్చాము!
ఈ విధంగా
చెప్పిఉంటే
మనిషి
మనిషయ్యేవాడు!
ఓ మనిషీ!
ఎన్నో విజయాలు
సాధించావు!
ఐనామనిషివికాదు!
ఎన్నాళ్ళు చస్తారో
ఇలాగే
చావండి!
కొట్టుకుచావండి
కులమతాల
భాషాప్రాంతాల
సంకుచితభావాలతో
చావండి
చావండి
ఏడ్చే 'మనిషి'
లేకుండా!

తమ్మినేని
అక్కిరాజు
హైదరాబాద్

# సోషల్ మీడియా ప్రభావం ఎవరి పైన?

పల్లెల నుంచి పట్టణాల వరకు, చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్న రోజులివి. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది కదా అని ఏది పడితే అది పోస్ట్ చేస్తున్నారు. ఉదయం లేచిన తర్వాత రాత్రి నిద్రపోయే వరకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్‌లలో తిరుగుతున్నారు. ఏం తిన్నారు, ఎక్కడికి వెళ్లారు, ఏం చేస్తున్నారు.. ఇలా ప్రతి చిన్న విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇంటర్నెట్ ఛార్జీలు చౌకగా అందుబాటులోకి రావడంతో ఈ అలవాటు మరింత పెరిగిపోయింది. సోషల్ మీడియా మొదట వార్తలు, సమాచారం పంచుకునే వేదికగా మొదలైంది. కానీ ఇప్పుడు అది మన జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆక్రమించేసింది. యువతరం మాత్రమే కాదు.. చిన్న పిల్లలు, పెద్దలు కూడా ఫోన్‌లోనే గడుపుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు, రీల్స్, వీడియోలు, లైవ్‌లు.. ఇవన్నీ ఒక్కసారి చూస్తే ఆపుకోలేని వ్యసనంగా మారాయి. టెక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు - "ఏది పడితే అది పోస్ట్ చేయకండి.దుష్ఫలితాలు ఎదుర్కోక తప్పదు".

**ఇంతకీ ఏం షేర్ చేయకూడదు?**

- వ్యక్తిగత ఫొటోలు - డీప్‌ఫేక్ వీడియోలు, బ్లాక్‌మెయిల్ ప్రమాదం ఎక్కువ. మీ ఫొటోలను డీప్‌గా పెట్టకండి.
- లొకేషన్, ట్రావెల్ అప్‌డేట్స్ - "ఇంట్లో లేరు" అని దొంగలకు స్వయంగా చెప్పినట్లవుతుంది. ఎక్కడికి వెళ్తున్నారో లైవ్‌లో పోస్ట్ చేయకండి.



- ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ - బ్యాంక్, ఆన్‌లైన్ అకౌంట్స్‌కు వాడే ఈ-మెయిల్‌ను ఎప్పుడూ షేర్ చేయకండి. ఫోన్ నెంబర్ పెట్టితే స్పామ్, బెదిరింపులు రావచ్చు.
- ఇంటి అడ్రస్ - ఎంత జాగ్రత్తగా ఉన్నా ఇలా షేర్ చేస్తే భద్రతా ప్రమాదం పెరుగుతుంది.
- చిన్న పిల్లల ఫొటోలు - పిల్లల భద్రతకు ప్రమాదం. వారి గుర్తింపు దొంగిలించే అవకాశం ఉంది.
- కంపెనీ, ఉద్యోగ విషయాలు - నెగిటివ్ అభిప్రాయాలు పెట్టితే కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- పార్టీలు, పర్సనల్ ఈవెంట్స్ - స్నేహితులతో గడిపిన పార్టీల ఫొటోలను కూడా షేర్ చేయకండి.
- సోషల్ మీడియా వల్ల వచ్చే దుష్ఫలితాలు
- నిద్ర లేకపోవడం, ఒత్తిడి, ఆందోళన, నిరాశ
- సైబర్ స్టాకింగ్, బెదిరింపులు, ట్రోలింగ్
- గోప్యతా సమస్యలు, తప్పుడు సమాచార వ్యాప్తి

స్వీయ-ఇమేజ్ సమస్యలు, ఆత్మహత్య ఆలోచనలు వరకు ప్రమాదం

సోషల్ మీడియా ఒక శక్తివంతమైన సాధనం.. కానీ దాన్ని సరైన పరిధిలో, జాగ్రత్తగా వాడాలి. అనవసరంగా షేర్ చేసి తమ భద్రతను, మానసిక ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేసుకోకూడదు. టెక్ నిపుణులు చెప్పినట్లు - "ఏది పడితే అది పోస్ట్ చేయకండి.. దుష్ఫలితాలు ఎదుర్కోక తప్పదు".

మీరు ఎలా ఉపయోగిస్తున్నారు సోషల్ మీడియాను? మీ అనుభవాలు షేర్ చేయండి!



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327



## పేదల ఇళ్లపై ప్రభుత్వ బుల్డోజర్

# వెలుగుమట్లలో కన్నీటి గాథ!!



తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిన ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న భూదాన్ భూములు. బుల్డోజర్ అనే పదం కేవలం యంత్రాన్ని సూచించడం కాదు అది పాలనా విధానంపై ప్రశ్నగా మారింది. ఖమ్మం నగరం శివారు లోని వెలుగుమట్లలో ఫిబ్రవరి 26న ఇస్తి రక్షణ అనే వాదనను ముందుకు తేస్తే మరోవైపు పేదల విధాన హక్కు అనే మౌలిక ప్రశ్నను లేవనెత్తింది. ముఖ్యంగా అక్కడ నివసిస్తున్న కుటుంబాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు అధికంగా ఉన్నారన్న అంశం.

బుల్డోజర్ గోడలను మాత్రమే కూల్చగలవు. కానీ ప్రజల నమ్మకాన్ని కూల్చితే తిరిగి నిర్మించడం కష్టం. ఖమ్మం వెలుగుమట్ల ఘటనను కేవలం పరిపాలనా చర్యగా కాకుండా చట్టపాలన సామాజిక న్యాయం మధ్య సమతుల్యంగా చూడాలి. వెలుగుమట్ల గ్రామ శివారులో సర్వే నంబర్లు 147, 118, 149లకు సంబంధించిన భూదాన్ భూముల విషయం ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అంశంగా తీసుకుని భూదాన్ భూములు సాధారణంగా భూమిలేని పేదలకు పంపిణీ చేయబడితే పట్టాదారు పుస్తకాల్లో అవి భూదాన్ భూములుగానే నమోదుగా ఉంటాయి.

స్థానికంగా అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఈ భూములు గతంలో నిరుపేదలకు కేటాయించినట్లు తెలుస్తుంది. దాదాపు కొన్ని ప్లాట్లుగా విభజించి నివాస అవసరాలకు వినియోగంలోకి వచ్చినట్లు ప్రస్తావనలు ఉన్నాయి. కేటాయింపులపై న్యాయస్థానాల్లో విచారణ జరిగి హైకోర్టు స్థాయిలో కూడా పరిశీలనలు జరిగినట్లు చెప్పబడుతోంది. ఇలాంటి పరిస్థితిలో ప్రస్తుత రికార్డుల స్థితి పూర్వ నిర్ణయాల అమలు స్థాయి ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన్ భూములపై ఇళ్లను కూల్చివేస్తున్న ఘటన స్థానికంగా ఉద్రిక్తతలకు దారితీస్తోంది. పునరావాసం కల్పించకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం సరైందా..? అనే ప్రశ్న అక్కడి ప్రజల మనసుల్లో తీవ్రంగా మ్రోగుతోంది. ఏళ్ల తరబడి నివసిస్తూ చిన్న చిన్న గుడిసెలను నిర్మించుకుని జీవిస్తున్న కుటుంబాలు ఒక్కసారిగా ఆశ్రయం కోల్పోవడం హృదయ విదారకంగా మారింది.

వెలుగుమట్ల భూదాన్ పొలాల్లో నివసిస్తున్న వారు ఎక్కువగా దినసరి కూలీలు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారు. వారికి ఆ భూమి కేవలం మట్టికాదు అది జీవనాధారం, భద్రత, పిల్లల భవిష్యత్తు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయిస్తే, ముందుగా ప్రత్యామ్నాయ స్థలం లేదా పునరావాస పథకం ప్రకటించడం మానవతా ధర్మం. కానీ ప్రజల వాదన ప్రకారం స్పష్టమైన పునరావాస హామీ లేకుండానే కూల్చివేతలు ప్రారంభమయ్యాయి.

భూమి స్వాధీనంపై చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో పారదర్శకత ప్రజలతో చర్చ అవసరం. స్థానికులు చెబుతున్నదేమిటంటే సరైన నోటీసులు ఇవ్వకుండానే లేదా చర్చించకుండానే అధికారులు చర్యలకు దిగారని దీనివల్ల మహిళలు, పిల్లలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొన్ని కుటుంబాలు తాత్కాలికంగా బంధువుల ఇళ్లకు వెళ్లగా మరికొన్ని కుటుంబాలు రోడ్లపైనే ఉండే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం అభివృద్ధి పేరుతో భూమిని అవసరమని భావిస్తే, అది ప్రజల ప్రయోజనాల కోసమే కావాలి. కానీ అభివృద్ధి ప్రయోజనాలు పేదల ప్రాణా ధారాన్ని నాశనం చేస్తే అది సమగ్ర అభివృద్ధి కాదని సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. పునరావాసం లేకుండా కూల్చివేతలు జరగడం రాజ్యాంగంలో ఉన్న సమానత్వం, జీవన హక్కు వంటి మూల్యాలకు విరుద్ధమని కొందరు న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. వెలుగుమట్ల ఘటన సామాజిక న్యాయంపై పెద్ద చర్చకు దారితీస్తోంది. పేదల సమస్యలను ముందుగానే పరిష్కరించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించాలి. పునరావాసం, పరిహారం, ప్రత్యామ్నాయ గృహాల కల్పన వంటి అంశాలు స్పష్టంగా ప్రకటించి అమలు చేయడం అత్యవసరం. లేకపోతే ప్రజల నమ్మకం దెబ్బతింటుంది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ప్రజలతో చర్చించి, తగిన పునరావాస చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భూమి స్వాధీన ప్రక్రియ చట్టబద్ధంగా, పారదర్శకంగా, మానవీయంగా జరగాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి మరియు మానవ హక్కులు కలిసి నడవాలి గానీ ఒకటి మరొకటిని తుంచకూడదు. వెలుగుమట్లలో జరుగుతున్న ఈ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. పునరావాసం లేకుండా భూమి స్వాధీనం సరైందా..? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఇప్పుడు అధికార యంత్రాంగం పైనే ఉంది. పేదల కన్నీళ్లకు తుడిచే చర్యలు తీసుకుంటేనే సమాజంలో న్యాయం నిలబడుతుందని నా యొక్క అభిప్రాయం.



సొప్పరి నరేందర్
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
9553958648

# రెవెన్యూ లోటుతో రాష్ట్రాకు ఆర్థిక భారం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో రెవెన్యూ లోటు ఒక కీలక సమస్యగా మారింది. ప్రభుత్వాల రెవెన్యూ ఆదాయం కంటే రెవెన్యూ వ్యయం ఎక్కువైతే ఆ తేడానే రెవెన్యూ లోటు. ఈ లోటును భర్తీ చేయడానికి రాష్ట్రాలు అప్పులు తీసుకోవాల్సి వస్తుంది. దీని ఫలితంగా వడ్డీ భారం పెరుగుతుంది. దీర్ఘకాలంలో అభివృద్ధి వ్యయాలకు కేటాయించాల్సిన నిధులు తగ్గిపోతాయి. రెవెన్యూ ఆదాయంలో పన్నులు, కేంద్ర బదిలీలు, ఫీజులు, లైసెన్స్ రుసుములు, సేవల ద్వారా వచ్చే ఆదాయం ఉంటాయి. రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పెన్షన్లు, సబ్సిడీలు, వడ్డీ చెల్లింపులు, పరిపాలన ఖర్చులు చేరుతాయి. ఆదాయం కంటే ఖర్చు అధికమైతే లోటు ఏర్పడుతుంది.

2005-2008 మధ్య కాలంలో చాలా రాష్ట్రాలు తమ రెవెన్యూ లోటును 0% సమీపానికి తగ్గించగలిగాయి. 2007--08 సంవత్సరంలో కొంతమంది రాష్ట్రాలు అధిక ఆదాయం నమోదు చేశాయి. ఆ సమయంలో రాష్ట్రాల సగటు రెవెన్యూ లోటు సుమారు 0.1% మాత్రమే ఉండేది. కానీ 2009-10లో ఆర్థిక మందగమనం ప్రభావంతో ఇది 0.9%కు పెరిగింది. 2017లో పన్ను వ్యవస్థలో జరిగిన మార్పుల తర్వాత రాష్ట్రాల స్వంత పన్ను వనరులపై ప్రభావం పడింది. 2018-19లో రాష్ట్రాల కలిపిన రెవెన్యూ లోటు సుమారు 0.8%గా నమోదైంది. సంక్షేమ పథకాల విస్తరణ, రైతు రుణమాఫీలు, విద్యుత్ సబ్సిడీలు వంటి అంశాలు ఖర్చును పెంచాయి. 2020లో కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్రాల ఆదాయం తీవ్రంగా తగ్గింది. అదే సమయంలో ఆరోగ్య ఖర్చులు, ఉచిత ధాన్య పంపిణీ, నగదు బదిలీలు పెరిగాయి. 2020-21లో రాష్ట్రాల రెవె న్యూ లోటు సుమారు 2.5%కు చేరింది. ఇది గత 15 సంవత్సరాలలో అత్యధిక స్థాయి. 2021-22లో ఆర్థిక కార్యకలాపాలు పునరుద్ధరించడంతో లోటు సుమారు 1.1%కు తగ్గింది.

రాష్ట్రాల మొత్తం అప్పు 2015-16లో సుమారు 22%గా ఉండగా, 2021-22 నాటికి అది 31%కు పెరిగింది. వడ్డీ చెల్లింపులు రెవెన్యూ ఆదాయంలో 12% నుండి 20% వరకు పెరిగాయి. కొన్ని రాష్ట్రాల్లో ఇది 25% దాటింది. అంటే సంపాదించిన ప్రతి ₹100లో ₹20 వరకు వడ్డీకే వెళ్తున్నాయి.

2023-24 అంచనాల ప్రకారం రాష్ట్రాల సగటు రెవెన్యూ లోటు సుమారు 0.6%గా ఉంది. కొన్ని రాష్ట్రాల్లో ఇది 2%కు పైగా ఉంది. పెన్షన్ బాధ్యతలు, విద్యుత్ రంగ నష్టాలు, సంక్షేమ పథకాల విస్తరణ రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి పెంచుతున్నాయి.రెవెన్యూ లోటు ఎక్కువగా ఉంటే మూలధన వ్యయం తగ్గుతుంది. 2019-20లో మొత్తం ఖర్చులో మూలధన వ్యయం 14% ఉండగా, 2020-21లో అది 11%కు తగ్గింది. దీని ప్రభావంగా మౌలిక వసతుల అభివృద్ధి మందగిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధి రేటు 1% వరకు తగ్గే ప్రమాదం ఉంది.

**ఆర్థిక భారం పెరగడానికి ప్రధాన కారణాలు:**

1. వడ్డీ చెల్లింపుల పెరుగుదల- 2012లో 12%, 2024లో సుమారు 20%.
2. పెన్షన్ ఖర్చుల పెరుగుదల - భవిష్యత్ బాధ్యతలు 1%-2% అదనంగా పెరిగే అవకాశం.
3. సబ్సిడీల విస్తరణ - విద్యుత్ రంగ నష్టాలు లక్షల కోట్లలో.
4. ఆదాయ వృద్ధి మందగమనం - కొన్ని రాష్ట్రాల్లో 8%-10% మధ్య మాత్రమే.

దీర్ఘకాలంలో ఈ పరిస్థితి కొనసాగితే అప్పు భారం పెరుగుతుంది. అప్పు-ఉత్పత్తి నిష్పత్తి 30% దాటితే ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం పడుతుంది. పెట్టుబడిదారుల నమ్మకం తగ్గే అవకాశం ఉంది. ఉద్యోగ అవకాశాలు మందగించవచ్చు.

**పరిష్కార మార్గాలు:**

పన్ను వసూళ్ల సామర్థ్యాన్ని 5%-7% పెంచడం అవసరం. సబ్సిడీలను లక్ష్యిత వర్గాలకు పరిమితం చేయాలి. డైరెక్ట్ నగదు



బదిలీల ద్వారా 10% వరకు ఖర్చు తగ్గించవచ్చు. మూలధన పెట్టుబడులను కనీసం మొత్తం ఖర్చులో 15% వరకు పెంచాలి. వడ్డీ భారం తగ్గించడానికి అప్పుల పునర్వ్యవస్థీకరణ చేయాలి.

2025-2030 మధ్యకాలంలో రాష్ట్రాలు తమ రెవెన్యూ లోటును 0%-0.5% మధ్య పరిమితం చేయగలిగితే ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. వడ్డీ చెల్లింపులను రెవెన్యూ ఆదాయంలో 15% లోపే ఉంచాలి. అప్పు నిష్పత్తిని 30% కంటే తక్కువగా నియంత్రించాలి. సంక్షేమం అవసరం. అభివృద్ధి కూడా అవసరం. అయితే ఆదాయం పెంచకుండా ఖర్చు విస్తరించడం దీర్ఘకాలికంగా ప్రమాదకరం. ఆర్థిక క్రమశిక్షణతో పాటు సమర్థవంతమైన వ్యయ నిర్వహణ ద్వారానే రాష్ట్రాలు భవిష్యత్ తరాలకు భారాన్ని తగ్గించగలవు.

రాష్ట్రాల రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు ప్రధాన భాగం. కొన్ని రాష్ట్రాల్లో వడ్డీ చెల్లింపులు రెవెన్యూ ఆదాయంలో 20%-25% వరకు చేరడం ఆందోళనకరం. అంటే ప్రతి ₹100 ఆదాయంలో ₹20 పైగా వడ్డీకే వెళ్తున్నాయి. ఈ ధోరణి కొనసాగితే 2030 నాటికి ఇది 30% సమీపానికి చేరే ప్రమాదం ఉంది. అప్పుడు అభివృద్ధి కార్యక్రమాలకు మిగిలే వనరులు మరింత తగ్గిపోతాయి.

పెన్షన్ బాధ్యతలు కూడా దీర్ఘకాలిక భారం. పాత పెన్షన్ విధానానికి తిరిగి వెళ్లిన రాష్ట్రాల్లో భవిష్యత్ ఆర్థిక బాధ్యతలు ఉత్పత్తిలో 1%--2% అదనంగా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. 2040 తర్వాత ఈ ప్రభావం మరింత స్పష్టమవుతుంది. అంటే నేటి రాజకీయ నిర్ణయాల భారం రాబోయే తరాలకు మిగులుతుంది.సబ్సిడీల విస్తరణ మరో కీలక అంశం. విద్యుత్, నీటి, రవాణా, వ్యవసాయ రంగాలలో విస్తృత సబ్సిడీలు అమలు అవుతున్నాయి. ఈ సబ్సిడీలలో కొంత భాగం లక్ష్యిత వర్గాలకు చేరుతుండగా, కొంత భాగం అనవసర వ్యయంగా మారుతోంది. ఖచ్చితమైన లబ్ధిదారుల గుర్తింపు ద్వారా 10%-15% వరకు వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంది. ఇది అమలు చేయగలిగితే రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గవచ్చు.

రెవెన్యూ లోటు ఎక్కువగా ఉంటే మొదట ప్రభావితమయ్యేది మూలధన వ్యయం. 2019-20లో మొత్తం ఖర్చులో 14% ఉన్న మూలధన వ్యయం 2020-21లో 11%కు పడిపోవడం ఇందుకు ఉదాహరణ. రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు వంటి మౌలిక వసతులపై పెట్టుబడి తగ్గితే భవిష్యత్ వృద్ధి రేటు 1% వరకు తగ్గే ప్రమాదం ఉంది. దీని ప్రభావం ఉపాధిపై కూడా ఉంటుంది.

రాష్ట్రాల అప్పు-ఉత్పత్తి నిష్పత్తి 2015-16లో 22% ఉండగా, 2021-22లో 31%కు చేరింది. ఇది 35% దాటితే ఆర్థిక స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అప్పు పెరుగుదలతో క్రెడిట్ నమ్మకం తగ్గవచ్చు. పెట్టుబడిదారుల ఆసక్తి మందగించవచ్చు. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉంది.

మూలధన వ్యయాన్ని కనీసం మొత్తం ఖర్చులో 15%-18% వరకు పెంచగలిగితే దీర్ఘకాలిక వృద్ధి సాధ్యమవుతుంది. మౌలిక వసతులపై 1% అదనపు పెట్టుబడి పెట్టినట్లయితే వృద్ధి రేటు 0.5% వరకు పెరిగే అవకాశముంది. దీని ద్వారా పన్ను ఆదాయం కూడా పెరుగుతుంది. అప్పుడు రెవెన్యూ లోటు సహజంగానే తగ్గుతుంది.

2025-2030 మధ్యకాలంలో రాష్ట్రాలు తమ రెవెన్యూ లోటును 0%-0.5% మధ్య పరిమితం చేయగలిగితే ఆర్థిక స్థిరత్వం బలపడుతుంది. వడ్డీ చెల్లింపులను రెవెన్యూ ఆదాయంలో 15% లోపే ఉంచాలి. అప్పు నిష్పత్తిని 30% కంటే తక్కువగా నిలుపుకోవాలి. ఈ లక్ష్యాలు సాధించడానికి క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణ అవసరం.

సంక్షేమం ప్రజల హక్కు. అభివృద్ధి సమాజ ప్రగతికి పునాది. కానీ ఆదాయానికి మించిన ఖర్చు నిరంతరం కొనసాగితే అది భవిష్యత్ తరాలపై భారమవుతుంది. తాత్కాలిక ప్రజాదరణ కంటే దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం ముఖ్యమని గుర్తించాలి. సమతుల్య విధానాలు, బాధ్యతాయుత నిర్ణయాలు, పారదర్శక ఆర్థిక నిర్వహణ ద్వారానే రాష్ట్రాలు స్థిరమైన అభివృద్ధి మార్గంలో ముందుకు సాగగలవు.

ౖ26/02, 2:27 జూఎరి ాూ౦ఎఅ =వ౦౦౦: రాష్ట్రాల రెవెన్యూ లోటు సమస్యను తాత్కాలిక ఆర్థిక ఇబ్బందిగా మాత్రమే చూడటం సరైంది కాదు. ఇది దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేసే నిర్మాణాత్మక అంశం. 2005లో 0% సమీపంలో ఉన్న లోటు 2020లో 2.5% వరకు పెరగడం, ఆ తర్వాత 2023--24లో సుమారు 0.6% వద్ద నిలవడం రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఎంత ఒత్తిడిలో ఉందో చూపిస్తుంది. పరిస్థితి కొంత మెరుగుపడినట్లే కనిపించినా, అప్పు భారం మాత్రం గణనీయంగా పెరిగింది.

రాష్ట్రాల మొత్తం అప్పు 2015-16లో 22% ఉండగా, 2021-22 నాటికి అది 31%కు చేరింది. ఈ ధోరణి కొనసాగితే 35% దాటే ప్రమాదం ఉంది. వడ్డీ చెల్లింపులు రెవెన్యూ ఆదాయంలో 20% వరకు చేరడం ఆందోళనకరం. అంటే సంపాదించిన ప్రతి ₹100లో ₹20 వడ్డీకే వెళ్తే అభివృద్ధి కార్యక్రమాలకు తక్కువ నిధులు మిగులుతాయి. మూలధన వ్యయం 14% నుండి 11%కు తగ్గడం భవిష్యత్ వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.

సబ్సిడీల విస్తరణ, పెన్షన్ బాధ్యతలు, ఉచిత సేవల పథకాలు రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి పెంచుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఆదాయ వృద్ధి 8%-10% మధ్య మాత్రమే ఉండగా, వ్యయం 12%-15% వరకు పెరుగుతోంది. ఈ వ్యత్యాసం కొనసాగితే రెవెన్యూ లోటు మళ్లీ 1% పైగా పెరిగే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఇది ఆర్థిక అసమతుల్యతకు దారి తీస్తుంది. 2025-2030 మధ్య రాష్ట్రాలు తమ రెవెన్యూ లోటును 0%-0.5% మధ్య పరిమితం చేయగలిగితే ఆర్థిక స్థిరత్వం సాధ్యమ వుతుంది. వడ్డీ చెల్లింపులను రెవెన్యూ ఆదాయంలో 15% లోపే ఉంచాలి. అప్పు నిష్పత్తిని 30% కంటే తక్కువగా నియంత్రించాలి. ఈ లక్ష్యాలు సాధించడానికి క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణ అవసరం. సంక్షేమం అవసరం, అభివృద్ధి కూడా అవసరం. అయితే ఆదాయానికి మించిన ఖర్చు నిరంతరం కొనసాగితే అది భవిష్యత్ తరాలపై భారమవుతుంది. సమతుల్య విధానాలు, బాధ్యతాయుత నిర్ణయాలు, పారదర్శక ఆర్థిక నిర్వహణ ద్వారానే రాష్ట్రాలు స్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగగలవు. రెవెన్యూ లోటును నియంత్రించడం కేవలం గణాంక లక్ష్యం కాదు. అది ఆర్థిక స్వావలంబనకు పునాది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మార్చి 5 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేసి విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయడం జరిగిందని, గ్రామ, పట్టణాల్లో ప్రజలకు లబ్ది చేకూర్చిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేవిధంగా చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.మార్చి 6 నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను అందరినీ భాగస్వాములు చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ – అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి ప్రభుత్వ రంగాలకు సంబంధించిన 10 థీమ్ లు ఉంటాయని, ప్రతి థీమ్ కొరకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు.ప్రతి కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ చేయాలని, పనిచేయక ముందు, పని చేశాక జరిగిన కార్యక్రమ ఫొటోలు, వీడియోలు తీసుకొని డాక్యుమెంటేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. రోజువారీ కార్యక్రమాలు నివేదిక రూపంలో అందజేయాల్సి ఉంటుందని సూచించారు.మార్చి 6 నుండి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ అనే థీమ్ ఉంటుందని, మార్చి 6న అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమ ప్రారంభోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి ర్యాలీ నిర్వహించడం,పారిశుధ్యం కొరకు శ్రమదానం కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా మార్చి 15 వరకు ఆయా కార్యాలయాల్లో ఉన్న పెండింగ్ ఫైళ్లు యుద్ధప్రాతిపదికన క్లియర్ చేసి సంబంధిత లబ్ధిదారులకు సమాచారం వెళ్ళే విధంగా చూడాలని తెలియజేశారు. తమ తమ కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా చేపట్టే ప్రతి పని ప్రజలకు స్పష్టంగా కనిపించాలని చెప్పారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ఎవరైనా అలసత్వానికి తావు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్. ఖీమ్యా నాయక్, జడ్పీ సి ఈ ఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు గణిత విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పదో తరగతి విద్యార్థులు గణిత విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఒక్కరు కూడా ఫెయిల్ అవ్వకుండా మంచి మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలనీ, వడ్డించే ముందు సూపర్వైజర్ తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి తనిఖీ చేయాలనీ సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల వంటగదిని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఆహారంలో నాణ్యతను ఎప్పటికప్పుడు కాపాడాలని సిబ్బందిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం కోసం వండే ఆహారాన్ని తప్పనిసరిగా గ్యాస్ సిలిండర్ పైనే చేయాలని కట్టల పోయి వాడకాన్ని ఆపేయాలని సూచించారు.ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై రాబోయే బోర్డు పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఏ విషయాల్లో వెనుకబడి ఉన్నారో వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి చదవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే అవి జీవితాంతం ఉపయోగపడతాయని చెప్పారు. ఈసారి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకూడదని తెలిపారు. అలాగే వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా గణితంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.తదనంతరం కలెక్టర్ పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థులు నేర్చుకుంటున్న ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రాజెక్టులను సులభంగా అర్థం చేసుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు రూపొందించిన చిత్రాలను (పెయింటింగ్స్) పరిశీలించి వారిని అభినందించారు.జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# దొంగల ముఠా గుట్టు రట్టు

● ఆరుగురు అరెస్ట్



**కల్వకుర్తి రూరల్, మార్చి 5 (జనం సాక్షి) :** నాగర్కర్నూల్ జిల్లా వంగూర్ కల్వకుర్తి వెల్దండ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు దొంగలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు.వీరు వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి,కల్వకుర్తి,నాగర్ కర్నూల్,అచ్చంపేట మండలం హాజీపూర్,వెల్దండ మండలాల్లో ఇళ్లల్లో వరుస దొంగతనాలు, బంగారు దొంగతనాలకు పాడుపడినట్లు పోలీసులు తెలిపారు.విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం 10 గంటలకు ఓ దాబా వద్ద వీరిని అరెస్టు చేసినట్లు డిఎస్పి సాయిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐ, ఎస్సై లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలి

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్, మార్చి 5 (జనం సాక్షి) :** విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలని...గురువారం కలెక్టర్ కార్యాలయంలో పి.యం సూర్యఘర్ ప్రచార వాహనాన్ని జెండా ఊపి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్య గార్ పథకం ద్వారా గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఈ వాహనం మెదక్ జిల్లాలోని వివిధ మండలాలు,గ్రామాలు పర్యటించి పథకం గురించి అవగాహన కల్పించి పథకం యొక్క ప్రయోజనాలను ఎలా పెంపొందించాలో మార్గనిర్దేశనం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**శామీర్‌పేట్, మార్చి 5 (జనం సాక్షి) :** పేద ప్రజల మౌలిక వసతుల కల్పనకే కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందని మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. గురువారం మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో పొన్నాల గ్రామంలో రాగి స్వాతి – బాల్ రెడ్డిల ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ ,మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాపి రెడ్డి,మల్లేష్ యాదవ్, మున్సిపల్ సెక్రటరీ దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేష్, తుము వేణుగోపాల్, దామోదర్ రెడ్డి, మహేష్ఇందిరమ్మ కమిటీ సభ్యులు బత్తిని నర్సింగ్ రావు, ఎరుకల యాదగిరి, కంగ్రెస్ నాయకులు బత్తిని పాండు,రాగి మహేందర్ రెడ్డి ,తడసిన నరసింహ రెడ్డి,మెడబోయిన వెంకటేష్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ జయంతి వేడుకలు

● ప్రత్యేక హోమాలు చేసిన రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు
● వేడుకలకు హాజరైన ప్రముఖులు



శివ్వంపేట మార్చి 5 జనంసాక్షి : శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వీరాజిల్లుతున్న శ్రీ గురుపీఠంలో శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ 82వ జయంతి వేడుకలను పురస్కరించుకొని జరుగుతున్న ప్రత్యేక పూజలు యాగాలు గురువారం జరిగిన వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య పూర్ణాహుతితో పండితులు పూర్ణాహుతితో యాగాన్ని పరిపూర్ణం చేశారు. ఈ యాగ కత్రువులు ప్రత్యేక పూజాదికాలు శ్రీ గురుఫీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ పెద్దగౌని జిన్నారం శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ సుహాసిని రెడ్డి, మోహన్ రావు, బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు పబ్బా రమేష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లక్ష్మీ కాంతారావు, బండారి గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ఆయా గ్రామాల్లో చెందిన సర్పంచులు, రాజిపేట వెంకటేశ్వర్, బ్యాగరీ నరసయ్య, మాజీ ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో హాజరై గురు పీఠంలో కొలువైన సాయిబాబా, దత్తాత్రేయ మహాస్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ 82వ జయంతి వేడుకలు పాల్గొనగా, గురు పీఠంలో స్వామీజీ పుట్టినరోజు సందర్భంగా ట్రస్ట్ సభ్యులు సూర్యకుమార్ గౌడ్ దంపతులు, రాజం బిక్షపతి యాదవ్ దంపతులు మరికొందరు భక్తులు హోమాది కత్రువులో దంపతుల వారిగా పాల్గొని స్వామి వారి కృపాకు పాత్రులయ్యారు. శ్రీ గురు పీఠానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మాజీ సర్పంచ్ స్వరాజ్య లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజ్యసభ సీట్లలో మాదిగలకు అన్యాయం




**సికింద్రాబాద్, మార్చి 5 (జనంసాక్షి) :** రాజ్యసభ సీట్ల కేటాయింపులో మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం నమ్మకద్రోహమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాల యంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.తెలంగాణలో మూడు ఎస్సీ రిజర్వ్ లోకసభ స్థానాలు ఉన్నప్పటికీ మాదిగలకు ప్రాతిని ధ్యంఇవ్వలేదని, ఎమ్మెల్సీ స్థానాల్లో కూడా అవకాశం కల్పించలేదని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణలో కూడా మాదిగలకు కేవలం9శాతం మాత్రమేఇచ్చిఅన్యాయం చేశారని అన్నారు. కోదాడలో కర్లరాజేష్ లాకప్ డెత్ ఘటనపై ఇప్పటివరకు సీఎం స్పందించలేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సీట్ల విషయం లో నిరసనగా ఈ నెల 13 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని మంద కృష్ణ మాదిగ తెలిపారు.ఈ సమావే శంలో డాక్టర్. చిప్పలపల్లి సోమ శేఖర్ మాదిగ,టీవీ నరసింహ మా దిగ,డప్పు మల్లికార్జున్ మాదిగ, సందే కార్తిక్ మాదిగ,డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ తదితరులు పాల్గొ న్నా రు.

# రేడియల్ రోడ్డు బాధితులతో గ్రామసభ

● రైతుల డిమాండ్లపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక

**కొందుర్గు, మార్చి 5 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని ముట్పూర్ మరియు చుక్కమెట్టు గ్రామాల్లో రేడియల్ రోడ్డు–2 నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులతో అధికారులు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు జరిగిన ఈ సమావేశానికి షాద్‌నగర్ ఆర్డీఓ సరిత ,డీఏఓ జ్యోతి,కొందుర్గు మండల తహశీల్దార్ అజాం అలీ రూరల్ సీఐ, శ్రీనివాస్, కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ స్థానిక సర్పంచ్‌లతో పాటు ముట్పూర్, చుక్కమెట్టు గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం ముట్పూర్ గ్రామంలో 137 మంది రైతుల నుండి, చుక్కమెట్టులో 19 మంది రైతుల నుండి మొత్తం సుమారు 93.06 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తమ జీవనాధారమైన సాగుభూములను కోల్పోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

### కలెక్టర్‌కు నివేదిక త్వరలో నష్టపరిహారం ప్రకటన

రైతుల నుంచి సేకరించిన వినతులు, వారి డిమాండ్లను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని అధికారులు తెలిపారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని, మరోసారి గ్రామసభ నిర్వహించి రైతులకు అందే తుది నష్టపరిహారం వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని వారు హామీ ఇచ్చారు. తమకు మార్కెట్ ధర ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించాలని రైతులు ఈ సందర్భంగా గట్టిగా డిమాండ్ చేశారు.



## నాంపల్లి రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం

● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**సికింద్రాబాద్, మార్చి 5 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి రైల్వే స్టేషన్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో కలిసి నాంపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారతీయ రైల్వేల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. రైల్వే రంగంలో సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పలు కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్ నగరానికి ముఖ్యమైన కేంద్ర స్టేషన్‌గా ఉన్న నాంపల్లి స్టేషన్‌కు రోజుకు సుమారు 60 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, రోజుకు దాదాపు 20 వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్టేషన్‌ను పూర్తిగా ఆధునిక నమూనాలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.350 కోట్లు కేటాయించగా, టెండర్ ప్రక్రియలో రూ.327 కోట్లతో పనులు ఖరారయ్యాయని వెల్లడించారు. అవసరమైతే రెండో దశలో మరిన్ని నిధులు సమకూర్చి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. స్టేషన్ పైభాగంలో సుమారు 6,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో సెంట్రల్ హాల్ నిర్మించి అందులో రెస్టారెంట్, ఫుడ్ కోర్ట్, ఇతర స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో రైల్వే రంగంలో ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. మిగిలిన స్టేషన్ల పనులను కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ఆర్.ఎస్.పి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సందీప్ జైన్ తదితరులు పాల్గొన్నారు

# నిధుల దుర్వినియోగంపై తక్షణమే సమగ్ర దర్యాప్తు చేపట్టాలి



**సికింద్రాబాద్, మార్చి 5 (జనంసాక్షి) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో జరిగిన రూ.69 కోట్ల నిధుల దుర్వినియోగంపై తక్షణమే సీబీఐ తో సమగ్ర దర్యాప్తు జరిపించాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) ప్రధాన కార్యదర్శి గురువరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువరెడ్డి మాట్లాడుతూ రూ,69 కోట్ల రూపాయల నిధులు విశాఖ ఇండస్ట్రీస్ మరియు హెచ్‌సీఏ యాజమాన్యం మధ్య క్విడ్ ప్రో కో ఒప్పందం ద్వారా దోచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హెచ్‌సీఏ లో జరిగిన ఈ అక్రమాలకు బాధ్యులైన డా.జి.వివేకానంద్, హెచ్‌సీఏ ఏపెక్స్ కౌన్సిల్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ గోల్మాల్ కు సంబంధించిన పలు పత్రాలను ఆయన విడుదల చేశారు. హెచ్‌సీఏ లో జరిగిన ఆర్థిక అక్రమాలు, ప్రజలకు చెందిన నిధులను రక్షించడంలో హెచ్‌సీఏ ఉద్దేశపూర్వకంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. బీసీసీఐ సూచనల మేరకు టీసీఏ మరియు హెచ్‌సీఏ కలిసి సమావేశాలు నిర్వహించి క్రికెట్ అభివృద్ధిపై నిర్ణయం తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 18న జస్టిస్ పి.నవీన్ రావు అధ్యక్షతన సమావేశం జరిగిందన్నారు. ఆ సమావేశంలో కూడా హెచ్‌సీఏ క్రికెట్ అభివృద్ధికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనలు సమర్పించలేదని ఆయన వివరించారు.ఆ సమావేశంలో టీసీఏ తెలంగాణలో క్రికెట్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో సమర్పించినట్లు ఆయన తెలిపారు. హెచ్‌సీఏ మాత్రం మళ్లీ ఎటువంటి అభివృద్ధి ప్రతిపాదనలు ఇవ్వలేదని ఆయన అన్నారు. అదేవిధంగా రెండు సంస్థలు కలిసి పని చేసే విషయంపై నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. సుప్రీం కోర్టు, బాంబే హైకోర్టు, తెలంగాణ హైకోర్టు ఆదేశాలను హెచ్‌సీఏ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. టీసీఏ సమర్పించిన ప్రతిపాదనలకు హెచ్‌సీఏ స్పందించలేదని ఆయన చెప్పారు. హెచ్‌సీఏ క్రికెట్ అభివృద్ధి కంటే బీసీసీఐ నుంచి వచ్చే నిధులపైనే దృష్టి పెట్టిందని ఆయన ఆరోపించారు. అర్హతలు లేని వ్యక్తిని సీఈఓగా నియమించారని, అలాగే కొత్త అధ్యక్షుడిని నియమించడంలో కూడా నియమాలను ఉల్లంఘించారని ఆయన ఆరోపించారు. తెలంగాణ క్రికెటర్ల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన ప్రజా నిధులు, విశాఖ ఇండస్ట్రీస్‌కు కోట్ల రూపాయలు సులభంగా బదిలీ అయ్యేలా హెచ్‌సీఏ ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకుందని ఆయన వివరించారు. ఈ అంశంపై జస్టిస్ ఎల్. నాగేశ్వర రావు కమిటీ, హైకోర్టు డివిజన్ బెంచ్ (జస్టిస్ మౌషిమి భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్ రావు) కూడా అభిప్రాయాలు వెల్లడించాయని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో హెచ్‌సీఏలో జరుగుతున్న అనేక ఆర్థిక లావాదేవీలపై టీసీఏకు తీవ్ర అనుమానాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై గత సంవత్సరం టీసీఏ సీఐడీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీఏ పై నమోదైన కేసు దర్యాప్తు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. అవసరమైతే ఈ కేసును సీబీఐకి అప్పగించి సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై రేపు సీఐడీ మరియు రాష్ట్ర డీజీపీకి మరోసారి కొత్త పిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను రద్దు చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 06 మార్చి 2026

# మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

- అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్
- ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ
- ఏప్రిల్ 16న మండల స్థాయిలో కార్యక్రమం
- మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం
- మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం
- జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 5 (జనం సాక్షి) :** మార్చి 6వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన... ప్రగతి ప్రణాళికలు కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, హోం, రవాణా, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ, హౌసింగ్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.అయిదు దశల్లో అమలు చేయనున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా వివరించారు. ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం – ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి. కార్యక్రమం హోం మరియు రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్--సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత , రక్షణ -- డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుండి మే 9 వరకు రైతులు (వ్యవసాయం( అంశంపై వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు--విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు. మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, తడి--పొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అన్నారు .మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా ఎమ్మెల్యే



**కల్వకుర్తిరూరల్, మార్చి 5 (జనంసాక్షి) :** నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్ పండు చెక్కులను పంపిణీ చేశారు.అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారు ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై కళాజాతర ప్రదర్శన



**వెల్దండ, మార్చి 5 (జనంసాక్షి) :** వెల్దండ మండల కేంద్రంలో గురువారం పౌర సమాచార సంబందాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి సారధి బృందం కళాకారులు రహదారుల భద్రతపై కళాజాతర ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, డ్రైవింగ్ చేయవద్దని, హెల్మెట్లు ధరించాలని, లైసెన్సు, బీమా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై తీసేకోవాల్సిన జాగ్రత్తలపై కళాకారులు భాస్కర్, శివయ్య, రాజు, సికిందర్, పార్వతమ్మ, రమాదేవి, కవిత, అస్మబేగం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణత అభియాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మార్చి 5 (జనం సాక్షి) :** సంపూర్ణత అభియాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం గట్టు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం సమావేశ మందిరంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై జిల్లా మరియు మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమం జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్దేశించిన అన్ని అంశాల్లో ఏప్రిల్ 14లోపు లక్ష్యాలను 100 శాతం సాధించేలా సంబంధిత శాఖల అధికారులు సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన టాయిలెట్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే మండలంలో పశువులకు 100 శాతం ఎఫ్ఎమ్‌డీ టీకాలు వేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సప్లిమెంటరీ పోషకాహార పంపిణీ కూడా శాతం వందకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అంగన్వాడీ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లా స్థాయి అధికారులు కూడా తరచూ ఫీల్డ్ సందర్శనలు చేసి అమలు పురోగతిని పరిశీలించాలని అన్నారు.ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ విజయవంతం కావడానికి మండలంలోని ప్రతి శాఖ అధికారి సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతకు ముందు పీపీటీ ద్వారా నీతి ఆయోగ్ కోఆర్డినేటర్ గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో నీతి అయోగ్ అధికారి యోగేంద్ర చతుర్వేది, డీడబ్ల్యుఓ సునంద, గట్టు మండల తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక శాఖ అధికారి శివనంద,నీతి అయోగ్ కో ఆర్డినేటర్ అఫ్జల్ ,వివిధ శాఖల మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- ఎస్సై అశోక్ బాబు



**మాగనూరు, మార్చి 5 (జనం సాక్షి) :** గ్రామాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి మాగనూరు ఎస్సై అశోక్ బాబు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మాగనూరు పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు గ్రామ పెద్దలు, యువతతో మాగనూరు ఎస్సై అశోక్ బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామాల్లో భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల నేరాలను ముందుగానే గుర్తించడం, నేరస్థులను త్వరగా పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రత పరిరక్షణలో సర్పంచులు, గ్రామ పెద్దల పాత్ర కీలకమని, గ్రామానికి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఇటీవల దేవాలయాల్లో జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో గ్రామాల్లోని దేవాలయాల వద్ద ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు సహకరిస్తూ గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడాలని ఎస్సై అశోక్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పెద్దలు, యువత మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్ సమస్యలు పరిష్కరించాలి



**అమీన్పూర్, మార్చి 5 (జనం సాక్షి) :** అమీన్పూర్ పట్టణంలో ఆయా కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రి హరీష్ రావు ను కలిసి విన్నవించారు. గురువారం మాజీ మంత్రి హరీష్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు ను కలిశారు. ఈ సందర్భంగా అమీన్పూర్ పట్టణంలోని ఆయా కాలనీలో ఉన్న తాగునీటి, రూ కాలువల సమస్య, విద్యుత్ దీపాలు సిసి రోడ్లు సమస్యల ను వారికి వివరించారు. త్వరలోనే అమీన్పూర్ లో పర్యటించి సమస్యలపై స్పందిస్తామని హామీ ఇచ్చారని అమీన్పూర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలరెడ్డి తెలిపారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమీక్ష



**మల్దకల్, మార్చి 5 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారముమండల స్థాయి శాఖ అధికారులతో మండల స్పెషల్ ఆఫీసర్ సంగీతలక్ష్మి సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికఈనెల 6 నుండి జూన్ 12 వరకు పది శాఖల పైగ్రామ స్థాయి వివిధ కార్యక్రమాలు చేపట్టాలని చర్చించారు.పరిసరాల శుభ్రత , ఫైళ్ళ పరిష్కారం, ఆరోగ్యం, సురక్షితంగా చేరుకోండి, సంక్షేమం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ,ఇందిరమ్మ ఇండ్లు, పిల్లల భద్రత,రక్షణ నో డ్రగ్స్,రైతులు వ్యవసాయం, ,విద్య,యువత,క్రీడలు మహిళలు,పర్యావరణం, శాఖ అంశములపై మండల స్థాయి అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో, ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ జాకీర్ భాషా షేక్,మండల ఏఈ బషీర్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంగీతంతో విద్యార్థుల సృజనాత్మకత పెరుగుదల




**వెల్దుర్తి, మార్చి 5 (జనం సాక్షి) :** సంగీతం వల్ల విద్యార్థులలో సృజనాత్మక పెరుగుతుందని వెల్దుర్తి హై స్కూల్ హెచ్‌ఎం సాంబయ్య అన్నారు గురువారం రోజు పాఠశాలలో సంగీత క్లాసులను ప్రారంభించడం జరిగింది ఈ శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సంగీతం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందని సృజనాత్మకత పెరుగుతుందని ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అలాగే సంగీత వాయిద్యాలు వాయించడం వల్ల మనసు మరియు శరీరం మధ్య సమన్వయం ఏర్పడుతుందని ఆయన అన్నారు ప్రభుత్వ పాఠశాలలో సంగీత వైద్యాలలో శిక్షణ అనేది విద్యార్థులకు ఒక అమూల్యమైన అవకాశం అని ఆయన తెలిపారు ఈ శిక్షణ తరగతులను రోజువారిగా నిర్వహించడం జరుగుతుందని సంగీత విద్వాంసుడు నవీందర్ గారు రోజు మూడు గంటలు క్లాస్ చెప్పడం జరుగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయసుధ చార్లెస్ శ్రీనివాస్ ఖదీర్ పద్మజ సునీత వెంకట్ రెడ్డి తదితర టీచర్లు పాల్గొన్నారు.

# సదాశివపేటలో నకిలీ సిగరెట్ల దందా..!

- గోల్డ్‌ఫ్లేక్ లైట్స్ పేరుతో డూప్లికేట్ సిగరెట్ల విక్రయం
- అసలు ప్యాకెట్లతో పోలిక...వినియోగదారులు గందరగోళం
- అక్రమ దందాపై విచారణ చేపట్టాలని వినియోగదారుల డిమాండ్

**సదాశివపేట, మార్చి 5 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, ప్రాంతాల్లో నకిలీ సిగరెట్ల దందా జరుగుతున్నట్లు వినియోగదారుల నుంచి వస్తున్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రముఖ ఐటీసీ సంస్థకు చెందిన గోల్డ్ ఫ్లేక్ లైట్స్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ సిగరెట్లు మార్కెట్‌లో విక్రయమవుతున్నట్లు సమాచారం. పట్టణంలోని పలు రిటైల్ దుకాణాల్లో ఈ నకిలీ ప్యాకెట్లు లభ్యమవుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. అసలు బ్రాండ్‌కు పోలికగా ప్యాకింగ్ ఉండటంతో సాధారణ వినియోగదారులు సులభంగా మోసపోతున్న పరిస్థితి నెలకొంది. స్థానిక వ్యాపారులు, వినియోగదారుల వివరణ ప్రకారం అసలు, నకిలీ సిగరెట్ ప్యాకెట్లు బయటకు చూస్తే దాదాపు ఒకేలా కనిపిస్తున్నాయి. ప్యాకింగ్ డిజైన్, హెచ్చరికల ముద్రణ, బ్రాండ్ లోగో కూడా సమానంగా ఉండటంతో తేడా గుర్తించడం కష్టమవుతోందని వారు తెలిపారు. మార్కెట్ ధర కంటే 30 నుంచి 40 శాతం వరకు తక్కువ ధరకు ఈ ప్యాకెట్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. అధికారిక డీలర్ల ద్వారా కాకుండా మధ్యవర్తుల ద్వారా ఈ సరుకు సరఫరా అవుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆరోగ్యానికి ముప్పు... ప్రభుత్వ ఆదాయనికి గండీ

నకిలీ సిగరెట్ల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల వినియోగదారుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నియంత్రణలో లేని పొగాకు పదార్థాలు, ప్రమాదకర రసాయనాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.అదేవిధంగా నకిలీ సిగరెట్ల విక్రయం వల్ల ప్రభుత్వానికి జీఎస్టీతో పాటు ఇతర పన్నుల రూపంలో భారీ ఆదాయ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు సూచిస్తున్నాయి. ఈ అక్రమ దందాపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వినియోగదారులు అప్రమత్తంగా ఉండి అధికారిక డీలర్ల వద్ద నుంచే సిగరెట్లు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.




### లేబుల్‌లో సూక్ష్మ తేడాలు... గుర్తించడం కష్టమే..

అసలు గోల్డ్ ఫ్లేక్ లైట్స్ ప్యాకెట్‌పై గోల్డ్ రంగు స్పష్టంగా మెరుస్తూ ఉండగా, నకిలీ ప్యాకెట్లలో అది కొంత మసకబారినట్లు కనిపిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కొన్ని ప్యాకెట్లలో ముద్రణ స్పష్టత లేకపోవడం, అక్షరాల రంగులో తేడా ఉండటం, ప్యాకెట్ నాణ్యత తక్కువగా ఉండటం వంటి లక్షణాలు గమనించవచ్చని పేర్కొంటున్నారు. అయితే ఇవి సూక్ష్మ తేడాలు కావడంతో సాధారణంగా గుర్తించడం కష్టమవుతోందని తెలిపారు.

## క్యూరియాసిటీ సైన్స్ ల్యాబ్ ప్రారంభించిన డీఈవో



**వరంగల్ ఈస్ట్, మార్చి 05 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లాలోని జి హెచ్ ఎస్ కరీమాబాద్ పాఠశాలలో "క్యూరియాసిటీ సైన్స్ ల్యాబ్" ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ రంగయ్యనాయుడు మరియు ఏఎంఓ సుజన్ తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ రంగయ్యనాయుడు మాట్లాడుతూ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని 5 హైస్కూల్‌లలో క్యూరియాసిటీ సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. జిహెచ్ఎస్ మాట్వాడ జిహెచ్ఎస్ క్రిస్టియన్ కాలనీజి హెచ్ ఎస్ గిర్మాజిపేట్, హెచ్ఎస్ దేశాయిపేట్. హెచ్ఎస్ కరీమాబాద్ప్రతి పాఠశాలకు సుమారు రూ.2 లక్షల 30 వేల వ్యయంతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, విద్యార్థులు ల్యాబ్‌లో నిర్వహించే కార్యకలాపాల ద్వారా ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందుతూ భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏఎంఓ సుజన్ తేజ మాట్లాడుతూ సైన్స్ సబ్జెక్ట్ ద్వారా పాఠ్యాంశాలను నేర్చుకోవడం మాత్రమే కాకుండా, ప్రయోగశాలలో ఉన్న పరికరాలను ఉపయోగించి ప్రయోగాలు చేయడం ద్వారా విషయ అవగాహన మరింత స్పష్టంగా అవుతుందని తెలిపారు. అలాగే ఈ ల్యాబ్ కార్యకలాపాల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, విభిన్న ఆలోచనలు మరియు విశ్లేషణ సామర్థ్యాలు పెంపొందుతాయని చెప్పారు. విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకుంటూ సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ముందుకు సాగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో ప్రతినిధులు భానుప్రసాద్, చంద్రకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి , ఏపీసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్ని పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలి

- ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక పక్కాగా అమలు
- చిత్తశుద్ధి తో పని చేయాలి
- విద్యకు ప్రభుత్వం పెద్దపీట
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, మార్చి 5(జనంసాక్షి):** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను క్షేత్ర స్థాయి లో పక్కాగా అమలు కావాలని లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగం గా జిల్లా విద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలిసిన కార్యక్రమాల పైన అసిస్టెంట్ డైరెక్టర్, వీజూా లతో కలెక్టర్ గురువారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా లికలెక్టర్‌లి మాట్లాడుతూ.. జిల్లా లోని అన్ని ప్రభుత్వ పాఠశాల లో శానిటేషన్ కా ర్య క్ర మా లు చేపట్టాలన్నారు. పెండింగ్ లో ఉన్న అన్ని ఫైల్ లను క్లియర్ చేయాలన్నారు. ఈ ఆఫీస్ నిర్వహణ ఉండాలన్నారు. టాయిలెట్, వాష్ రూమ్ పరిశుభ్రం గా పెట్టాలని,మున్సిపల్ వాళ్ళతో సమన్వయం చేసుకొని పాఠశాల ఆవరణ అంతా ఎలాంటి చెత్త చెదారం లేకుండా చూడాలన్నారు. కిచెన్ గది కూడా నీట్ గా పెట్టాలని, పిచ్చి మొక్కలని తొలగించాలన్నారు. తాగునీటి సరఫరా కి సంబందించిన మైనర్ రిపేర్ లు ఉంటే చేపించుకోవాలన్నారు. విద్య కి ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని... విద్యార్థులు మంచి వాతావరణం లో విద్య ను అభ్యసించేలా పరిస్థితులు ఉండాలన్నారు.

## గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలి

- పారిశుద్ధ్య పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్



**నిర్మల్ బ్యూరో, మార్చ్ 05 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు మెరుగైన పారిశుధ్యం కొనసాగించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా, గురువారం ఉదయం మామడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో ఆసుపత్రులు, కార్యాలయాలు, వీధులు, అన్ని ప్రాంతాలలో పరిశుభ్రతను కొనసాగించాలని చెప్పారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని వివరించారు. ఆసుపత్రి ప్రాంగణం మొత్తం శుభ్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటే, చికిత్సల కొరకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 05 (జనంసాక్షి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ర్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పేర్కొన్నారు. గురువారం అన్ని శాఖల అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక కార్యాచరణ పై కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధించిన కార్యాచరణపై వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై రూపొందించాలన్నారు. ఈ 99 రోజుల కార్యక్రమాలు ప్రధానంగా 10 అంశాలపై కొనసాగుతాయన్నారు. మార్చి 6 నుండి 15 వరకు గ్రామాలలో మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యక్రమాలలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పెండింగ్ ఫైళ్ళ పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. మార్చి 8 న ప్రపంచ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు చైర్మన్ లు శాసన సభ్యులు, శాసన మండల సభ్యుల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి, నుండి జిల్లాస్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్ చేయాలని అన్నారు.

## పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథం ప్రారంభం




**జనగామ ప్రతినిధి, మార్చి 5(జనంసాక్షి):** దేశంలో ఒక కోటి కుటుంబాలకు లబ్ది చేకూర్చడానికి, పీఎం–సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన ప్రచార రథాన్ని కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్కో జిల్లా మేనేజర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 3 కిలోవాట్ల పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా విద్యుత్ ఎస్ ఈ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పున్నమి కాంతుల్లో కొమ్మలమ్మ

- ఆదివాసుల ఆరాధ్య దైవం
- వెండి కంకణమే తల్లికి కానుకలు





**కొత్తగూడ, మార్చి 5 (జనంసాక్షి) :** మేడారం సమ్మక్క–సారలమ్మల తరహాలో గిరిజనులు అంతటి భక్తిశ్రద్ధలతో కొలిచే మహోన్నత శక్తి కొమ్మాలమ్మ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడ గ్రామంలో వెలిసిన ఈ దేవతకు 11వ శతాబ్దం నాటి నుండే గొప్ప చరిత్ర ఉంది. మేడారం సమ్మక్క సారలమ్మ,కొమ్మలమ్మ ఐదవ గొట్టు బండాని గోత్రంకు చెందినవారుగా చరిత్ర తెలుపుతుంది. ఖడ్గ రూపంలో కొమ్మాలమ్మ: ఒక విశిష్ట చరిత్ర సాధారణంగా దైవం అంటే విగ్రహ రూపంలో ఉంటారు, కానీ కొమ్మాలమ్మ తల్లి పూర్తిగా కత్తి (ఖడ్గం) రూపంలో దర్శనమిస్తుంది. అందరు గిరిజన దేవతల కల్లా పెద్ద దేవతగా కొమ్మలమ్మను కొలుస్తారు. ఒకప్పుడు గోదావరి తీరంలో పూజలందుకున్న ఈ తల్లి, కాలక్రమేణా 'వాసం, ఆలూరు,యాలం వంశీయుల ఆరాధ్య దైవంగా ఎంచగూడ ప్రాంతానికి చేరుకుంది.మహా శక్తిగా భవిస్తారు.పూర్వం ఈ తల్లి ఖడ్గాన్ని తిరిగి గోదావరి ప్రాంతానికి తీసుకువెళ్లడానికి ప్రయత్నించగా గోదావరి పరివాహక ప్రాంతం లోఅగ్ని ప్రమాదాలు జరిగి ఊరంతా అగ్నికి ఆహుతి కావడంతో దేవత ఆగ్రహానికి భయపడి, భక్తులు తిరిగి ఈ ఖడ్గాన్ని ఎంచగూడలోనే ప్రతిష్టించారని తెలుస్తుంది.

మేడారంలో బెల్లాన్ని (బంగారాన్ని) సమర్పించినట్లుగా, కొమ్మాలమ్మ తల్లికి వెండి కంకణాన్ని కానుకగా సమర్పించడం ఇక్కడి ఆచారం.కోరిన కోరికల కొంగు బంగారంగా ముఖ్యంగా సంతానం లేని వారు తల్లిని వేడుకుంటే ఫలితం నిశ్చయమని భక్తుల నమ్మకం. మొక్కు తీర్చుకోవడంలో సంతానం కలిగిన దంపతులు తమ కృతజ్ఞతగా తల్లికి వెండి కంకణాలను (రింగులను) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.భవిష్యత్తును చెప్పే కంకణాల సవ్వడి కొమ్మాలమ్మ...కేవలం దేవత మాత్రమే కాదు, ఆదివాసీల పాలిట ఒక ప్రకృతి శాస్త్రవేత్త. రాబోయే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయో తల్లి ముందే హెచ్చరిస్తుందని మీరు పూర్తి నమ్మకం.తల్లి గద్దెపై ఉన్న కత్తి వెండి కంకణాలు కదిలి గలగలమంటూ శబ్దం చేస్తే ఆ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని కంకణాలు బిగుసుకుపోయి నిశ్శబ్దంగా ఉంటే వర్షాలు తక్కువని భావిస్తారు. వర్షాలు లేని సమయంలో ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేస్తే, కచ్చితంగా వానలు కురుస్తాయని గిరిజనుల ప్రగాఢ విశ్వాసం.

### వెదురు కంకలు.. ఎర్రని జెండాలు

ప్రతి రెండేళ్లకు ఒకసారి కోనాపురం అడవుల నుండి ప్రత్యేకంగా వెదురు కంకలను సేకరించి తీసుకువస్తారు.ఎర్రని బట్టలు, గంటలు, కొంబురాల (కొమ్ములు) తో పూజారులు తల్లిని ఆరాధిస్తారు. డోలు వాయిద్యం గిరిజన డోలి వాయిద్యం ఆ ప్రాంతమంతా మారుమోగుతుంటే, దైవత్వం ఉట్టిపడేలా శివసత్తుల పూనకాల మధ్య జాతర సాగుతుంది. కఠినమైన నిబంధనలతో తయారుచేసే మూడు జెండాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణ.అగ్ని రూపంలో గద్దెపైకి చేరే వనదేవత కొమ్మాలమ్మ, అడవి బిడ్డల కష్టాలను తీర్చే కల్పవల్లి. పున్నమి కాంతుల్లో జరిగే ఈ జాతర, ఆదివాసీ సంస్కృతికి ప్రకృతికి ఉన్న విడదీయలేని బంధానికి నిలువుటద్దం. ప్రత్యేక పూజ విధానంలో ఈ జాతర వాసం వారి వంశీయులు 5వ గొట్టు బండాని గోత్రం వారు తలపతులుగా,ఆలూరి వంశీయులు 3వ గొట్టు,వడ్డెగోత్రం వారు ప్రధాన వడ్డెలుగా యాలం వంశీయులు 3వ గొట్టు,వడ్డె గోత్రం వారు జలకపు వడ్డెలుగా ఉంటూ జాతర నిర్వహిస్తారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ విధానం, భద్రతా ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీటింగ్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, ఇన్విజిలేటర్ల విధులు, విద్యార్థుల హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సదుపాయం, భద్రత వంటి అవసరమైన సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు ఎలాంటి మాల్ప్రాక్టీసులకు తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను నిశితంగా పరిశీలించిన తదుపరి మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, పరీక్షల విభాగం చీఫ్ సూపరింటెండెంట్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

### జంగేడు కేజీబీవీ పాఠశాల తనిఖీ..

జంగేడులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారు ఎలా ఉన్నారు, బాగా చదువుతున్నారా అంటూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం 6వ, 10వ తరగతులను, ఇంటర్ తరగతులను పరిశీలించారు. వసతి గృహంలో నిత్యావసర వస్తువుల నిల్వలు, భోజనశాల, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, డైనింగ్ హాలు, ఆర్ ఓ ప్లాంట్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా టాపరేనని ఎవరూ తక్కువకాదని బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బెస్ట్ విషెస్ తెలిపారు. అనంతరం సైన్స్, ఎలక్ట్రానిక్ మెషిన్ ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయించాలని డీఈఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, డీఈఓ రాజేందర్, ఎస్ఓ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కేసుల విచారణలో ఫోరెన్సిక్ నివేదికలు కీలకం: జడ్జి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** కేసుల విచారణలో ఫోరెన్సిక్ నివేదికలు కీలకమని, వాటిపై న్యాయ వాదులు పూర్తిస్థాయి అవగాహనా కలిగి వున్నప్పుడే కేసుల విచారణ సులువవుతుందని సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ప్రొబెలాబ్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎస్ఎల్ నివేదికలు సకలలంలో సేకరించి, వాటిని విశ్లేషించి, సరైన పద్ధతిలో కోర్టు ముందు పెట్టినప్పుడు కేసుల పరిష్కారం వీలవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొబెలాబ్ ఫోరెన్సిక్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మోహన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, భూపాలపల్లి ఎస్సై రవళి పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు బ్యూరో,మార్చి05(జనం సాక్షి):** ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ ఇంచర్ల శివారులోని ఎర్రి గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎలక్ట్రిసిటీ, ఫ్లోరింగ్, పెయింటింగ్ తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని నిర్మాణ పనులలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్,డిఈ లింగ రెడ్డి,గుత్తేదారు కృష్ణ పాల్గొన్నారు.

## మార్చి నెలలో మత్తడి పడుతున్న కొప్పూర్ చెరువు

- 40 ఏళ్లలో ఇదే మొదటిసారి
- రిటైర్డ్ టీచర్ హనుమాన్ల ప్రసాద్ రెడ్డి



**భీమదేవరపల్లి, మార్చి 5 (జనం సాక్షి) :** మండలంలోని కొప్పూరు గ్రామ పరిధిలోని తమ్మలబండ చెరువు, ఊరు చెరువు, విశ్వనాథ్ కాలనీ చెరువులు ఈ మార్చి నెలలో మత్తడి పడటం స్థానిక రైతుల్లో ఆనందాన్ని నింపింది. గత 40 సంవత్సరాలుగా మార్చి నెలలో చెరువులు మత్తడి పడిన దృశ్యం తాను ఎప్పుడూ చూడలేదని గ్రామానికి చెందిన హనుమన్ల ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన చెరువులను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులకు నీరు చేరేందుకు కెనాల్ కాలువల్లో పేరుకుపోయిన మట్టిని జేసీబీలతో తొలగించి, ముళ్ల కంపలను శుభ్రం చేయడం వల్లే ఈ పరిస్థితి సాధ్యమైందన్నారు. ధర్మసాగర్ చెరువు నుంచి కాలువల ద్వారా నీటిని రప్పించేందుకు కొప్పూరు గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి అధికారులు తో సమన్వయం చేసి చర్యలు తీసుకోవడం వల్ల చెరువులు నిండాయని తెలిపారు. దీనివల్ల గ్రామ రైతులకు పంటలకు అవసరమైన నీరు అందుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ గద్ద కుమారస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.రైతులకు పంట సాగుకు నీరు అందేలా చేసినందుకు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చెరువులు నిండటంతో పంటల సాగుకు నీటి కొరత ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో కూడా నీరు అందుబాటులో ఉండటంతో పంటలకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామ రైతులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్త సదాశివరెడ్డి ప్రసాద్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించాలి

- గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మిక తనిఖీ



**మహబూబాబాద్ బ్యూరో, మార్చి 05 (జనం సాక్షి):** విద్యాలయాలద్వారా ఆరోగ్యం, ఉత్తమ విద్య బోధనలు పిల్లలకు అందించాలని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఇస్లాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రంలలో స్టాక్, రిజిస్టర్, పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ గది, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు. పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలోని (19) గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు ఆరు (6), పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ (9), గిరిజన ప్రైమరీ స్కూల్స్ జిపిఎస్, (104), లలో (881) పదవ తరగతి విద్యార్థులు, మొత్తం (7044), విద్యార్థినీ, విద్యార్థులు ఉండగా ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా,మానసికంగా దృఢంగా ఉండే విధంగా తరగతులు నిర్వహిస్తూ నిత్యం గమనించడం జరుగుతుందని, షెడ్యూలు ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉపాధ్యాయుల ద్వారా అత్యుత్తమ విద్య బోధనలు అందించడం జరుగుతుందని ,(ప్రతి నాలుగు) హాస్టళ్లకు కలిపి ఒక ప్రత్యేక అధికారి అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, పిఎమ్ఆర్సిలు, ఏసీఎంఓలు, జిసిడిఓ, స్పోర్ట్స్ అధికారి ఎస్సీఆర్పిలను నియమించి 100% ఫలితాలు వచ్చే విధంగా ప్రత్యేక తరగతులు, ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేస్తూ పిల్లలకు ఎలాంటి మానసిక ఒత్తిడి లు లేకుండా హ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించడం జరుగుతుందని, ప్రతి రోజు అదనపు కలెక్టర్లు,జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు, స్థానిక సంబంధిత మండల స్థాయి అధికారులు అందరూ పరిశీలన, తనిఖీల ద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధించడం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు, రానున్న పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలని, పక్కాగా డైట్ మెనూ ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం స్నాక్స్ అందించాలని, తద్వారా పిల్లలు మంచి వాతావరణంలో విద్యను కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిని, గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం నాయక్, స్థానిక తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మానికేశ్వరి నగర్ గంగపుత్ర సంఘం నూతన భవనానికి శంకుస్థాపన

- హాజరైన ఫిషరీస్ డిపార్ట్మెంట్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**సికింద్రాబాద్, మార్చి 5 (జనంసాక్షి) :** తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వరినగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఫిషరీస్ డిపార్ట్మెంట్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. గంగపుత్ర సంఘ సభ్యులు ఐక్యతతో పనిచేస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. సేవా భావంతో ఎదుగుతూ గంగపుత్ర సమాజానికి తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని సంఘ సభ్యులకు సూచించారు. గంగపుత్ర సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మనికేశ్వరి నగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దుంపల సత్యనారాయణ, చైర్మన్ ఇటియల భూమ్రాజ్, కర్ణం వేణు, పాక శంకర్, సురేష్, రాచమల్ల స్వామి, బాలరాజ్ కోటేష్ కైలాష్ కూర శీను. తదితరులు పాల్గొన్నారు.

## చండూరు మండల ప్రయాణికుల అవస్థలు పట్టించుకోని ఆర్టీసీ అధికారులు




**చండూరు, మార్చి 5 (జనంసాక్షి) :** జిల్లాలో ఆర్టీసీ బస్సుల రాక కోసం పల్లె ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా చండూరు మండలం మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సుల ప్రయాణికుల గోస వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళలకు వరంగా మారినా, క్షేత్రస్థాయిలో డ్రైవర్ల తీరుతో అది శాపంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. చండూరు నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సులు ఆగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్టాపుల్లో మహిళలు ఎక్కువగా కనిపిస్తే చాలు, డ్రైవర్లు బస్సులను వేగంగా పోనిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉచిత ప్రయాణం కావడంతో మహిళల రద్దీ పెరిగింది. అయితే, టికెట్ ఆదాయం చూపించాలనే సాకుతోనో లేదా రద్దీని తట్టుకోలేకో డ్రైవర్లు బస్సులను ఆపకుండా వెళ్తున్నారని సమాచారం. బస్సు కోసం గంటల తరబడి వేచి చూసినా, తీరా బస్సు వచ్చాక ఆపకుండా వెళ్లడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకు కనీసం బస్సు సౌకర్యమే లేకపోగా, ఉన్న బస్సులు కూడా సకాలంలో రాకపోవడం గమనార్హం. "బస్సు వస్తుందన్న నమ్మకం లేదు.. వస్తే ఆపుతారన్న గ్యారెంటీ లేదు" అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరీ జటిలంగా మారుతోంది. ఈ విషమ పరిస్థితిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని చండూరు మండల ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలంటే క్షేత్రస్థాయిలో సిబ్బంది తీరు మారాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అవసరమైనచోట పైపులైను ఏర్పాటు చేయాలి

- మిషన్ భగీరథ నీరును ఇంటింటికి సరఫరా చేయాలి
- మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్



**హుజూర్‌నగర్, మార్చి 5 (జనంసాక్షి) :** పట్టణంలోని మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పైపులైన్ వేయాలని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ కోరారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరాపై కౌన్సిలర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశంలో యాక్షన్ ప్లాన్ నిర్వహించారు. హుజూర్ నగర్ లోని 28 వార్డుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు వేసవిలో తాగునీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరును ఇంటింటికి సరఫరా చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు, ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, కమిషనర్ శ్రీనివాసు, ఏఈ వినోద్ కుమార్, కౌన్సిలర్లు మంజుల, పద్మ, కోల,ఉదయభాను, దగ్గుబాటి కవిత, కృష్ణ, ధనమ్మ, నాగలక్ష్మి నాగమణి, ఊహ, చంటి, సైదులు, శ్రీనివాసు, విజయ్ పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డు రద్దు...?




**చండూరు, మార్చి 5 (జనంసాక్షి) :** తెలంగాణ విద్యావ్యవస్థలో భారీ మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 2027-28 విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, 12వ తరగతి వరకు పాఠశాల విద్యలోనే విలీనం చేయాలని యోచిస్తోంది. దీనివల్ల పదవ తరగతి తర్వాత విద్యార్థులు నేరుగా పాఠశాలల్లోనే ప్లస్ టూ పూర్తి చేసి, అనంతరం డిగ్రీ లేదా వృత్తి విద్యా కోర్సుల్లో చేరవచ్చు. ఈ సంస్కరణ కార్పొరేట్ కాలేజీల విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేస్తుందని, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది విద్యార్థుల విద్యా మనుగడను మెరుగుపరిచే బృహత్తర కార్యక్రమంగా నిలవనుంది.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- జిల్లా కలెక్టర్ అంకిత్

**మణుగూరు, మార్చి 5 (జనం సాక్షి) :** ప్రభుత్వాధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం మణుగూరు మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.

ఆసుపత్రిలోని వార్డులు, ఔషధ నిల్వ గది, మందుల సరఫరా విధానం, ఔట్ పేషంట్ విభాగం, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పరిషత్ పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన విధానం గురించి తెలుసుకున్నారు. ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్‌లో ఆహార తయారీ విధానాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా



అనే విషయాన్ని ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు మరియు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారు పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఫలితాల వివరాలు తెలుసుకొని ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో పాటు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరి యూనిట్ ద్వారా సరఫరా అవుతున్న చిక్కీలను స్వయంగా రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని కూడా రుచి చూసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన విధానం మరియు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి వారికి పాఠాలు ఎలా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మంచి విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం మరియు ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారం పంపిణీ విధానం, పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీటి సదుపాయం, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, గుడ్లు మరియు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి గుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకాహారం మెనూ ప్రకారం సమయానికి అందుతున్నదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆటపాటల ద్వారా బోధన విధానాన్ని కూడా పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం నాణ్యంగా, పరిశుభ్రంగా అందేలా, కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, డిప్యూటీ తహసిల్దార్ రామారావు, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, విద్యాశాఖాధికారి స్వర్ణలత , ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, సూపరిండెంట్ సునీల్ కుమార్ ,గంజి సంజీవరావు, వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, నాగ శ్రీ , సిడిపిఓ జయలక్ష్మి, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తుట్ ఫైనాన్స్ మేనేజర్ ఘరానా మోసం

- తన అకౌంట్‌లో డబ్బు జమ చేయాలని డిమాండ్
- అరెస్ట్ చేసిన పోలీసులు

**మిర్యాలగూడ, మార్చి 6 (జనంసాక్షి) :** సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగం, స్థిరమైన ఆదాయం, కుటుంబ అండ ఉన్నప్పటికీ వ్యసనాల బారిన పడితే మనిషి ఎంత దిగజారుతాడో మిర్యాలగూడలో వెలుగుచూసిన ముత్తూట్ ఫైనాన్స్ మోసం మరోసారి నిరూపించింది. కస్టమర్ల విశ్వాసాన్ని పెట్టుబడిగా మార్చుకుని లక్షల రూపాయలు కాజేసిన ఆ బ్రాంచి మేనేజర్ యాదగిరి వ్యవహారం సంచలనంగా మారింది. ఈసందర్భంగా మిర్యాలగూడ డీఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పి రాజశేఖర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడలోని ముత్తూట్ ఫైనాన్స్ శాఖలో మేనేజర్‌గా పనిచేస్తున్న లోడంగి యాదగిరి, తన వద్దకు వచ్చే కస్టమర్ల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. క్రికెట్ బెట్టింగ్ వ్యసనం కారణంగా భారీ మొత్తంలో డబ్బు అవసరమైన యాదగిరి, తన అధికారాన్ని వాడుకుని కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసి సంస్థ ఖాతాలో జమ చేయకుండా తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించినట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు. బాధితుడు శంకర్ నుంచి లోన్ క్లియర్ చేయాల్సిన పేరుతో రూ.9.60 లక్షలు వసూలు చేసిన యాదగిరి, ఆ మొత్తాన్ని సంస్థ ఖాతాలో జమ చేయకుండా తన బ్యాంకు ఖాతాలోకి మళ్లించుకున్నాడని తెలిపారు. అనంతరం ఆ డబ్బును ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో ఖర్చు చేసినట్లు తెలిసిందని, మేనేజర్ హోదాను నమ్మిన కస్టమర్లను తప్పుదోవ పట్టించేందుకు అతడు పలు సాకులు చెప్పినట్లు తెలుస్తోంది. "టెక్నికల్ ఇష్యూస్ ఉన్నాయి", "సర్వర్ పనిచేయడం లేదు", "కరెంట్ అకౌంట్‌లో సమస్య ఉంది" అంటూ బాధితులను నమ్మబలికాడు. సంస్థ సాఫ్ట్‌వేర్‌లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు పాస్‌వర్డ్‌లు నమోదు చేస్తూ సిస్టమ్ పనిచేయడం లేదని చెప్పి సమయం గడిపినట్లు పోలీసులు గుర్తించామన్నారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో నిందితుడి వద్ద నుంచి రూ.4 లక్షలను పోలీసులు రికవరీ చేశామని, మిగిలిన డబ్బు బెట్టింగ్‌లో ఖర్చయిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. ఏ ఫైనాన్స్ సంస్థలోనైనా లావాదేవీలు జరిపేటప్పుడు ఆ సంస్థ అధికారిక బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమ చేయాలని, ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు పంపవద్దని హెచ్చరించారు. లావాదేవీ పూర్తయిన వెంటనే అధికారిక రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కేసు చేదించిన వన్ టౌన్ సీఐ నాగభూషణం రావు, సిబ్బందిని జిల్లా ఎస్పి అభినదించినట్లు

## ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**మునగాల, మార్చి 6 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గురువారం మునగాల మండలంలో ఆకుపాముల,గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్,విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది,పదో తరగతుల గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు అడిగారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఏడు, ఎనిమిది,తొమిది తరగతి,పదవ తరగతి విద్యార్థులతో అన్ని సబ్జెక్టులలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, పరిశీలించారు. కుర్చీలు, బెంచెస్ కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో పట్టు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదాల సరైన ఉచ్చారణ, అర్థ వివరణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాలని తెలిపారు. విద్యార్థులు చదివింది అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- లారీ సీజ్, ఇద్దరిపై కేసు నమోదు

**తూప్రాన్, మార్చి 5 (జనం సాక్షి) :** తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టిన తూప్రాన్ ఎస్ఐ గంగరాజు, సిబ్బంది,ఈటిఎఫ్- 2,టీం హైదరాబాద్ వారితో కలిసి చేపట్టిన వాహన తనిఖీలలో రంగారెడ్డి జిల్లా నుండి లారీ నెంబర్ టీఎస్ 08 యు ఎఫ్ 1149 గల వాహనం లో విదర్భ రైస్ మిల్ కు 368.50. క్వింటాళ్ల బియ్యం అక్రమంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు చెందవలసిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించి, వాహన డ్రైవర్ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్టు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు, అనంతరం వాటిని జిల్లా సివిల్ కాప్లయ్ అధికారులకు అప్పగించారు, మెదక్ జిల్లా సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ తాటి




నర్సింలు సిజ్ చేసిన 368.50. క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేగుంట గోదంలో బద్రపరుస్తున్నట్టు తెలిపారు, ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనశీ సిజ్ చేసి , శ్రీపతి నాగేష్, భాస్కర్,అనే ఇద్దరి వ్యక్తులపై చట్టపరమైన కేసు లు నమోదు చేసినట్టు తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలి

- పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 5 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు,తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు,వార్డు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడిపొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం, ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం హోమ్ రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు మరియు ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత, రక్షణ, డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుండి మే 9 వరకు వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని



సూచించారు. మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 7న ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో కార్యాచరణపై రాష్ట్ర మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శిరీష,సిపిఓ యాదగిరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## 10,000ఎంఏహెచ్ బ్యాటరీతో రియల్‌మీ నార్జో పవర్ 5జీ

**న్యూఢిల్లీ:**చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ రియల్‌మీ బడ్జెట్ సెగ్మెంట్‌లో మరో బిగ్ బ్యాటరీ ఫోన్‌ను లాంచ్ చేసింది. కొన్ని వారాల క్రితం రియల్‌మీ పీ4 పవర్ పేరిట 10,001ఎంప్ర భారీ బ్యాటరీతో ఓ ఫోన్ తీసుకొచ్చింది. ఇప్పుడు అంతే బ్యాటరీ సామర్థ్యంతో నార్జో సిరీస్‌లో నార్జో పవర్ 5ఉ పేరిట కొత్త ఫోన్ విడుదల చేసింది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 7400 ప్రాసెసర్‌ను అమర్చారు. 50 ఎంపీ సోనీ ఎఓచీ882 ప్రధాన కెమెరాను ఇచ్చారు.రియల్‌మీ నార్జో పవర్ 5జీ ఫోన్‌లో 6.78 అంగుళాల డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 144ఉళి రిఫ్రెష్ రేటుతో పనిచేస్తుంది. 6,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన రియల్‌మీ యూఐ 7.0తో పని చేస్తుంది. వెనకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ యాక్సిస్ ఓఐఎస్ కెమెరా, 8 ఎంపీ సెకండరీ కెమెరా ఇచ్చారు. ముందువైపు 16 ఎంపీ కెమెరా అమర్చారు. 80చి సూపర్‌వూక్ ఛార్జర్‌తో వస్తోంది. కేవలం 85 నిమిషాల్లో బ్యాటరీని ఫుల్ ఛార్జ్ చేయొచ్చని కంపెనీ పేర్కొంది. ఐపీ 66, ఐపీ 68, ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. దీని బరువు 219 గ్రాములు. ఈ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8ఉః ఖీంఓ + 128ఉః స్టోరేజ్ బేస్ మోడల్ ధర రూ.27,999గా నిర్ణయించారు. 8ఉః ఖీంఓ + 256ఉః స్టోరేజ్ టాప్ లెవల్ మోడల్ ధరను రూ.29,999గా కంపెనీ నిర్ణయించింది. డిస్కౌంట్ (రూ.3 వేలు బ్యాంక్ ఆఫర్+ రూ.1000 అదనపు డిస్కౌంట్)లతో కలుపుకొని బేస్ మోడల్ ధర రూ.23,999, టాప్ మోడల్ రూ.25,999కు కొనుగోలు చేయొచ్చు. 6 నెలల నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్‌ను కంపెనీ కల్పిస్తోంది. నేటినుంచి రియల్ మీ, అమెజాన్ ఆన్‌లైన్ స్టోర్‌లలో ఈ ఫోన్ విక్రయాలకు రానుంది. టైటాన్ సిల్వర్, టైటన్ బ్లూ రంగుల్లో లభిస్తుంది.



# సెన్సెక్స్ 900 పాయింట్లు పైకి

### ఉద్రిక్తతలున్నా రాణించిన సూచీలు.



**ముంబయి:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను నిలిపివేయడానికి సిద్ధమంటూ ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి పేర్కొన్నారంటూ వచ్చిన వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. దీంతో ఉద్రిక్తతల వేళ వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. లాభాల్లోకి వచ్చాయి. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 1100 పాయింట్ల మేర లాభపడింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.453 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 79,530.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,116.19) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీలు ఇంట్రాడేలో 80,303.83 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 899.71 పాయింట్ల లాభంతో 80,015.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 285.40 పాయింట్ల లాభంతో 24,765.90 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ, రిలయన్స్, బీఈఎల్ స్టాక్స్ లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.89 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 5150 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

లాభాలకు కారణాలు ఇవీ..

న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను ఆపేందుకు ఇరాన్ అంగీకారం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో ఇరాన్ చర్చలకు సిద్ధమైందన్న వార్తలూ యుద్ధం త్వరలోనే ముగియబోతుందన్న సంకేతాలిచ్చాయి. అయితే, ఆ వార్తలను ఇరాన్ ఖండించడం గమనార్హం.మూడు రోజుల వరుస నష్టాల నేపథ్యంలో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో మన మార్కెట్ సూచీలు లాభపడ్డాయి.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలోనే చల్లారొచ్చన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు నేడు రాణించాయి. నిన్న భారీగా పతనమైన దక్షిణ కొరియా కోస్పీ నేడు 9 శాతం మేర లాభపడింది. జపాన్, హాంకాంగ్, చైనా మార్కెట్లు కూడా రాణించడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. నిన్నటి అమెరికా మార్కెట్లు కూడా రాణించాయి.హర్మూజ్ గుండా వెళ్లే నౌకలకు తక్కువ ధరకే బీమా కల్పిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడమూ మరో కారణం. అవసరమైతే చమురు నౌకలకు అమెరికా నౌకాదళం ఎస్కార్ట్‌గా పంపిస్తామన్నారు.డాలరుతో రూపాయి విలువ బలోపేతమైంది. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 92 ఎగువకు చేరిన రూపాయి విలువ మళ్లీ 91.60 స్థాయికి చేరింది. దీనికితోడు రిలయన్స్ వంటి అత్యధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. క్రూడాయిల్ ధరల పెరుగుదల వల్ల (విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించకపోతే) రిలయన్స్ కంపెనీ లాభపడుతుందన్న జెఫ్రీచ్ నివేదిక కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది.

## రోబోటిక్స్ టీమ్‌పై వేటు

### అమెజాన్‌లో మరోసారి లేఆఫ్‌లు..





**వాషింగ్టన్:**ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఈసారి రోబోటిక్స్ విభాగంలోని ఉద్యోగులపై వేటు పడింది. సుమారు 100 మంది వైట్‌కాలర్ ఉద్యోగులపై ప్రభావం పడినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ 'రాయిటర్స్' తన కథనంలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. మరిన్ని తొలగింపులు ఉంటాయని అప్పట్లోనే సంకేతాలు ఇచ్చింది. అందులోభాగంగానే ఇప్పుడు తాజా లేఆఫ్‌లు చేపట్టింది.ఇందులోభాగంగా అమెజాన్ గోదాముల్లో పనిని ఆటోమేషన్ చేసేందుకు రోబోలను డిజైన్ చేసే టీమ్‌పై వేటు పడింది. కస్టమర్లకు మెరుగైన సేవలందించేందుకు తమ టీమ్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటామని అమెజాన్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందీ పేర్కొనకుండా లేఆఫ్‌లను ధ్రువీకరించింది. వేర్‌హౌస్‌లో కార్మికులకు సాయపడేందుకు రోబోటిక్ విభాగమైన బ్లూ జే.. గతేడాది అక్టోబర్‌లో రోబోలను ప్రదర్శించింది. అయితే, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఈ ఏడాది జనవరిలో వీటి తయారీని నిలిపివేసింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగుల కోతలను ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగ ప్రవేశం, ఖర్చుల తగ్గింపులో భాగంగా గతేడాది అక్టోబర్‌లో 14వేల మందిని, ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది కలిపి ఇప్పటికే 30 వేల మంది ఉద్యోగులను అమెజాన్ పక్కనపెట్టింది.

## రోజువారీ క్యాష్ విత్‌డ్రాపై పీఎన్‌బీ పరిమితి

పంజాబ్ నేషనల్ బ్యాంకు రోజువారీ ఏటీఎం నగదు విత్‌డ్రా పరిమితులను సవరించింది. ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై నగదు విత్‌డ్రా పరిమితిని 50 శాతం మేర తగ్గించింది. ఈ మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ ఓ ప్రకటనలో పేర్కొంది. "కొన్ని వేరియంట్లకు చెందిన డెబిట్ కార్డుల ఏటీఎం నగదు ఉపసంహరణను బ్యాంకు కుదించింది. రిస్క్‌ను తగ్గించడం, వినియోగదారుల భద్రత పెంచడం, సురక్షిత డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నాం" అని పీఎన్‌బీ పేర్కొంది.రూపే ఎన్‌సీఎంసీ ప్లాటినం డొమెస్టిక్, రూపే ఎన్‌సీఎంసీ ప్లాటినం ఇంటర్నేషనల్, రూపే ఉమెన్ పవర్ ప్లాటినం, రూపే పీఎన్‌బీ పలాష్, రూపే బిజినెస్ ప్లాటినం, మాస్టర్ కార్డ్ ప్లాటినం, వీసా గోల్డ్, పీఎన్‌బీ మాస్టర్ కార్డ్ ప్లాటినం డెబిట్ కార్డులపై ఏటీఎం నగదు విత్‌డ్రా పరిమితిని రూ.లక్ష నుంచి రూ.50 వేలకు తగ్గించింది. అలానే రూపే సెలక్ట్, పీఎన్‌బీ రూపే సెలెక్ట్ నియో, పీఎన్‌బీ రూపే సెలక్ట్ ఎక్సెల్, వీసా సిగ్నేచర్, మాస్టర్ కార్డు బిజినెస్ డెబిట్‌కార్డులకు రూ.1.50 లక్షలుగా ఉన్న పరిమితిని రూ.75 వేలకు తగ్గించింది. ఇతర డెబిట్ కార్డులకు సంబంధించిన ఏటీఎం విత్‌డ్రా పరిమితులు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది.




# ఇదీ వ్యూహం!

### డేటా సెంటర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు..



**న్యూఢిల్లీ:**ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడి అనంతరం పశ్చిమాసియా రగులుతోంది. ఇరాన్ కూడా ప్రతి దాడులకు పాల్పడుతోంది. ఇరాన్ ముందు నుంచీ హెచ్చరించినట్లే అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడులకు దిగుతోంది. ఇందులో భాగంగా తాజాగా గల్ఫ్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు చెందిన డేటా సెంటర్లే లక్ష్యంగా డ్రోన్లతో విరుచుకుపడింది. దీని వెనుక ఇరాన్ ముందస్తు వ్యూహం ఉందని అర్థమవుతోంది.సాంకేతిక యుగంలో డేటా ఇంధనంలాంటిది. 'ఇన్ఫర్మేషన్ ఈజ్ వెల్త్' అని ఓ సినిమాలో డైలాగ్ కూడా ఉంది. దీన్ని గ్రహించిన ఇరాన్ గల్ఫ్‌లోని ఏడబ్ల్యూఎస్‌కు చెందిన డేటా సెంటర్లను లక్ష్యంగా చేసుకుంది. తద్వారా అమెరికా వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీయాలన్న వ్యూహం కనిపిస్తోంది. ఒకవేళ తమపై అమెరికా దాడి చేస్తే వేటిని లక్ష్యంగా చేసుకోవాలన్నది ఇరాన్ వద్ద ముందు నుంచే స్పష్టమైన ప్రణాళిక ఉందని ఈ దాడులను బట్టి అర్థమవుతోంది. యూఏఈ, బహ్రెయిన్‌లోని తమ డేటా సెంటర్లపై దాడిని అమెజాన్ కూడా ధ్రువీకరించింది. దీంతో తమ కార్యకలాపాల్లో అంతరాయం ఏర్పడిందని పేర్కొంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సమాచార నిల్వ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సేవలకు డేటా సెంటర్లు కీలకం. వీటి ఏర్పాటుకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం అవుతాయి. అమెరికాకు చెందిన బిగ్ టెక్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు యూఏఈలో 8 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం గల్ఫ్‌ను గ్లోబల్ ఏఐ సెంటర్‌గా మారుస్తామని ప్రకటించారు. తాజాగా ఏడబ్ల్యూఎస్‌కు చెందిన డేటా సెంటర్లపై దాడి ద్వారా అమెరికా వ్యాపార ప్రయోజనానలు దెబ్బతీయడం ఇరాన్ లక్ష్యమని అర్థమవుతోంది. ఇరాన్ దాడుల అనంతరం అమెజాన్ షేర్లు ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో దాదాపు 3 శాతం మేర పతనం అయ్యాయి.యుద్ధ క్షేత్రంలో శత్రువు తప్పించుకునే అవకాశం లేకుండా కచ్చితత్వంతో దెబ్బతీయడంలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని నిపుణులు చెబుతున్నారు. యుద్ధం మొదలైన తొలిరోజే ఖమేనీని హతమార్చడంలో ఏఐ కీలక భూమిక పోషించిందని వార్తలు వస్తున్నాయి. ఇందుకు ఆంత్రోపిక్‌కు చెందిన క్లాడ్ ఏఐని అమెరికా మిలటరీ వాడుకుందని తెలుస్తోంది. యుద్ధ క్షేత్రంలో ఏఐ వినియోగాన్ని దెబ్బతీయాలంటే స్థానికంగా ఉన్న డేటా సెంటర్లను దెబ్బతీయడం ఇరాన్ ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది. తద్వారా ముమ్మందు అమెరికా-ఇజ్రాయెల్ దళాలను నిలువరించడం సాధ్యమవుతుందనేది ఇరాన్ భావన. డేటా సెంటర్ల మీద బ్యాంకింగ్, ఈ-కామర్స్, సోషల్ మీడియా, గేమింగ్, హెల్త్‌కేర్ వంటి సెక్టార్లు ఆధారపడి ఉంటాయి. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా డేటా సెంటర్లపై దాడి ద్వారా బహుళ వ్యాపారాలను దెబ్బతీయొచ్చనేది ఇరాన్ వ్యూహం అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందుకే డేటా సెంటర్లపై దాడులకు పాల్పడుతోందని, ముమ్మందూ ఈ దాడులు కొనసాగొచ్చని పేర్కొంటున్నారు.

## రాజ్యసభకు వెళ్తున్నా..

- నితీశ్ కుమార్ ప్రకటన
- బిహార్‌తో అనుబంధం కొనసాగుతుందని వెల్లడి
- రాజ్యసభకు నామినేషన్ వేసిన బిహార్ ముఖ్యమంత్రి
- హాజరైన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా
- బీజేపీకి దక్కనున్న కొత్త ముఖ్యమంత్రి పదవి

పాట్నా(జనంసాక్షి):జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'ఎక్స్' వేదికగా ధృవీకరించారు. దీంతో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటివరకు తాను మూడు సభల్లో సభ్యుడిగా ఉన్నానని, రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించి 'నాలుగు సభల క్లబ్'లో చేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి ఎంతో మద్దతిచ్చారు. అంకితభావంతో నా నేను విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితం ప్రారంభించినప్పటి నుంచి నా మనసులో ఓ కోరిక ఉంది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలతో పాటు పార్లమెంట్‌లోని ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలి అనుకుంటున్నాను. నూతన బాధ్యతలు చేపట్టాక కూడా బిహార్‌తో నా బంధం ఇలాగే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని నితీశ్ కుమార ఎక్స్‌లో రాసుకొచ్చారు . నితీశ్ తాజా ప్రకటనతో.. బిహార్‌కు నూతన ముఖ్యమంత్రి ఎన్నిక అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతకే సీఎం పదవీ బాధ్యతలు దక్కవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ ఆశావహులు సీఎం కుర్చీ కోసం పోటీపడుతున్నారు. ఆ జాబితాలో ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, రాష్ట్ర మంత్రి దిలీప్ జాయస్వాల్, దిఘా ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కూడా సీఎం రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. బిహార్‌లో గతేడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. బీజేపీ, జేడీయూ కూటమి తరఫున నితీశ్ కుమార్ రికార్డ్ స్థాయిలో పదోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. అయితే.. దేశ వ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభకు వెళ్లేందుకు ఆయన నామినేషన్ వేయనున్నట్లు సమాచారం.

రాజ్యసభకు నితీశ్ నామినేషన్

బీహార్ సీఎం నితీశ్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేపర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం అమిత్ షా పాట్నాకు వచ్చారు. ఆయనకు సిఎం నితీశ్ స్వాగతం పలికారు. బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితిశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు. నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్దాల పాటు తనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞలు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు.


### కువైట్ వద్ద ట్యాంకర్‌పై దాడి..

## సముద్రంలోకి ఒలికిన చమురు

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో ఘర్షణలు నెలకొన్న వేళ... కువైట్ జలాల్లో చమురు ట్యాంకర్‌పై దాడి జరిగింది. దాంతో ఇంధనం సముద్రంలోకి ఒలికింది. ఈ మేరకు గురువారం బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ వెల్లడించింది. "కువైట్‌లోని ముబారక్ అల్ కబీర్ పోర్ట్ సమీపంలో భారీ పేలుడు శబ్దం వినిపించిందని, ఆ తర్వాత అక్కడినుంచి ఒక చిన్న బోటు వెళ్లిపోవడం కనిపించిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ట్యాంకర్ నుంచి ఒలికే ఇంధనం వల్ల పర్యావరణంపై ప్రభావం ఉండొచ్చు" అని ఏజెన్సీ పేర్కొంది.డీజిల్, గాసోలిన్ ఎగుమతులు నిలిపివేయాలని చైనా తన రిఫైనరీలకు సూచించింది. అలాగే గల్ఫ్ దేశాలకు తన సర్వీసుల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చైనాకు చెందిన షిప్పింగ్ సంస్థ ఊూఊూ వెల్లడించింది. ఇదిలాఉండగా, ఆరోరోజు ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. విశాఖపట్నం నుంచి వెళ్తున్న ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా-75ను అమెరికా తన జలాంతర్గామితో దాడిచేసి ముంచేసిన సంగతి తెలిసిందే.

## నీటి లోపల 'నిశ్శబ్ద మృత్యువు'..

### ఇరాన్ యుద్ధ నౌకను ముంచిన టోర్పిడో ఇదే..!



కొన్ని వేల మైళ్ల దూరంలో ఉన్న ఇరాన్ యుద్ధ నౌకను ముంచేసి అమెరికా సృష్టించిన అలజడి అంతాఇంతా కాదు. చడీచప్పుడు లేకుండా హిందూ మహాసముద్రంలో నీటి దిగువ నుంచి జలాంతర్గామితో అగ్రరాజ్యం ఈ దాడి చేసింది. సబ్‌మెరైన్‌తో శత్రునౌకను అమెరికా ధ్వంసం చేయడం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మళ్లీ ఇప్పుడే. ఈ పని చేసింది అగ్ర రాజ్యానికి చెందిన నిశ్శబ్ద మృత్యువు 'మార్క్ 48 టోర్పిడో (ఝూ ఓజీతీఎ 48 ఎనీతీజూవటనీ)'..! ఏంటీ సముద్రగర్భ క్షిపణి వ్యవస్థ..? ఇదెలా పనిచేస్తుంది..?'మార్క్ 48'.. అత్యంత బరువైన వైర్-గైడెడ్ టోర్పిడో. దీన్ని 1972లో తొలిసారిగా అమెరికా నావికాదళంలో చేర్చారు. అప్పటినుంచి దీన్ని అప్‌గ్రేడ్ చేస్తూ వస్తున్నారు. అధునాతన యుద్ధ అవసరాలకు అనుగుణంగా ఎలక్ట్రానిక్స్, గైడెడ్ వ్యవస్థలు, ప్రొపల్షన్ టెక్నాలజీని అనుసంధానించారు. 19 అడుగుల పొడవు, 21 అంగుళాల వ్యాసం కలిగిన ఈ టోర్పిడో బరువు దాదాపు 3800 పౌండ్లు (1700 కిలోలు). ఇది 650 పౌండ్ల వరకు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది. కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలపై దాడి చేయగలదు. అధునాతన నౌకాదళ యుద్ధాల్లో అత్యంత శక్తిమంతమైన సముద్రగర్భ ఆయుధంగా 'మార్క్ 48'ని అభివర్ణిస్తారు. ఇది శత్రు నౌకల పాలిట నిశ్శబ్ద మృత్యువు అని అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ స్వయంగా పేర్కొన్నారు.

టార్గెట్ మిస్సయినా రీఎంగేజ్..

ఇందులోని సోనార్ గైడెన్స్ సిస్టమ్ అండర్‌వాటర్ టార్గెట్‌లను వర్గీకరించి ట్రాక్ చేసేందుకు సాయపడుతుంది. ఈ టోర్పిడోను ప్రయోగించిన తర్వాత కూడా సబ్‌మెరైన్ ఆపరేటర్లు దాన్ని గైడ్ చేసే వీలుంటుంది. వైర్ కనెక్షన్‌తో టార్గెట్ డేటాను అప్‌డేట్ చేయవచ్చు. ఒకవేళ గైడెన్స్ వైర్ కట్ అయినా కూడా టోర్పిడో పూర్తిస్థాయి అటానమస్ మోడ్‌లో పనిచేయగలదు. స్వతంత్రంగా టార్గెట్‌ను ట్రాక్ చేసి దాడి చేయగలదు. ఒకవేళ టార్గెట్ మిస్ అయినా.. రీఎంగేజ్ అయి మళ్లీ దాన్ని వేటాడగల సామర్థ్యం ఈ టోర్పిడోకు ఉందని అమెరికా రక్షణ రంగ నిపుణులు తెలిపారు.

లక్ష్యం ముక్కలవ్వాల్సిందే..

సాధారణంగా యాంటీ-షిప్ క్షిపణులు నౌకలను సముద్ర ఉపరితలం మీద నుంచి టార్గెట్ చేస్తాయి. కానీ, మార్క్ 48 టోర్పిడో మాత్రం నౌక కింది భాగానికి వెళ్లి పేల్చేస్తుంది. అలా పేల్చినప్పుడు ఓ పెద్ద గ్యాస్ బుడగ ఏర్పడి అది వేగంగా వ్యాపిస్తుంది. ఫలితంగా నౌక ముక్కలై వేగంగా మునిగిపోతుంది. ఒకవేళ నౌక నిర్మాణానికి ఏమీ కాకపోయినా.. కీలకమైన ప్రొపల్షన్ సిస్టమ్స్ వంటి వ్యవస్థలను ధ్వంసం చేయగలదు. దీంతో నౌక పనిచేయకుండా నీటి లోపల మునిగిపోయే ప్రమాదం ఉంటుంది. ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా విషయంలోనూ మార్క్ 48 టోర్పిడో అత్యంత కచ్చితత్వంతో పనిచేసింది. ఆ ప్రాంతంలో సబ్‌మెరైన్ ఉన్న విషయాన్ని కూడా యుద్ధ నౌక గుర్తించకపోవచ్చని నౌకాదళ నిపుణులు అభిప్రాయపడ్డారు.మార్క్-48 టోర్పిడో ఒక్కో యూనిట్ తయారీకయ్యే ఖర్చు దాదాపు 4.2 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.38 కోట్లు). పెద్దఎత్తున ఆయుధాలను తరలించే నౌకలే లక్ష్యంగా దీన్ని అభివృద్ధి చేశారు. తాజాగా ఇది దాడి చేసిన ఇరాన్ యుద్ధ నౌకలోనూ భారీ ఆయుధాలు, భూతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులు, నౌకా రక్షక క్షిపణులు, టోర్పిడోలు, హెలికాప్టర్ ఉన్నాయి. ఘటన సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉండగా.. ఇప్పటివరకు 87 మృతదేహాలను వెలికితీశారు. మరో 32 మందిని శ్రీలంక భద్రతా దళాలు రక్షించాయి.






# పరీక్షల సమయంలో సినిమా...
# చిత్రీకరణ ఏంటి?
## విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన...



**శంకర్ పల్లి, మార్చి 05 (జనం సాక్షి) :** శంకర్‌పల్లి రేవతి హైస్కూల్‌లో విచిత్ర పరిస్థితి ఇది స్కూలా? సినిమా షూటింగ్ స్థలమా? శంకర్‌పల్లి ప్రాంతంలోని రేవతి హై స్కూల్‌లో ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితి స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. మరో పది రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సమయంలో స్కూల్ ప్రాంగణంలో సినిమా షూటింగ్ ఏర్పాట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. చదువుకు ప్రశాంతమైన వాతావరణం ఉండాల్సిన స్కూల్‌లో సినిమా సెట్స్ ఏర్పాటు చేయడం సరైన నిర్ణయమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో చాలా ముఖ్యమైనవి. ఈ సమయంలో విద్యార్థులు పూర్తిగా చదువుపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కానీ స్కూల్ ఆవరణలో సినిమా షూటింగ్ జరుగుతుండటం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షూటింగ్ కోసం వచ్చే వాహనాలు, సిబ్బంది రాకపోకలు విద్యార్థులకు ఇబ్బంది కలిగించే పరిస్థితి ఉందని అంటున్నారు. ఇంకా ఒక సమస్య ఏమిటంటే సినిమా షూటింగ్ వాతావరణం వల్ల పిల్లల దృష్టి చదువుపై నుంచి మరలే ప్రమాదం ఉంది. షూటింగ్ చూసి పిల్లల్లో హీరోల మాదిరి భావనలు పెరిగి చదువుపై శ్రద్ధ తగ్గే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఈ వ్యవహారంలో స్కూల్ కారస్పాండెంట్ వై.వి. శ్రీనివాసరావు తీసుకున్న నిర్ణయంపై కూడా ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు కంటే డబ్బులకే ప్రాధాన్యం ఇచ్చారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పరీక్షల ముందు స్కూల్‌లో షూటింగ్‌కు అనుమతి ఇవ్వడం సరైనదా అనే చర్చ జరుగుతోంది. అలాగే ఈ షూటింగ్‌కు సంబంధించి విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారా లేదా అన్న విషయంపై కూడా స్పష్టత లేదు. పరీక్షలు దగ్గరలో ఉన్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలకు అనుమతి ఎలా ఇచ్చారన్నది ప్రశ్నగా మారింది. ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగే కార్యక్రమాలను నిలిపివేసి, వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇల్లు..
# నిరుపేదల ఆత్మగౌరవ లోగిళ్లు
## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు
### ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలి : చలమల్ల క్రిష్ణారెడ్డి



మర్రిగూడ, మార్చి 5: మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల గిరిబాబు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నూతన ఇల్లు నిర్మాణం పూర్తయింది. గురువారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ యజమానులు పగిళ్ల గిరిబాబు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చలమల్ల క్రిష్ణారెడ్డి.. కొత్త ఇంటిలో ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం నిండాలని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ చలమల్ల క్రిష్ణారెడ్డి.. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా సొంత స్థలం ఉన్నవారికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. సాధారణ నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుతోందని, ఇది ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తాయని అన్నారు. ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలని, ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదల ఆత్మగౌరవ లోగిళ్లుగా నిలవాలని చలమల్ల క్రిష్ణారెడ్డి ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తోందని, ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదల జీవితాల్లో వెలుగు విరజిమ్ముతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 05 (జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఇట్టి పరిశీలనలో తహసీల్దార్ మహేష్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో సంవత్సరం జైలు శిక్ష
### రూ.13 లక్షల జరిమానా.. వారంలో చెల్లించాలని ఆదేశం..
### తీర్పునిచ్చిన రెండవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ

**గోదావరిఖని, జనంసాక్షి :** అప్పుగా డబ్బులు తీసుకొని చెల్లని చెక్కు ఇచ్చిన కేసు లో నిందితుడైన సింగరేణి ఉద్యోగి కొయ్యడ మల్లేష్ పై నేరం రుజువుకావడంతో సంవత్సరం జైలు శిక్ష ,చెక్ మొత్తం వారం రోజుల్లో చెల్లించాలని ఖని రెండవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ గురువారం తీర్పునిచ్చారు.కోర్ట్ వర్గాల కథనం ప్రకారం... ఐబి కాలనీకి చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి వి.గంగాధర్ రావు వద్ద గాంధీనగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి కొయ్యడ మల్లేష్ విడతలవారీగా 2020 అక్టోబర్ లో 13 లక్షలు అప్పుగా తీసుకొని ఎస్బీఐకి చెందిన చెక్ ఇచ్చాడు.అట్టి చెక్ ను గంగాధరరావు బ్యాంకులో జమచేయాగా మల్లేష్ ఖాతలో చెక్‌కు సరిపడా నిల్వలు లేకపోవటంతో చెక్ నిరాదరణకు గురైంది.

దీంతో గంగాధర్ రావు 2023 లో గోదావరిఖని 2వ అదనపు మున్సిఫ్ మేజిస్రేట్ కోర్ట్ లో తన న్యాయవాది ద్వారా చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు.దీంతో నిందితుని పై నేరం రుజువు కావటం తో శిక్ష ఖరారు చేస్తూ న్యాయ మూర్తి తీర్పునిచ్చారు.

## బోధన్ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి, వినికిడి పరీక్షలు

**బోధన్, మార్చి 5 (జనంసాక్షి) :** రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు గురువారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ బోధన్ సహకారంతో అంబులెన్స్, ఆర్టీసీ, స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా కంటి మరియు చెవి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు డా. బెనిట జాన్, ఆడియాలజిస్ట్ డా. బిపిన్ డ్రైవర్లకు పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, డ్రైవర్లు రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి కంటి చూపు, వినికిడి సరిగా ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధి పోలవరపు బసవేశ్వర్ రావ్, విద్యావికాస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 100 మంది డ్రైవర్లు ఈ వైద్య పరీక్షల్లో పాల్గొన్నారు.

### కలల పరీక్ష మధ్యలో కుప్పకూలిన బాలిక
# రేవతి ఆరోగ్యంపై ఆందోళన



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 5 (జనం సాక్షి) :** భవిష్యత్తు కోసం కలలు కంటూ పరీక్షా పేపర్‌పై సమాధానాలు రాస్తున్న ఓ అమాయక విద్యార్థిని ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్పకూలడంతో పరీక్షా కేంద్రం మొత్తం కలవరానికి గురైంది. తోటి విద్యార్థుల కళ్లముందే జరిగిన ఈ ఘటన అక్కడి ఉపాధ్యాయులను, అధికారులను కలచివేసింది. మెదక్ జిల్లాలోని రామాయంపేట స్నేహ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యార్థిని రేవతి (16) అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన రేవతి ప్రస్తుతం రామాయంపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. పరీక్ష రాస్తున్న సమయంలో ఒక్కసారిగా ఆమె స్పృహ తప్పి కుప్పకూలిపోవడంతో అక్కడి అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పరిస్థితి తీవ్రంగా ఉందని గుర్తించిన వారు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. కొద్దిసేపట్లోనే అంబులెన్స్ అక్కడికి చేరుకొని విద్యార్థినిని చికిత్స కోసం తరలించింది. సమాచారం అందుకున్న రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి తక్షణమే స్పందించి అంబులెన్స్‌లోనే రేవతికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థిని శారీరకంగా బలహీనంగా ఉండటం, వెన్నుముకలో తగినంత శక్తి లేకపోవడం వల్ల స్పృహ తప్పి పడిపోయిందని తెలిపారు. భవిష్యత్తులో పక్షవాతం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో మరింత మెరుగైన వైద్యం కోసం ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో పరీక్షా కేంద్రంలో కొంతసేపు ఉద్విగ్న వాతావరణం నెలకొంది. భవిష్యత్తు కోసం కలలు కంటున్న ఓ బాలిక ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించడంతో అక్కడి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రేవతి త్వరగా కోలుకుని మళ్లీ తన చదువుల్లో ముందుకు సాగాలని అందరూ ప్రార్థిస్తున్నారు.



## సకాలములో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడండి
### మున్సిపల్ కమిషనర్ మదుసుదన్ రెడ్డి

**తాండూరు మార్చి 5(జనంసాక్షి) :** పట్టణ ప్రజలు సకాలములో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ మదుసుదన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మదుసుదన్ రెడ్డి మాట్లాడుతూ మీ ఇంటి పన్ను బకాయిలు , వ్యాపార లైసెన్స్ ఫీజులు,నల్లా బిల్లులు వెంటనే మీ ఏరియా బిల్ కలెక్టర్ గాని వార్డు ఆఫీసర్ నకు గాని పురపాలక కార్యాలయంలో లేదా ఆన్‌లైన్ లో కానీ వెంటనే చెల్లించి రసీదు పొందగలరని కోరారు. పురపాలక చట్టం 2019 ననుసరించి మీ స్థిర చర అస్థులను జప్తు చేయడం జరుగుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచండి. చెత్తను మురికి కాలవలో పడవేయకండి, మీ ఇంటిలోని తడి పొడి చెత్తను వెరుచెసి మీ ఇంటికి వచ్చే చెత్త సేకరించే ఆటోలోనే వేయాలన్నారు. బహిరంగ ప్రదేశంలో చెత్త వేయడం మరియు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడమైనదన్నారు. మన పట్టణాన్ని పరిశుబ్రంగా వుంచుకుందాం. ఆరోగ్యాలను కాపాడుకుందామని తెలిపారు. సకాలములో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడగలరని విజ్ఞప్తి చేశారు.

## పాత పద్ధతిలోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

- విబిజి రామ్‌జి రద్దు చేయాలి
- వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహా
- రామన్నపేట ఎంపీడీఓ కార్యాలయం ముందు వ్యకాస మహాధర్నా




రామన్నపేట, మార్చి 5 (జనంసాక్షి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేసేందుకే వి బి జి రాంజీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహా, జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య అన్నారు. ఇటీవల మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజి రాంజీని రద్దుచేసి మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, కనీస వేతనం రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని రామన్నపేటలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ఉపాధి కూలీలతో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరా టాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని సమూలంగా మార్పు చేసి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధిని అందించి ఆర్థిక వెసులుబాటు కల్పించే బాధ్యత నుండి తప్పించుకోవడం కోసమే పేరు మార్చిందని అన్నారు.

ఉపాధి హామీ చట్టం కోట్లాది గ్రామీణ పేదలకు జీవించే హక్కు, బతికే ఆధారము, బేరం ఆడేశక్తి ఇచ్చిందని అన్నారు. కొత్త చట్టంలో హక్కులు లేవని, హామీ లేదని, భద్రత అసలే లేదని ఆవేదన వెలిబుచ్చారు. మోడీ ఉపాధి హామీ స్థానంలో కార్పొరేట్ల లాభాల పథకము తీసుకొచ్చారని అన్నారు. పాత చట్టము ప్రజలకు ఉపయోగపడితే మోడీ తెచ్చిన జిరాంజీ చట్టము గ్రామీణ ధనిక వర్గాలకు, భూసాములకు ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జీరాంజి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రామన్నపేట మండలంలో గత సంవత్సరము నుండి పే స్లిప్ ఇవ్వరు, జాబు కార్డులో నమోదు చేయరు ఇదేమని అడిగితే పట్టించుకునే నాధుడే ఉండడని అన్నారు. కొంతమంది ఏపీవోలు జిల్లాలో పది సంవత్సరాల నుండి ఒకే మండలంలో పనిచేయడం వల్ల ఉపాధి హామీ కూలీల కష్టసుఖాలను, వారి యొక్క సమస్యలను పట్టించుకునే విధంగా లేరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుదీర్ఘకాలం ఒకే మండలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందిని, అధికారులను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిపంపుల, దుబ్బాక గ్రామ సర్పంచులు బొడ్డుపల్లి వెంకటేశం, గట్టు నర్సింహా, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయిని ఆనంద్, గన్నెబోయిన విజయభాస్కర్,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరేళ్ళ నర్సింహా చారి, కందుల హనుమతు, జంపాల అండాలు, కల్లూరి నగేష్, మాజీ వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్,మండల కమిటి సభ్యులు ఆవనగంటి నగేష్,ఎండీ రషీద్,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గంటెపాక శివ కుమార్,వ్యవసాయ కార్మిక సంఘం మరియు ప్రజా సంఘాల నాయకులు ఆవనగంటి స్వామి, గోగు లింగస్వామి,గుండాల ప్రసాద్,పల్లె సత్యం,పుట్టల ఉదయ్,కొమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో వీ-హబ్ ప్రారంభం



**పెద్దపల్లి, మార్చి 05(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం రంగంపల్లిలో నూతనంగా నిర్మించిన వీ-హబ్ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం ఆయన ఈ కేంద్రాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, అవసరమైన ఫర్నీచర్ సిద్ధమైందని వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని మహిళలకు వ్యాపార రంగంలో నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ప్రారంభానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### ఆర్రీవ్-ఆలివ్ కార్యక్రమానికి సన్నద్ధత

రోడ్డు ప్రమాదాల నియంత్రణ లక్ష్యంగా 'ఆర్రీవ్-ఆలివ్' థీమ్‌తో ఏప్రిల్ 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరంతో పోలిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని, రహదారులపై ప్రమాదాలు జరిగితే 10 నిమిషాల్లో అంబులెన్స్ చేరే వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

### మార్చి 6 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలతో పాటు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్ తొలగించాలని సూచించారు. పెండింగ్ ఫైళ్లను 10 రోజుల్లో క్లియర్ చేయాలని, తడి-పొడి చెత్త వేరు సేకరణ, చెత్త నిర్మూలనపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని కోరారు. పారిశుద్ధ్య డ్రైవ్ అనంతరం కూడా రెగ్యులర్‌గా ఫోకస్ పెట్టాలని, ప్రతివారం రిపోర్టు అందించాలని ఆదేశించారు.

### ప్రతి పౌరుడికి ఆధార్ అందేలా చర్యలు


ప్రతి పౌరుడికి ఆధార్ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని, అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ప్రత్యేక డ్రైవ్‌తో ఆధార్ లేనివారిని గుర్తించి కార్డులు జారీ చేయడంతో పాటు సవరణ, అప్‌డేట్ చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.


### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ అవకాశాలు

నిరుద్యోగ యువతీయువకులు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మార్చి 10లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, గుంటూరులో ర్యాలీ ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు అగ్నివీర్ వాయు వెబ్‌సైట్ లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని సూచించారు.

### స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు నేటి నుంచి

99 రోజుల ప్రణాళికలో భాగంగా నేటి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు (గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తల్మాలజీ, జనరల్ మెడిసిన్, డెంటల్) అందుబాటులోకి వచ్చాయి. గురుకుల పాఠశాలల్లోనూ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.





## నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదు

- భూ నిర్వాసితులను అన్ని విధాల ఆదుకుంటాం
- ప్రాజెక్టుల ఏర్పాట్లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు : జహీరాబాద్ ఆర్డిఓ దేవుజా

**న్యాల్ కల్, మార్చ్ 05, (జనం సాక్షి) :** జాతీయ పెట్టు బడులు ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టు ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్ కల్, ఝురాసంఘం మండలాల్లోని వేల ఎకరాల్లో జాతీయ ఉత్పాదక మండలి ప్రాజెక్టు ఏర్పాటు కోసం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లో ఆగే పరిస్థితి లేదని జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి దేవుజా స్పష్టం చేశారు. అందుకు భూ నిర్వాసితులు సంపూర్ణంగా సహకరించాలన్నారు. కలెక్టర్ ప్రావిణ్య ఆదేశం మేరకు గురువారం న్యాల్ కల్ మండలంలోని ముంగి గిరిజన తండాలో ఈపాటికే సేకరించిన నిమ్జ్ ప్రాజెక్టులో సర్వే చేపట్టి హద్దు ఏర్పాటు చేసేందుకు కార్యచరణ చేపట్టారు. స్థానిక తహసిల్దార్ ప్రభులు, జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, తదితర రెవెన్యూ, పోలీస్ బృందంతో కలిసి హద్దులు ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల్లో పలుచోట్ల హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఆందోళనకు గురైన స్థానిక భూనిర్వాసితులు హద్దురాళ్ళను తొలగించేందుకు యత్నించారు. దీంతో అధికారులు, భూ నిర్వాసితుల మధ్య గందరగోళ పరిస్థితి నెలకొంది. భూ నిర్వాసితులను నచ్చ చెప్పేందుకు ఆర్డీవో, డిఎస్పి, సీఐ, తహసిల్దార్ లు తీవ్రంగా యత్నించారు. పలువురు భూనిర్వాసితులు జహీరాబాద్ లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అధికారుల తీరుకు నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.

### కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడం తగదు
#### అధికారుల తీరుపై భూనిర్వాసితుల ఆందోళన

నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం భూములను కోల్పోతున్న భూనిర్వాసితులను అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ జహీరాబాద్, స్థానిక రెవెన్యూ అధికారులు పోలీస్ బృందంతో కలిసి భయాందోళన గురి చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో భూములను వదిలే ప్రసక్తే లేదని పలువురు భూనిర్వాసితులు స్పష్టం చేశారు. హద్దులు వేసేందుకు వచ్చిన అధికారుల బృందానికి సమస్యలతో స్వాగతం పలికారు. పునరావాసం కల్పించాలని, ఎకరానికి రూ:15 లక్షల చొప్పున పరిహారం అందించాలని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులను అన్ని విధాల ఆదుకున్న అనంతరమే సర్వే చేపట్టి హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బలవంతంగా భూసేకరణ చేపడితే చూస్తూ ఊరుకోమని ఎంతకైనా తెగిస్తామని భూ నిర్వాసితులు తెగేసి చెప్పారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ
# మహిళా దినోత్సవ వేడుకలు




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 6 (జనంసాక్షి) : వేములవాడ అర్బన్ మండలం లోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం అంతర్గత ఫిర్యాదుల కమిటీ మరియు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోనరావుపేట మండల తహసీల్దార్ బి. వరలక్ష్మి,చంద్రగిరి గ్రామ సర్పంచ్ ఎం.సంజన మహేష్, బ్యూటిషియన్ ఆర్.లీనా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రగిరి గ్రామ సర్పంచ్ ఎం.సంజన మహేష్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తి స్వరూపిణులన్నారు. విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుని అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కోనరావుపేట మండల తహసీల్దార్ బి.వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని, సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. బ్యూటిషియన్ ఆర్.లీనా మాట్లాడుతూ విద్యార్థులు ఎవరి మీదనూ ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగి సాధికారతను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లావణ్య, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శోభారాణి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.శకుంతల, స్టాఫ్ సెక్రటరీ జి. శ్రీధర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. ప్రసాద్, టిఎస్కెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. కృష్ణ ప్రసాద్,అధ్యాపకులు డాక్టర్ కె. వై. కరుణ, తిరుపతి, నర్సయ్య, ఫకీర్ బాబా,గణేష్,రాధా, నిర్మల, పద్మతో పాటు కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల 'మ్యూల్ అకౌంట్ల'పై పోలీసుల ఉక్కుపాదం




కరీంనగర్ బ్యూరో, 05 మార్చి (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించిన మ్యూల్ అకౌంట్ దారులను కమిషనరేట్ వ్యాప్తంగా గుర్తించారు. కరీంనగర్ లోని నాలుగు ప్రధాన బ్యాంకుల్లో మొత్తం 34 మ్యూల్ ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 162 వరకు నిసీపీ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందినట్లు, ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు దాదాపు 1000కి పైగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటివరకు ఈ వ్యవహారంలో 20 కేసులు నమోదు చేయగా, నిందితులపై కొత్త చట్టం సెక్షన్ 112 బియన్ఎస్ ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ... కొందరు వ్యక్తులు ఏజెంట్లు ఆశజూపే స్వల్ప కమీషన్లకు లోంగి, తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి లింక్ అయిన ఫోన్ నంబర్లను అపరిచితులకు అందజేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుండి దోచుకున్న సొమ్మును ఇతరుల ఖాతాల్లోకి (మ్యూల్ అకౌంట్లు) మళ్లించి, ఆపై తమ అవసరాలకు వాడుకుంటున్నారని వివరించారు."తెలియని వ్యక్తులకు మీ బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా వివరాలు చెప్పడం నేరం. అలా చేసిన వారిని సైబర్ నేరగాళ్లకు సహకరించిన నేరస్థులుగానే పరిగణిస్తామని సీపీ తెలిపారు. అపరిచితులకు మీ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, లేదా ఓటిపి వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వ కండి. నెలవారీ కమీషన్లు ఇస్తామంటూ మీ ఖాతాను వినియోగించుకుంటామని వచ్చే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. మీ ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. బ్యాంకు అధికారుల సమన్వయంతో మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ వేగవంతం చేసి మిగిలిన నేరస్థులను త్వరలోనే పట్టుకుంటామని గురువారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫెరెన్స్ హాలునందు జరిపిన సమీక్షా సమావేశంలో సీపీ స్పష్టం చేశారు.

# ఇసుక అక్రమ రవాణా ఆపేదెవరు?

- ఎవరికీ అందిన కాడికి వాళ్లు దోచుకోవడమే అన్నట్టు సాగిపోతోంది
- సహజ వనరుల దోపిడి దందాను అడ్డుకునే వారే లేరా
- అక్రమ ఇసుకకు అడ్డుకట్ట వేయడంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు విఫలం





పెద్దేముల్ మార్చి 5 (జనం సాక్షి): ఇసుక అక్రమ రవాణా అందిన కాడికి దోచుకోవడమే అన్నట్టు సాగిపోతోంది. పెద్దేముల్ మండల పరిధిలోని సహజ వనరుల దోపిడి దందాను అడ్డుకునే నాథుడే లేకుండా పోయారని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, అలాగే మట్టి రవాణా విచ్చలవిడిగా పెరిగిపోతోంది. పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్, రేగొండి, బొంకూర్, బిజ్జారం వాగు నది పరివాహక ప్రాంతం నుండి అక్రమ దందాలు యదేచ్చగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాత్రి అయితే చాలు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా జోరుగా అక్రమ ఇసుక రవాణా దందా కొనసాగుతోంది. కాసులకు కక్కుర్తి పడి ఈ అక్రమ దందా రోజు రోజుకు పెరిగిపోతున్నట్టు సమాచారం. ఈ దందాతో ప్రభుత్వానికి భారీగానే నష్టం వాటిల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టపగలే వాగులో నుంచి జెసిబి హిటాచీలతో ఇసుకను బయటకు తీసి, డంప్ చేసిన ఇసుక ను రాత్రి కాగానే ట్రాక్టర్లు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఇసుక దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం పట్టీ,పట్టనట్టుగా, వ్యవహరిస్తుండటంతో అనుమానాలకు తావిస్తోంది. కొంత మంది అధికారుల అండతో ఇసుక రవాణా జోరుగా సాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్మిషన్ లేకున్నా ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నిస్తే అధికారుల అండదండలు ఉన్నాయని, ఇష్టం ఉన్నచోట చెప్పుకోండి అంటూ ఎదురు దాడికి దిగుతున్న సందర్భాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. ఇసుక దందాకు అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు బాహటంగానే చర్చించుకుంటున్నారు. ఎవరైనా అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన అధికారులు, పోలీసులు చూసీచూడట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు చేపడుతున్నాం. మండలంలో ఇసుక రీచులను గుర్తించి అక్రమ రవాణాను నిలుపుదల చేస్తామని చెప్పారు.

## మదీనాగూడ అక్రమ బోర్ వాటర్ దందాను నిర్మూలించండి

- బద్దం కొండల్ రెడ్డి డిమాండ్



శేరిలింగంపల్లి, మార్చి 05 (జనంసాక్షి) : వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో నీటి అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న కొంతమంది దళారులు అక్రమ నీటి దందాలు కొనసాగిస్తున్నారని, దానివల్ల మరి ఎంతోమంది నీటి లభ్యత లేక ప్రత్యక్ష నరకం చూస్తున్నారని పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం కొండల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ ను కలిసి అక్రమ నీటి దందాను నిర్మూలించడానికి డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాపిరెడ్డి నగర్ కాలనీ వెనకవైపు ఉన్న మదినగూడ సర్వే నెంబర్ 48లోని స్ప్రింగ్ వ్యాలీ ప్రాంతంలో అక్రమ బోర్వెల్ లను ఏర్పాటు చేసి నిత్యం వాటర్ ట్యాంకర్ ద్వారా పరిసర ప్రాంతాలకు నీటి సరఫరాను చేస్తూ లక్షల రూపాయలు ఆర్జించడంతోపాటు స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. శేరిలింగంపల్లి మండలం పరిధిలోని చందానగర్, మదినగూడ, కొండాపూర్ తదితర ప్రాంతాలలో వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి ఎక్కడపడితే అక్కడ, ఎలా పడితే అలా ప్రైవేట్ బోర్లను ఏర్పాటు చేసుకొని వందల కొద్ది ట్యాంకర్ల ద్వారా నిత్యం అక్రమ నీటి సరఫరా దందను యదేచ్చగా కొనసాగిస్తూ లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారని, ఇది ఏ తరహా న్యాయమో అధికారులే తెలిసి చెప్పాలని కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 48 లోని అక్రమ బోర్ల ద్వారా విపరీతంగా నీటిని తోడుతుండడంతో పరిసర ప్రాంతాలలో పవర్ బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొందని, స్థానికులు ఏమో భూగర్భ జలాలను కాపాడుతుంటే, బయటి ప్రైవేట్ వ్యక్తులు ఇష్టానుసారంగా వాటిని భూగర్భం నుండి పీల్చేస్తూ తీవ్రమైన దారుణాలకు ఒడిగాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా షిఫ్టులవారీగా బోర్ల నుండి నీటిని పీల్చేసి వేల కొద్ది రూపాయలకు అమ్మేసుకుంటూ భారీగా సొమ్మును పోగేస్తున్నారని, ఈ క్రమంలో మద్యం మత్తులో ఉంటున్న డ్రైవర్లు ఇస్తానుసారంగా డ్రైవ్ చేస్తూ అనేక ప్రమాదాలకు కారణం అవుతున్నారని, ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లన్నీ వృత్తి శకటాలను తలపిస్తున్నాయని కొండల్ రెడ్డి వాపోయారు. తక్షణమే శేరిలింగంపల్లి మండలం పరిధిలోని అక్రమ బోర్లను గుర్తించి వాటిని సీజ్ చేయడం ద్వారా ప్రైవేటు నీటి దందాలు నిర్మూలించకపోతే ప్రజా పోరాటానికి, దానివల్ల కలిగే పరిణామాలకు మండల రెవెన్యూ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

### హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి : గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ పోస్టర్‌ను జిల్లా కలెక్ట ర్ ఆశిష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా పరిషత్ సీఈవో, ఆర్డీఓ వీణ, రంగ వెంక టేశ్వర్ గౌడ్ జిల్లా యువజన క్రీడల శాఖ అధి కారి,జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమి షనర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లు త్వరగా
## పూర్తి చేసి గృహప్రవేశం చేయాలి

**లబ్ధిదారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు**

- నిర్మాణ పురోగతి పరిశీలన.. ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోండి
- హౌసింగ్, మున్సిపల్ అధికారులతో సమీక్ష



రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న ఎలిగేటి రూపిక, కొండబత్తిని పండరి, కొయ్యాడ మానస ఇళ్లను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎప్పుడు ప్రారంభమైంది, ప్రస్తుత పురోగతి ఏ స్థాయిలో ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. గృహప్రవేశానికి సిద్ధం చేసుకోవాలని సూచించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ఫోటోలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, లబ్ధిదారులు సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ సాజిద్, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి): దుద్యాల మండలం ఒకటి. రెండు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలు ఎంత మంది ఉన్నారు, శ్యామ్ మ్యామ్ పిల్లలు ఎంత మంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు, శ్యామ్ మ్యామ్ పిల్లల ఆరోగ్య పరిస్థితి పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, హాజరు నమోదు పుస్తకాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ పిల్లలతో ముచ్చటించి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయం అయినందున పిల్లలతో పాటు కలెక్టర్ భోజనం చేశారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సప్లిమెంటరీ పోషకాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు .అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, పిల్లల ఆరోగ్యం మరియు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిణి కృష్ణ వేణి, సూపర్వసర్ జయశ్రీ, నిర్మల,అంగన్వాడి టిచర్‌లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి,మార్చి 05(జనంసాక్షి) : బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పెండింగ్ సిఎంఆర్ రైస్ బకాయిల పై డిసిపి రాం రెడ్డి, అదనపు కలెక్టర్ డి.వేణ తో కలిసి సంబంధిత రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అనేక సార్లు గడువు ఇచ్చినప్పటికీ సిఎంఆర్ లక్ష్యం మేరకు బియ్యం ఇవ్వని రైస్ మిల్లర్లకు విధించిన జరిమానా రుసుము శనివారం నాటికి చెల్లించాలని లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖరీఫ్,రబీ సీజన్ సంబంధించి రికార్డుల మీద ఉన్న ధాన్యం మిల్లులులో కనిపించడం లేదని, దీనికి సంబంధించి మిల్లర్ల నుంచి ధాన్యానికి సంబంధించిన బకాయిలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. బకాయిలు చెల్లించని మిల్లర్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు. డిఫాల్టర్లుగా గుర్తించడం విలువలకు సంబంధించి ఓనర్లు, డైరెక్టర్, లీజు దారులు, కుటుంబ సభ్యుల ఆస్తులపై లావాదేవీలు జరగకుండా కట్టడి చేస్తామని అన్నారు. డిసిపి రాంరెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లర్లు డిఫాల్టర్లుగా మారితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని, అనవసరంగా జైలుకు వెళ్ళాల్సి వస్తుందని, అటువంటి పరిస్థితి తెచ్చుకోకుండా బకాయిలు సకాలంలో చెల్లించా లని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఎసిపి రమేష్ పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెనోవా క్యాన్సర్ సెంటర్‌లో అరుదైన శస్త్రచికిత్స

- మహిళ ఛాతీ నుంచి 15X10 సెం.మీ భారీ కణితి తొలగింపు
- 8-10 గంటల సర్జరీ.. రోగి త్వరలో డిశ్చార్జ్



ముషీరాబాద్, మార్చి 5 (జనంసాక్షి) : విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ వైద్యులు అరుదైన, అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్యరంగంలో మరో మైలురాయిని నెలకొల్పారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 36 ఏళ్ల మహిళ కుడి ఛాతీలో ఏర్పడిన 15×10 సెం.మీ పరిమాణంలోని భారీ కణితిని సురక్షితంగా తొలగించి ఆమెకు కొత్త జీవితం అందించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సంసున్ నహర్ బీబీ గత కొద్ది రోజులుగా తీవ్ర శ్వాసకోశ సమస్యలు, ఛాతీ నొప్పితో బాధపడుతూ అనేక ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. వైద్య పరీక్షల తర్వాత ఆమెకు "రైట్ హెమిథొరాక్స్ ఫైబ్రోమాటోసిస్" అనే అరుదైన క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. శస్త్రచికిత్స తప్పనిసరి అని, అది అత్యంత సంక్లిష్టమైనదని, లక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో నిరాశకు గురైన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ గురించి తెలుసుకుని వైద్య బృందాన్ని సంప్రదించారు.
సెంటర్ మెడికల్ డైరెక్టర్, ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. యు. ఆజాద్ చంద్రశేఖర్ ఈ కేసును సవాలుగా స్వీకరించి చికిత్స ప్రారంభించారు. సీఈసీటీ, పెట్-సీటీ స్కాన్, ట్రూ-కట్ బయాప్సీ నివేదికల ఆధారంగా ఖచ్చితమైన ప్రణాళికతో 'వాట్స్ గైడెడ్ ఎక్సిషన్' అనే అత్యాధునిక విధానంతో శస్త్రచికిత్స చేపట్టారు. సుమారు 8 నుంచి 10 గంటల పాటు సాగిన ఈ శస్త్రచికిత్సలో గుండె, ఊపిరితిత్తులు వంటి కీలక అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా కేవలం కణితినే విజయవంతంగా తొలగించారు.
ఈ సందర్భంగా డా. యు. ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇది అత్యంత క్లిష్టమైన కేసు. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో మొత్తం ఊపిరితిత్తిని తొలగించాల్సి వస్తుంది. కానీ రోగి వయస్సు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా, నైపుణ్యంతో శస్త్రచికిత్స చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, మంచి స్పందన చూపుతోందని, పది రోజుల్లోనే పూర్తిస్థాయి ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విజయానికి సహకరించిన వైద్య, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రోగి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఎంతో నిరాశలో ఉన్న తమకు డా. ఆజాద్ చంద్రశేఖర్ నమ్మకం కలిగించారని, తిరిగి ఆశలు చిగురించేలా చేశారని చెప్పారు. అత్యంత నైపుణ్యంతో, నిబద్ధతతో, తక్కువ ఖర్చుతో విజయవంతంగా చికిత్స అందించిన వైద్య బృందానికి, నర్సింగ్, ఇతర సిబ్బందికి ఎంతో ఋణపడి ఉన్నామని, ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వ్యక్తం చేశారు.

## "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం విజయవంతం చేయాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష



కరీంనగర్ బ్యూరో, మార్చి 5 (జనంసాక్షి) : ఈనెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు జిల్లాలో చేపట్టనున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై గురువారం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఐదు దశల్లో 99 రోజులపాటు "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమ నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సంసిద్ధం కావాలన్నారు. శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈ సభల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేకూరుస్తున్న లబ్ధి, వివిధ పథకాల గురించి వివరించాలని తెలిపారు. శాఖల వారీగా 10 వారాలపాటు అమలు చేసే ప్రత్యేక కార్యాచరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. శాఖల వారీగా 10 రకాల అంశాలతో 99 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రణాళిక శాఖ నోడల్ గా వ్యవహరిస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్-అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత - మత్తు పదార్థాల నిర్మూలన, రైతు సంక్షేమం - వ్యవసాయం, విద్య, యువత - క్రీడలు, మహిళలు పర్యావరణం అంశాల్లో నిర్వహించిన కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ ను పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు చేయాలి

- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు విస్తృత కార్యక్రమాలు
- మున్సిపాలిటీల్లో పరిశుభ్రత డ్రైవ్ ప్రారంభం : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- ప్రజాప్రతినిధులు, అధికారులతో లాంఛన కార్యక్రమాలు




కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 5 (జనంసాక్షి) : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం గుర్తించిన 10 ప్రధాన అంశాల్లో పర్యావరణ పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమాలను మున్సిపల్ శాఖ ద్వారా ప్రత్యేకంగా చేపట్టాలని పేర్కొన్నారు. మార్చి 6 నుంచి 15 వరకు మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, మొదటి రోజు అన్ని వార్డుల్లో లాంఛనంగా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ స్థాయిలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రముఖులు, ప్రజల సమక్షంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడం, 99 రోజుల ప్రణాళిక లక్ష్యాలు, రోజువారీ కార్యక్రమాలను వివరించడం, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాల్గొనే అధికారులు, ప్రజలందరూ ఈ కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతిజ్ఞ చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మార్చి 6 నుంచి 15 వరకు ఏక కాలంలో పరిశుభ్రత డ్రైవ్, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో మున్సిపల్ కమిషనర్లు పరి శుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మార్చి 12న జిల్లాలో శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని, ఇందులో కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులు, సర్పంచ్‌లు, చైర్‌పర్సన్‌లు, వార్డు మెంబర్లు పాల్గొనాలని తెలిపారు. శిక్షణలో ప్రభుత్వ పథకాలు, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ మధుమోహన్, ఆర్డీఓ వీణ, సబ్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, జిల్లా పంచాయతీ అధికారి డీపీఓ, జడ్పీ సీఈఓ, డీడబ్ల్యూఓ, ఐడీఓసీ నుంచి అన్ని ఎంఎస్‌వోలు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంసీలు పాల్గొన్నారు.

# ఫైనల్‌లోకి భారత క్రికెట్ జట్టు చేరడం పట్ల మహేష్‌కుమార్ గౌడ్ హర్షం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐసీసీ టి20 క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరడం పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఐసీసీ టి20 వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్ పై ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జట్టు ఆటగాళ్లు పట్టుదలతో, సమష్టిగా ఆడి ఈ ఘనత సాధించడం అభినందనీయమన్నారు. ఫైనల్‌లో కూడా ఇదే ఉత్సాహం, పోరాట పటిమతో ఆడి భారత జట్టు విజయం సాధించి దేశానికి వరల్డ్ కప్‌ను అందించాలని ఆకాంక్షించారు. ఆటగాళ్లకు, కోచింగ్ సిబ్బందికి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# 8 నుంచి విమెన్ హాకీ కప్ టోర్నమెంట్

- అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి



హైదరాబాద్, మార్చి5 (జనంసాక్షి) : ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ -2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము.మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాల్గి÷ఫైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి.ఇప్పటికే ఈ టోర్నమెంట్లో పాల్గొనబోతున్న అన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఘనంగా స్వాగత సత్కారాలు చేసింది. దానితోపాటు ప్రాక్టీస్‌కు కావలసిన అన్ని వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల వసతి సదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగింది. అన్ని జట్ల క్రీడాకారిణిలు ఆధునికరించిన గచ్చిబౌలి ఆస్ట్రోటర్ఫ్ స్టేడియంలో బ్రహ్మాండంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రతినిధులు, క్రీడాకారుల కోసం నగరంలోని వారసత్వ ప్రదేశాల పర్యటనలు, వినోద కార్యక్రమాల రూపకల్పన కూడా చేపట్టాలని భావిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం వల్లే ఇలాంటి అంతర్జాతీయ టోర్నమెంట్లను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని గర్వంగా చెప్పగలుగుతున్నాము.రెండేళ్లలోనే తెలంగాణ క్రీడా శాఖ గణనీయమైన అభివృద్ధి దిశగా ముందుకెళ్తోంది. గచ్చిబౌలి లో జరిగే హాకీ పోటీలకు మీరంతా ప్రతి దినం హాజరై ఈ కార్యక్రమానికి విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిందిగా కోరుతున్నట్లు మంత్రి వెల్లడించారు.

# బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

- రాజకీయ ఒత్తిళ్లు కారణమై ఉండొచ్చన్న మమత



కోల్‌కతా, మార్చి 5 (జనంసాక్షి) : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ లోక్ భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. సీవీ ఆనంద బోస్ రాజీనామాపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆయన రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని చెప్పారు. 'గవర్నర్ రాజీనామాకు గల కారణం ప్రస్తుతానికి నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే నాకేమీ ఆశ్చర్యం అనిపించడం లేదు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఆయన మీద రాజకీయపరమైన ఒత్తిడి ఉండొచ్చు. కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందింది. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో కేంద్ర మంత్రి నన్ను సంప్రదించలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహకార విధానానికి కేంద్రం తగిన గౌరవం, ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలని మమత వ్యాఖ్యానించారు. ఇక.. గవర్నర్‌గా రాజీనామా చేసిన సీవీ ఆనంద బోస్ పశ్చిమ బెంగాల్‌లో మూడున్నరేళ్లు సేవలందించారు. ఆయనకు, సీఎం మమతా బెనర్జీకి మధ్య అనేక విభేధాలు తలెత్తాయి. అందువల్లే గవర్నర్ల వ్యవస్థను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆనంద బోస్ ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన కేంద్ర మంత్రుల్ని తన రాజీనామా విషయంపై సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది.

# మరోమారు సోనూసూద్ ఉదారత

- గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి వసతి సైకర్యం ఆఫర్



ముంబై, మార్చి5 (జనంసాక్షి) : కరోనా కష్టకాలంలో నటుడు సోనూసూద్ దేశవ్యాప్తంగా ప్రజలను ఎంతగా ఆదుకున్నారో తెలిసిందే! వలస కార్మికులకు అండగా నిలిచారు. ఎంతో మందికి ఉపాధి చూపించారు. విదేశాల్లో చిక్కుకున్న వారిని ప్రత్యేక విమానాల ద్వారా తమ ఇళ్లకు చేర్చారు. ఇలా ఆపదలో ఉన్న వారికి 'నేనున్నా' అంటూ అండగా నిలుస్తూ.. తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పుడు యుద్ధ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఆయన సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఉచితంగా వసతి కల్పిస్తామని ప్రకటన చేశారు. ఏ దేశస్థులైనా సరే, ఎలాంటి షరతులు లేకుండా ఈ సదుపాయం ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. 'కష్ట సమయంలో మనసున్న మనిషిగా ముందుకు రావడం ఎంతో అవసరం. సహాయం అవసరమైనవారు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా డిటైల్స్‌తో మెసేజ్ చేయండి. మా టీమ్ తక్షణమే స్పందిస్తారు' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. తనను సంప్రదిస్తే వారికి అక్కడే ఉచిత వసతిని సమకూరుస్తానని ప్రకటించారు.

# 2027 కల్లా నాంపల్లి స్టేషన్ ఆధునీకరణ




- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి5 (జనంసాక్షి) : హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌ను 2027 చివరికల్లా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్ట్ తరహాలో ఆధునిక హంగుల్నీ కల్పిస్తామని వెల్లడించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. తొలి దశలో రూ.327 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, దశల వారీగా స్టేషన్ రూపు రేఖలే మారుస్తామని స్పష్టం చేశారు. నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి మెట్రో స్టేషన్‌కు స్కై వాక్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే సికింద్రాబాద్ ఆధునీకరణ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. అలాగే చర్లపల్లిని అత్యాధునకంగా తయారు చేశామని అన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు సాగుతున్నాయని అన్నారు.

# ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

## సీఎస్‌కు టీచర్ ఎమ్మెల్సీల విజ్ఞప్తి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను, విద్యారంగం సవాళ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమరయ్య కోరారు. గురువారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి విన్నపాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కపల్లి పెంటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రధాన డిమాండ్లు చేశారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ సిబ్బందికి నేరుగా 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీ, ఎస్ఎస్ఏ, ఐఈఆర్పీ, యూఆర్ఎస్ సిబ్బంది అందరికీ క్యాష్‌లెస్ డిజిటల్ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని చెప్పారు. పీఆర్సీ అమలు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల నుంచి హెల్త్ కార్డ్ కోసం 1.5 శాతం కంట్రిబ్యూషన్ వసూలు చేయాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నెం190 ద్వారా జీవో 317 బాధితులైన ఉపాధ్యాయులకు తక్షణమే బదిలీలు చేపట్టాలనని విజ్ఞప్తి చేవారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యా కమిషన్ రూపొందించిన సిఫార్సులపై ఎమ్మెల్సీలు అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

# మిషన్ భగీరథలో మరమ్మతులు

## రెండ్రోజులు పాటు నీటి సరఫరా నిలిపివేత

మెదక్, మార్చి5 (జనంసాక్షి) : వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారీకి చర్యలు తీసుకున్నట్లు మిషన్ భగీరథ ఏఈ నాగభూషణం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పెద్దరెడ్డిపేట వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు, రాయిపహాడ్ వద్ద స్లూయి?సవాల్స్ రిపేర్లు, సివిల్ పనులు, సంపులు శుభ్రపరచడం తదితర నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తిచేయడం కోసం సింగూరు నుంచి జిల్లాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. మెదక్ నియోజకర్గంలోని 275 నివాస ప్రాంతాలు, మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలు, అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లోని 80 నివాస ప్రాంతాల పరిధిలో నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వేసవి నిర్వహణ పనుల కోసం చేపడుతున్న ఈ పనులను గుర్తించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# అలిపిరి నుంచి తిరుమలకు.. కాలినడకన కవిత

- లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు



తిరుపతి, మార్చి 5 (జనంసాక్షి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకునేందుకు తిరుపతి చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి కాలినడకన తిరుమల బయల్దేరిన ఆమె.. ముందుగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను మానసిక వేదన అనుభవించానని కవిత తెలిపారు. అయితే దేవుడి దయతో తనపై ఉన్న కేసును కోర్టు పూర్తిగా కొట్టివేసిందని చెప్పారు. ఆ కేసు నుంచి విముక్తి లభిస్తే కాలినడకన తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నానని, ఆ మొక్కును తీర్చుకోవడానికి ఇప్పుడు తిరుమలకు వచ్చానని వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ పార్టీని స్థాపించనున్నట్లు చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేసే పార్టీగా దీనిని తీర్చిదిద్దుతామని కవిత తెలిపారు. తెలంగాణ ఫస్ట్ అనే నినాదంతో ప్రజల సమస్యలను మైక్రో లెవెల్‌లో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సరిగా నిర్వహించలేక పోయాయని ఆమె విమర్శించారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై తమకు ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని కవిత స్పష్టం చేశారు. అలాగే హైడ్రా చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. హైడ్రా పేదలను ఇబ్బంది పెట్టి పెద్దల కోసం పనిచేస్తోందని ఆరోపించారు.

# హైదరాబాద్‌లో మరో రియల్ మోసం

- ప్లాట్ల పేరుతో జనానికి కుచ్చుటోపీ



హైదరాబాద్, మార్చి5 (జనంసాక్షి) : హైదరాబాద్ లో మరో రియల్ ఎస్టేట్ మోసం వెలుగులోకి వచ్చింది. అపార్ట్‌మెంట్ల నిర్మాణం పేరుతో వందల కోట్ల రూపాయలకు కుచ్చుటోపీ పెట్టింది త్రిపురా కన్‌స్ట్రక్షన్స్. దీంతో పోలీసులు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పసుపులేటి సుధాకర్ అతని భార్యను అరెస్ట్ చేశారు . మరోవైపు సుధాకర్ కూతురు అల్లుడు పరారీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా కావలకు చెందిన పసుపులేటి సుధాకర్ ఐదవ తరగతి వరకే చదువుకున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా సెంట్రింగ్ మేస్త్రిగా పని చేశాడు. నెల్లూరులో బతకలేక తెలంగాణకు మకాం మార్చాడు. ఇళ్ల నిర్మాణంలో కిటుకులు నేర్చుకున్నాడు. అంచలంచలుగా ఎదిగాడు. త్రిపురా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పెట్టాడు. కోట్ల రూపాయలు కళ్లరా చూశడు. కావలిలో 100 ఎకరాలకు పైగా భూములు కొనుగోలు చేశాడు. డబ్బుకు కొదువ లేదు. కాబట్టి పొలిటీషియన్ కావాలనుకున్నాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎన్నికల్లో పోటీకి చకచక పావులు కదిపాడు. 2019లో జనసేనలో చేరిన సుధాకర్ కావలి నియోజక వర్గం నుంచి పోటీ చేశాడు. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన గెలవలేకపోయాడు. తిరిగి హైదరాబాద్ కు చేరుకొని కొద్ది రోజులు బీజేపీలో చేరాడు. తర్వాత కోట్ల రూపాయలు ఫండింగ్ చేస్తానంటూ టీడీపీ, వైసీపీ ముఖ్యనేతలతో లాబీయింగ్ చేశాడు. కానీ అవేవి పని చేయలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగితే డిపాజిట్ కూడా రాలేదు. 2019, 2024 ఎన్నికల్లో దాదాపు 150 కోట్ల రూపాయలు ఖర్చు చేశాడు సుధాకర్. అప్పటివరకు తాను సంపాదించిన దానితో పాటు ప్లాట్ల పేరుతో జనం నుంచి వసూలు చేసిన డబ్బును కూడా ఎన్నికలలో ఖర్చు పెట్టేసాడు. దీనితో ఇంకేముంది జనం ముందు దోషిగా నిలబడ్డాడు. పసుపులేటి సుధాకర్ పై గతంలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ నయీంకి బినామీగా పని చేశాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అలాగే కొందరు ప్రముఖ రాజకీయ నేతలతో సన్నిహిత సంబంధాలను అడ్డం పెట్టుకొని త్రిపురా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీని ఏర్పాటు చేశాడు. అయితే ప్లాట్ల విక్రయాల్లో జనం నెత్తిన కుచ్చుటేపి పెట్టేసాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

# గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై జోక్యం చేసుకోండి

- మీనాక్షికి మూసీ జన్ ఆందోళన్ లేఖ

హైదరాబాద్ (జనంసాక్షి) : మూసీ నది ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు విషయంలో జోక్యం చేసుకోవాలని ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్‌కు మూసీ జన్ ఆందోళన్ లేఖ రాసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ గ్రామంలో 10.34 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం సంకల్పించిందని దీని వల్ల మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్ నివాసులను ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా తెలంగాణ ప్రభుత్వం98.20 ఎకరాల రక్షణ శాఖ భూమిని బదిలీ చేయమని కోరడంతో పాటు ఈ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్?నాథ్ సింగ్ ను గత నెల 12న స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారని ప్రజల వ్యతిరేకతను, ప్రజాస్వామ్య ప్రక్రియలను పట్టించుకోకుండా ఇలా చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు.

ప్రతిపాదిత మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగమైన 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్' విషయంలో మేము తీవ్ర అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నామమి. సివిల్ సొసైటీ కార్యకర్తలు, పర్యావరణవాదులు, మానవ హక్కుల సంస్థలు, స్థానిక నివాసితులతో కూడిన ఈ నెట్వర్క్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్య చర్చల ద్వారా పూర్తి సమీక్ష చేయాలన్నారు. ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవాలని మీనాక్షి నటరాజన్‌ను కోరారు. విగ్రహం ఏర్పాటును మహాత్మా గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారని లేఖలో ప్రస్తావించారు. 2013 భూసేకరణ చట్టం కింద సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ నుండి ఈ ప్రాజెక్ట్‌కు మినహాయింపు ఇవ్వడాన్ని ఎంజేఏ ఖండిస్తోందిని 2017లో రాష్ట్ర సవరణ ద్వారా ఈ చట్ట ఉద్దేశాన్ని, ప్రజల ప్రయోజనాలను, ఆహార భద్రతను దెబ్బతీస్తున్నారని పేర్కొంది. ప్రస్తుత విధానం నది పర్యావరణ వ్యవస్థకు, తెలంగాణ సమాజానికి శాశ్వత హానికర పరిణామం హెచ్చరిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుత రూపంలో కొనసాగితే మన సహజ వారసత్వానికి తిరిగి రాని నష్టం కలిగిస్తుందని గుర్తించాలన్నారు. స్థానిక ప్రజలలో ఉన్న ఈ అసంతృప్తిని రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ అధిష్టానానికి తెలియజేయాలని మీనాక్షిని కోరారు.

# మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీలు నమోదు

హైదరాబాద్, మార్చి 5 (జనంసాక్షి) : తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మంలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని, వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# ఇంటర్‌లో మాల్ ప్రాక్టీస్

- ఐదుగురు పట్టివేత

హైదరాబాద్, మార్చి5 (జనంసాక్షి) : రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి . గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం జ్యూలజీ , హిస్టరీ పరీక్షలు జరిగాయి . ఈ పరీక్షలో 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున పట్టుబడ్డారని అధికారులు వివరించారు. గురువారం నాటి పరీక్షలో మొత్తం 4,29,600 మంది విద్యార్థులకు గాను 4,17,656 మంది హాజరయ్యారు. 11,944 మంది గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు వివరించారు.

# రహదారి పక్కన వృక్షాల తొగింపు

- తరలించేందుకు ప్రత్యేక పాలసీ తీసుకువస్తాం
- ఏపీ అసెంబ్లీలో డిప్యూటీ సింఎం పవన్ కళ్యాణ్

అమరావతి, మార్చి5 (జనంసాక్షి) : రహదారుల పక్కన ఉన్న భారీ వృక్షాలను విస్తరణ సమయంలో తొలగిస్తున్నారని.. వందేళ్లకు పైగా వయసున్న చెట్లను తొలగించటం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. వాటిని వేరే ప్రాంతానికి తరలించడానికి ప్రత్యేక పాలసీ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. నెలరోజుల్లోనే ఈ విషయంపై సానుకూల నిర్ణయం వస్తుందని తెలిపారు. పంచాయతీరాజ్ బడ్జెట్ రూ.15,485కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖ రూ.11,217కోట్లు, అటవీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు రూ.713కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. కొత్త జిల్లాల్లో జిల్లా పరిషత్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ఎన్నికల్లోపు ఈ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణపైనా దృష్టి పెడతామని తెలిపారు. మొక్కలకు జియో ట్యాగింగ్ విషయం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వివరించారు. పట్టుబడిన ఎర్రచందనం విక్రయంపై మంత్రివర్గ ఉపసంఘం త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఏపీలో మూడు వేల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370